Published from Visakhapatnam

PRGI NO:APTEL/25/A1888

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com





విశాఖపట్నం
Visakhapatnam

సంపుటి : 01 | సంచిక : 219 | మంగళవారం | జూలై 28, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 01 | Issue No : 219 | Tuesday | 28 JULY 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupati Circulated at Andharapradesh & Telangana



## తమిళనాడు సీఎం విజయ్ సర్కార్‌కు ఎదురుదెబ్బ..

- కరూర్ బాధితుల నియామకాలు రద్దు
- తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చే జీవోను కొట్టివేసిన మద్రాస్ హైకోర్టు
- ఈ నియామకాలు రాజ్యాంగంలోని సమానత్వ, సమాన అవకాశాల హక్కులకు విరుద్ధమని వ్యాఖ్య
- ప్రభుత్వ ఉద్యోగాలను విషాదాలకు పరిహారంగా ఇవ్వలేమన్న కోర్టు

తమిళనాడు : కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను

- మిగతా 2లో..

### ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల

# పనితీరు మారాలి

- ఎల్ నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కార్యక్రమాలు
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్ నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు... రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు.. ప్రత్యామ్నాయ పంటలు వేసు కునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.




దీని నిమిత్తం క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ఏ ప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనేదానిపై రైతులకు వివరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరును చదివి వినిపించినప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను సీఎం చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందని అన్నారు.

2 పేజీలో..

2 లో

# ఇరాన్ నౌకపై ఉక్రెయిన్ దాడి..

### తీవ్ర పరిణామాలుంటాయని టెహ్రాన్ హెచ్చరిక!

- దేశ భద్రతను కాపాడుకోవడానికి ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోమన్న ఇరాన్
- ఉక్రెయిన్ వైఖరిని ఐరోపా దేశాలు అడ్డుకోవాలని డిమాండ్
- రాబోయే రోజుల్లో ఉక్రెయిన్ కు తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరిక

ఉక్రెయిన్ : కాస్పియన్ సముద్రంలో ప్రయాణిస్తున్న తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ బలగాలు జరిపిన దాడిలో ఒక నావికుడు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ దాడిపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశ భద్రతను, ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఎంతటి కఠిన చర్యలకైనా వెనకాడబోమని స్పష్టం చేసింది. ఈ చర్యకు పాల్పడిన ఉక్రెయిన్‌కు రాబోయే రోజుల్లో తగిన శాస్తి జరుగుతుందని, యుద్ధం మరింత ముదరకుండా చూడాలంటే కీవ్ వైఖరిని ఐరోపా దేశాలు వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేసింది.



పశ్చిమాసియాలో ఇప్పటికే యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. తమకు రష్యా-ఉక్రెయిన్ పోరుతో ఎలాంటి సంబంధం లేదని ఇరాన్ పదేపదే చెబుతున్నప్పటికీ... రష్యా నుంచి ఇరాన్ శాటిలైట్ సమాచారాన్ని పొందుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. గల్ఫ్ ప్రాంతాలు, అమెరికా మిలిటరీ స్థావరాలపై రష్యా సేకరించిన ఉపగ్రహ చిత్రాలను ఇరాన్ తన దాడుల కోసం వాడుకుంటోందని వ్యాఖ్యానించారు. అమెరికా విధించిన ఆంక్షల వల్ల చైనా

2 లో..

### డీఎస్సీ ఆరోపణలపై

### జగన్‌తో బహిరంగ చర్చకు

# నేను సిద్ధం

- మంత్రి నారా లోకేశ్
- వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్, భూకుంభకోణాలపైనా చర్చిద్దామని లోకేశ్ సవాల్
- జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' జబ్బు ఉందని ఎద్దేవా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయమే లక్ష్యమన్న లోకేశ్
- కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేడర్‌కు పిలుపు



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ అధినేత జగన్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంపై జగన్‌తో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, దమ్ముంటే చర్చకు రావాలని

- మిగతా 2లో..



### తక్కువ ధరకే నాణ్యమైన

# బియ్యం..

- పౌరసరఫరాల శాఖ నిర్ణయాన్ని స్వాగతించిన పవన్ కల్యాణ్
- ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం
- సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ. 52
- పచ్చి బియ్యం కేజీ రూ. 50

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఊరట కలిగిస్తూ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని విక్రయిం చనున్నట్లు ప్రకటించారు. బహిరంగ మార్కెట్లో విపరీతంగా పెరుగుతున్న ధరల నుంచి సామాన్యులను

- మిగతా 2లో..

### పీహెచ్‌సీల పనితీరుకు

### 'ఆరోగ్య ఫలితాలే'

# ప్రామాణికం



### సేవల సంఖ్య ఆధారిత ర్యాంకుల విధానానికి స్వస్తి

- మాతా శిశు ఆరోగ్యం నుంచి ప్రజల సంతృప్తి వరకు 21 అంశాల ఆధారంగా మార్కులు
- మాతృత్వ మరణాలు,సిజేరియన్లు తగ్గిన ఆసుపత్రులకు ర్యాంకింగ్ లో ప్రాధాన్యం
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మదింపులో కూటమి ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎంతమంది రోగులకు సేవలందించారు ఎన్ని పరీక్షలు చేశారు. ఎన్ని ప్రసవాలు నిర్వహించారు. అనే లెక్కలను మాత్రమే కాకుండా... అందించిన వైద్య సేవల వల్ల ప్రజల ఆరోగ్యంలో ఎంత మార్పు వచ్చింది. మాతా శిశు మరణాలు తగ్గాయా రక్తపోటు, మధుమేహ రోగులకు నిరంతర చికిత్స అందుతోందా లేదా? సేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా అనే ఫలితాల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గుర్తించనున్నారు.ఇందుకోసం మొత్తం 21 కీలక పనితీరు సూచికలతో కొత్త ర్యాంకింగ్, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. 'సంజీవని', 'మాతృత్వ', 'క్షేమ' కార్యక్రమాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును అనుసంధానిస్తూ... గ్రామస్థాయి వైద్య వ్యవస్థను మరింత జవాబుదారీగా, ఫలితాల ఆధారితంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దడమే ఈ కొత్త ర్యాంకింగ్ విధానం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

ప్రస్తుతం 5 అంశాల ఆధారంగానే వైద్యారోగ్య శాఖ ర్యాంకులను ప్రకటిస్తోంది. ఓపీ విధానంలో రోగుల సంఖ్య, ఆసుపత్రిలో చేరినవారు, ల్యాబ్ పరీక్షలు, ప్రసవాలు, గర్భనిరోధక సాధనాల వాడకం వంటి ఐదు అంశాల ఆధారంగానే పీహెచ్‌సీల పనితీరును అంచనా వేసేవారు. ఈ విధానంలో సేవల సంఖ్య మాత్రమే తెలుస్తోందని... వ్యాధుల నివారణలో సాధించిన పురోగతి, మాతా శిశు ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ, రోగులకు నిరంతర చికిత్స వంటి కీలక అంశాలు ప్రతిబింబించడం లేదని అధికారుల పునస్సమీక్షలో తేలింది. ఈ విధానం అమలు, ఫలితాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు అధికారులు పునస్సమీక్ష జరిపారు. సేవలు మెరుగుపడాలంటే 21 కొలమానాల ఆధారంగా ర్యాంకులను ప్రకటించాల్సిన అవసరం ఉందని మంత్రికి నివేదించారు.

2 పేజీలో..

# హంద్రీనీవాతో కుప్పానికి జలకళ

- కుప్పంలో పర్యాటకరంగ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేకదృష్టి
- స్థానికంగా పరిశ్రమల రాకతో వేలాదిమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు
- మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి- ఆర్థిక శక్తిగా ఎదగాలి
- కుప్పం నియోజకవర్గంలో నారా భువనేశ్వరి నాలుగు రోజుల పర్యటన ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి,కుప్పం:

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపి, ప్రజలకు సంక్షేమం అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం నియోజకవర్గానికి పెద్ద ఎత్తున పరిశ్రమల రాకతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. హంద్రీనీవాతో కుప్పం ప్రజల దశాబ్ధాల కల నెరవేరిందన్నారు. మహిళలు ధైర్యంగా ముందడుగు వేసి ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు.

2 లో





## తిరుపతిలో కలకలం..

- తొలి కరోనా కేసు నమోదు
- తిరుపతి అర్బన్ లో 65 ఏళ్ల వృద్ధురాలికి కరోనా పాజిటివ్
- కుటుంబ సభ్యులకు వైరస్ లక్షణాలు లేవన్న అధికారులు
- రాష్ట్రంలో 49కి చేరిన కోరోనా కేసులు

ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి : ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. తాజాగా తిరుపతిలో తొలి కరోనా కేసు నమోదయింది. తిరుపతి అర్బన్ ప్రాంతానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలికి కోవిడ్ పాజిటివ్‌గా తేలడంతో తిరుపతిలో మొదటి కేసు నమోదైంది.

2 పేజీలో..

# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ..

### రూ.10, రూ.20 నోట్ల ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- ప్రయోగాత్మక పరిశీలన కోసం వంద కోట్ల చొప్పున నోట్లను ముద్రించనున్న ఆర్బీఐ
- కాగితం నోట్లను రద్దు చేసే ఆలోచన లేదని ప్రభుత్వం స్పష్టీకరణ
- ఎక్కువ కాలం మన్నిక, నకిలీని అరికట్టడం పాలిమర్ నోట్ల ప్రత్యేకత

న్యూఢిల్లీ : దేశంలో ప్లాస్టిక్ లేదా పాలిమర్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముం దడు గు వేసింది. రూ. 10, రూ. 20 విలువ కలిగిన ప్లాస్టిక్ పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) చేసిన ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో ఒక లిఖిత పూర్వక సమాధానంలో వెల్లడించారు.ఈ ప్రయోగాల్లో భాగంగా రూ. 10, రూ. 20




డినామినేషన్లలో వంద కోట్ల చొప్పున పాలిమర్ నోట్లను ఆర్బీఐ జారీ చేయనుంది.

2 లో

ప్రజాభూమి
మంగళవారం, జూలై 28, 2026


# తమిళనాడు సీఎం విజయ్ సర్కార్‌కు ఎదురుదెబ్బ..

మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఈ నియామకాలు రాజ్యాంగంలోని 14, 16 అధికరణాలకు (సమానత్వపు హక్కు, ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు) విరుద్ధమని పేర్కొంటూ సోమవారం కీలక తీర్పు వెలువరించింది.
జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్. శక్తివేల్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసింది. "విషాదకర ఘటనలు సంభవించినప్పుడు పరిహారంగా ప్రభుత్వ ఉద్యోగాలను పంపిణీ చేయలేరు. ఇది ఇప్పటికే కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారికి, విధి నిర్వహణలో ఉండి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అన్యాయం చేయడమే అవుతుంది" అని కోర్టు అభిప్రాయపడింది. ఇటువంటి నియామకాలను అనుమతిస్తే భవిష్యత్తులో అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల వంటి ఇతర ఘటనలు జరిగినప్పుడు కూడా బాధితులు ఇదే తరహా డిమాండ్లు చేసే ప్రమాదం ఉందని ధర్మాసనం హెచ్చరించింది.గత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్?లో ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నిర్వహించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, తన కరూర్ పర్యటనలో బాధితుల కుటుంబాలకు చెందిన 31 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను అందజేశారు. వారిలో ఇప్పటికే 29 మంది విధుల్లో చేరారు.
ఈ నియామకాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, ప్రభుత్వ నిర్ణయం చట్టవిరుద్ధమని తేల్చింది. నేరుగా ఉద్యోగాలు కల్పించడానికి బదులుగా బాధితుల కుటుంబ సభ్యులకు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక శిక్షణ వంటివి అందించి, వారు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించాలని ప్రభుత్వానికి సూచించింది.

## సంపాదకీయం

### జవాబుదారీతనం కోల్పోవడంతోనే ప్రజా ఉద్యమాలు !

దేశంలో యువత తక్షణ స్పందన కోరుకుంటోంది. సమస్యలపై తక్షణ చర్యలను కోరుతోంది. రాజకీయ నాయకులు లేదా పాలకులు సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతు న్నారు. కావాలనే తాత్సారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు ఉన్నాయి. ఏ సమయంలో చేయాల్సిన పనిని అప్పడే చేయడం లేదు. నాన్చివేత ధోరణి కారణంగా దేశం అడుగు ముందుకు వేయడం లేదు. జెన్జీని తీసుకుని వచ్చి గొప్పలు చెప్పారు. ప్రజలు దీనికి బలపుతున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు జెన్జీ శ్రేణులను తగ్గించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహార ధరలు పెరుగుతున్నా పట్టింపు లేదు. మందుల మాఫియాను అరికట్టడం లేదు. అవినీతి వేళ్లూనుకుని పోయింది. అయినా పట్టించుకోవడం లేదు. ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ పట్టించుకోక పోవడం వల్లనే ..నీట్ పేపర్ లీక్ తరవాత యువత ఉద్యమించింది. ఇది మొదలు కాదు..అంతం కూడా కాదని పాలకులు గుర్తించాలి. ఇంతటితో ఇక పీడ విరగడ అయ్యిందని పాలకులు భావిస్తే అంతకుమించి మూల్యం చెల్లించుకో తప్పదు. యువత బొద్దింకలుగా మారి దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టే పరిస్థితి ఎందుకొచ్చిందని ఆత్మపరి-శీలన చేసుకోవాలి. పార్లమెంట్ జరుగుతోంది. అయినా సమస్యలపై చర్చించడం లేదు. ఆరోరోజు కూడా విపక్షాలు ప్రధాని మోడీ, అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సభాసమయాన్ని వృథా చేస్తున్నాయి. ఇవి ప్రజల సొమ్ము, ప్రజలు ఇచ్చిన అధికారం అని గుర్తించాలి. ఇలాగే చేస్తూ పోతే..పార్లమెంటులో గబ్బిలాల్లా ఏళ్ల తరబడి పట్టుకుని వేళ్లాడుతున్న నేతలను కూడా తొలగించడానికి ఉద్యమించక తప్పదేమో. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాల్లో జరిగాయి. దశాబ్దాల క్రితం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పుడే ఎందుకింత ఉద్యమం జరిగిందంటే కారణం యువతలో ఉన్న ఆక్రోశమని గుర్తించాలి. నాయకులు తీరుపట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయని గ్రహించాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే మూల స్తంభాలు తమ బాధ్యతల నుంచి దూరం జరగడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణం.చట్టసభల్లో సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపడం లేదు. అసలు సమస్యలనే గుర్తించడం లేదు. ఇకవాటిపై చర్చల గురించి ఆలోచన తరవాత. ప్రధాన ప్రతిపక్షం సమస్యలపై చర్చ చేయకుండా సభను స్తంభింప చేయడం మాత్రమే చేస్తోంది. అధికార పక్షం ప్రజల సమస్యలకు జవాబు ఇవ్వడం లేదు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం పార్లమెంటును నడుపుతున్నారా అన్న భావన కలుగుతోంది. బొద్దింకలు చేపట్టిన ఆందోళన విరమణతో ప్రస్తుత సమస్య తాత్కాలికంగా సమసిపోతే పోవచ్చు. కానీ ప్రధాన వ్యవస్థలు తమ బాధ్యతను గుర్తించి మెలగని పక్షంలో మరో సమస్య వచ్చినప్పుడు ఆందోళనలు ఇంతకు మించి ఉధృతంకాకుండాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నందువల్లే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. దానిని బలహీనపరచడమంటే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. వ్యవస్థలను వ్యతిరేకంగా కాకుండా వాటిల్లో జవాబుదారీ తనాన్ని తీసుకురావడానికి పోరాడవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ కోరుతున్నది అదే కనుక నేతలు తమ పద్దతిని మార్చుకుంటే మంచిది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు ఆత్మపరి-శీలన చేసుకోవాలి. ఒక సామాన్యుడైన అభిజిత్ దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ వెనుక నిలబడడం ద్వారా కాంగ్రెస్ తదితర పార్టీలు ఓ రకంగా తమ ఉనికిని కోల్పోయామని చెప్పాలి. వారు చేయాల్సిన పనిని వారి పార్టీలు చేయలేకపోయాయి. ఈ దుస్థితి ఎందుకొచ్చిందో రాజకీయ పార్టీలు ప్రశ్నించుకోవాలి. సామాన్య ప్రజలు చేపట్టిన ఆందోళనకు దిగి రావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో పాలకులు కూడా గ్రహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు, ప్రత్యర్థులను భయపెడుతూ ఎంతో కాలం మనుగడ సాగించలేమని పాలకులు గుర్తించాలి. ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలను ఆచరించి అమలు చేస్తామన్న నమ్మకాన్ని పాలకులు ప్రజల్లో కల్పించాలి. పరిస్థితి చేయి దాటిపోకముందే గ్రహించిన తరవాతనే కేంద్ర ప్రభుత్వ పెద్దలు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. సోషల్ మీడియా ఇంతలా విస్తరించిన ఈ కాలంలో ఏ విషయాన్ని కూడా దాచిపెట్టలేమని ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు గుర్తించాలి. ముఖ్యంగా యువతలో పేరుకుపోతున్న నిరాశా నిస్పృహలకు సమాధానం చెప్పాలి. పార్లమెంటులో ఎప్పటికప్పుడు ప్రధాన సమస్యలపై అర్థవంతమైన చర్చలు సాగాలి. సమస్యలు పరిష్కారం అయ్యేలా తక్షణ చర్యలకు పూనుకోవాలి. దాశాబ్దాలుగా సమస్యలను నానబెడుతూ మరిని కొత్త సమస్యలకు కారణం కారాదు. అలాగే పాలకుల విలాసాలు వీడాలి. ప్రజల సొమ్ముకు జవాబుదారీ తనాన్ని అలవర్చుకోవాలి. జల్సాలు చేసేందుకు చేసే ప్రయత్నాలను ఇప్పటికైనా ముగించాలి. లేదంటే ఏ చిన్న సంఘటన జరిగినా ఆందోళనలు మరింత ఉధృతంగా పుట్టుకురావొచ్చు. ఇప్పుడున్న నేతలు ఎవరిని ప్రజలు ఎవరిని నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానిని అధిగమించకపోతే పాలకులకు ఎదురుదెబ్బలు తప్పవు..

# పీహెచ్‌సీల పనితీరుకు 'ఆరోగ్య ఫలితాలే' ప్రామాణికం

వీటికి మంత్రి ఆమోదం తెలుపుతూ...
(గ్రామీణులకు వైద్య సేవలు అందించడంలో కీలకంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఈ కొత్త ర్యాంకింగ్ విధానంతో మరింత మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కేవలం సేవల సంఖ్యనే కాకుండా, వాటివల్ల ప్రజలకు కలిగిన ఆరోగ్య ప్రయోజనాలను గుర్తింపునిస్తూ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని రూపొందించారు.సదరు పీహెచ్సీ ల పరిధిలో నమోదయ్యే టీనేజ్ గర్భధారణలు, హైరిస్క్ గర్భిణుల నమోదు, గర్భధారణ కాలంలో అందించే వైద్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల శాతం, మొత్తం సంతానోత్పత్తి రేటు, మాతృ మరణాల నియంత్రణను పరిగణనలోకి తీసుకోనున్నారు. కొత్త ర్యాంకింగ్‌లో ఇవి అత్యంత కీలకం కానున్నాయి. శిశు మరణాలు, తక్కువ బరువుతో జన్మించిన పిల్లలు, ఏడాదిలోపు శిశువులకు పూర్తిస్థాయిలో టీకాలు, పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులు, ఎదుగుదలలో ఆలస్యాన్ని గుర్తించే పరీక్షలను కొత్త విధానంలో చేర్చారు. ఆరోగ్య సమస్యలున్న పిల్లలను గుర్తించి ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించడంతోనే అధికారుల బాధ్యత ముగియదు. వైద్యాధికారి సూచించిన పిల్లలకు వాస్తవంగా చికిత్స అందిందా? లేదా? అన్న అంశాన్ని పరిశీలిస్తారు. దీనివల్ల పరీక్షల దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు వీలవుతుంది.మధుమేహం, అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు కొత్త విధానంలో ప్రాధాన్యం ఇచ్చారు. అధునైన ప్రజల్లో రక్తపోటు మధుమేహం (అతిజీవవిబఖ), సాధారణ క్యాన్సర్ల పరీక్షలు ఎంతవరకు పూర్తయ్యాయి? వ్యాధి నిర్ధారణ అయిన వారికి క్రమం తప్పకుండా మందులు అందుతున్నాయా? వైద్య పరీక్షలు జరుగుతున్నాయా? అనే అంశాలను మదింపు చేస్తారు. క్యాన్సర్ అనుమానితులను గుర్తించి సకాలంలో ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించడాన్ని కూడా పనితీరు సూచికగా చేర్చారు. దీంతో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించే అవకాశాలు పెరగనున్నాయి.పీహెచ్సీల్లో వైద్య సేవలు పొందిన ప్రజలు ఐవీఆర్ఎస్ (కీటటా) ద్వారా తెలియజేసే అభిప్రాయాన్ని కూడా ర్యాంకింగ్‌లో భాగం చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రవర్తన, ఆసుపత్రి పరిశుభ్రత, వేచి ఉండే సమయం, మందుల లభ్యత, రోగులకు ఇచ్చే గౌరవం వంటి అంశాలు ర్యాంకింగ్‌ను నిర్ణయించడంలో కీలకం కానున్నాయి. మొత్తం 21 కీలక పనితీరు సూచికల్లో ఒక్కో అంశానికి గరిష్ఠంగా ఒక పాయింట్ కేటాయిస్తారు. సాధించిన మొత్తం స్కోరును శాతంగా మారుస్తారు. లక్ష్యాన్ని ఎక్కువగా సాధించాల్సిన అంశాల్లో మెరుగైన ఫలితాలకు అధిక స్కోరు ఇస్తారు. మాతృ మరణాలు, శిశు మరణాలు, టీనేజ్ గర్భధారణలు, సిజేరియన్ ప్రసవాల వంటివి తక్కువగా నమోదైన కేంద్రాలకు మెరుగైన స్కోరు లభిస్తుంది. 'ఏ' గ్రేడ్: 80% నుంచి 100% 'బి' గ్రేడ్: 70% నుంచి 80% లోపు 'సీ' గ్రేడ్: 60% నుంచి 70% లోపు 'డి' గ్రేడ్: 60% కంటే తక్కువ "నెలనెలా ర్యాంకులు ప్రకటించడం ద్వారా వెనుకబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వెంటనే గుర్తించి లోపాలను సరిదిద్దుతాం. ఈ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని అమలు ప్రక్రియను ప్రారంభించాం" అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఏ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ తెలిపారు.

# హంద్రీనీవాతో కుప్పానికి జలకళ

కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు రామకుప్పం మండలంలో పలు తాండల్లో పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో సమావేశమయ్యారు.
**కుప్పంలో టూరిజం అభివృద్ధికి చర్యలు :** ముందుగా రామకుప్పం మండలం నారాయణపురం తాండ, ననియాల తాండ మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...నిజం గెలవాలి యాత్ర సమయంలో కుప్పం ప్రజలు నాపై చూపించిన అభిమానాన్ని జీవితంలో మర్చిపోలేను. సీఎం చంద్రబాబును 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. బాధ్యత కలిగిన ఒక కార్యకర్తగా నేను ఇక్కడికి వచ్చాను. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బిజీగా ఉండటంతో కుప్పం ప్రజల బాగోగులు తెలుసుకోవడానికి వచ్చాను. మన రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. కుప్పంలో టూరిజం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. టూరిజం అభివృద్ధి ద్వారా మన స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కుప్పంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. కుప్పంలో ఎకో టూరిజం అభివృద్ధికి చంద్రబాబు రూ.7 కోట్లు కేటాయించారు. పర్యాటకం కోసం ప్రభుత్వం రూ.3.5 కోట్లు ఖర్చుచేసింది. స్థానికంగా పది ఎకరాల్లో జంగిల్ హట్ రిసార్ట్, చిన్నారులకు ప్లే గ్రౌండ్స్ ఏర్పాటు చేయబోతున్నారని నారా భువనేశ్వరి తెలిపారు.
**హంద్రీనీవాతో కుప్పానికి కృష్ణాజలాలు :** హంద్రీనీవా ద్వారా కుప్పానికి చంద్రబాబు కృష్ణా జలాలు తీసుకొచ్చారు. దీని వల్ల 6 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ప్రస్తుతం 110 చెరువులు నింపారు. రానున్న రోజుల్లో అన్నీ చెరువులకూ కృష్ణా నీళ్లు చేరతాయి. ననియాల పంచాయతీ పరిధిలో రూ.20 లక్షలతో రహదారులు, రూ.40 లక్షలతో పంచాయతీ భవనం నిర్మించారు. రూ.32 లక్షల వ్యయంతో ఆస్పత్రిని ఆధునీకరించారు. పీ4 కింద పేదలను ఆదుకుంటున్నారు. ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ.లక్ష చొప్పున 10 మందికి రూ.10 లక్షల ఆర్థిక సాయం పీ4 ద్వారా అందింది. తాండలో 153 మందికి పింఛను అందుతోంది. తల్లికి వందనం పథకం కింద 144 మందికి రూ.21 లక్షలు జమ చేశారు. రామాపురం తాండ, వివియాల తాండలో వాటర్ ట్యాంకర్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, వీధి లైట్ల ఏర్పాటు, గోకులం షెడ్ల మంజూరు, రామాపురం తాండలో చెక్ డ్యామ్ ఏర్పాటు చేయాలని కోరారని నారా భువనేశ్వరి తెలిపారు.
**మహిళలు ధైర్యంగా ముందడుగేయాలి :** రామకుప్పం మండలం, పీఈఎస్ తాండ మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో రామకుప్పం మండలంలోని తాండాల్లో తెలుగు దేశం జెండా ఎగిరింది. చంద్రబాబు మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు కుప్పం ఎలా ఉందో, ఇప్పుడు ఎలా ఉందో మీకు తెలుసు. సీఎం చంద్రబాబు కుప్పానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. నియోజకవర్గానికి ఒకేసారి 30 పరిశ్రమలు తెచ్చారు. ఈ పరిశ్రమల ద్వారా వేలాదిమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. మహిళలు ఇంటికే పరిమితం కాకూడదు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదు. స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ల ద్వారా మహిళలు శిక్షణ తీసుకుని ఉపాధి అవకాశాలు పొందాలి. ఒకప్పుడు బిజినెస్ అంటే నాకూ తెలీదు. ధైర్యంగా ముందడుగు వేస్తేనే ఏదైనా సాధించగలం. గతంలో మన కుప్పానికి నీటి ఎద్దడి ఎక్కువగా ఉండేది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు హంద్రీనీవా ద్వారా కుప్పానికి కృష్ణాజలాలు తీసుకొచ్చి దశాబ్దాల కల నెరవేర్చారు. నదుల అనుసంధానంతో సాగు, తాగు నీరు అందిస్తున్నారని నారా భువనేశ్వరి చెప్పారు.
**గత పాలనలో ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛా లేదు :** గత ప్రభుత్వంలో రాష్ట్రంలో పాలన ఎలా ఉందో అందరూ చూశారు. స్వేచ్ఛగా మాట్లాడుకునే పరిస్థితులు కూడా లేవు. చంద్రబాబు సుపరిపాలన అందిస్తారనే నమ్మకంతో కూటమిని ప్రజలు గెలిపించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లే ఎన్టీఆర్ భరోసా, దీపం పథకం, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, స్త్రీ శక్తి , అన్నా క్యాంటీన్లను విజయవంతంగా అమలు చేస్తోంది. పీ4తో తాండాలో అర్హులందరికీ సంక్షేమం అందుతోంది. పంచాయతీ పరిధిలో రూ.75 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, రూ.30 లక్షల వ్యయంతో రహదారుల నిర్మాణం చేపట్టారు. రూ.3 లక్షల వ్యయంతో 3 బోర్లు మరమ్మతులు చేశారు. కమ్యూనిటీ భవనం నిర్మించారు. ఈ తాండలో గోకులం షెడ్ల నిర్మించేందుకు రూ. 25 లక్షలు మంజూరు చేశారు. రూ.25 లక్షలతో ఓం శక్తి దేవాలయాన్ని అభివృద్ధి చేశారని నారా భువనేశ్వరి తెలిపారు.
**నిత్యం ప్రజలకు మేలు చేయాలనే తపన :** రామకుప్పం మండలం వండ్లాలమడుగులో మహిళలతో నారా భువనేశ్వరి సమావేశమయ్యారు. ప్రజలే తన కుటుంబంగా సీఎం చంద్రబాబు భావిస్తారు. నిత్యం ప్రజలకు మంచి చేయాలనే ఆలోచిస్తారు. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు ఇచ్చిన ఐటీ పిలుపుతో ప్రపంచమంతా మన తెలుగువారు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తెస్తోంది. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లే సూపర్ సిక్స్ అమలు చేస్తున్నారు. పేదలకు రూ.5కే కడుపు నిండా భోజనం అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో మాట్లాడాలంటేనే ప్రజలు భయపడేవారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఎకో టూరిజం అభివృద్ధి జరుగుతోంది. టూరిజం అభివృద్ధితో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. హంద్రీనీవాతో కుప్పం నియోజకవర్గంలో నీటి కష్టాలు తీర్చారు. ఈ గ్రామంలో 450 మందికి తల్లికి వందనం, 492 మందికి పింఛన్లు , 493 మందికి అన్నదాత సుఖీభవ పథకాల లబ్ధి అందింది. మహిళలతో ఆర్థికంగా బలంగా ఉండాలి. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మహిళలకు నైపుణ్యంలో శిక్షణ అందిస్తున్నామని నారా భువనేశ్వరి తెలిపారు.

# తక్కువ ధరకే

## నాణ్యమైన బియ్యం..

మొదటి పేజీ తరువాయి

కాపాడేందుకు, ఏపీ ప్రజలకు అండగా నిలిచేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు.
ఈ నిర్ణయం అమలు కోసం పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారంటూ పవన్ కల్యాణ్ కొనియాడారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఈ బియ్యాన్ని అందుబాటులో ఉంచనున్నారు.
**ధరల వివరాలు :**
బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం: కేజీ రూ. 52
గ్రేడ్–1 పచ్చి బియ్యం (రా రైస్): కేజీ రూ. 50
బహిరంగ మార్కెట్ ధరలపై అత్యవసరంగా సమీక్షించి, రైస్ మిల్లర్లతో మాట్లాడి ప్రజలకు అందుబాటు ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం ఆఫీస్ ఎక్స్ వేదికగా స్పష్టం చేసింది. ప్రభుత్వ తీరు సామాన్యుల ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# డీఎస్సీ ఆరోపణలపై జగన్‌తో

# బహిరంగ చర్చకు నేను సిద్ధం

ఆయన అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్, జగన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ..
"డీఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు నేను సిద్ధం. ఈ చర్చ కేవలం డీఎస్సీకే పరిమితం కాదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన లిక్కర్, భూ కుంభకోణాలపై కూడా చర్చిద్దాం" అని సవాల్ విసిరారు. 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీది అయితే, ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయని నీచ చరిత్ర జగన్‌ది అని లోకేశ్ ధ్వజమెత్తారు. "వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు. మేము 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే, దాన్ని అడ్డుకోవాలని 150 కేసులు వేశారు.




ఆ కేసులన్నీ కోర్టులు కొట్టివేయడమే మా చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అభివృద్ధి, సంక్షేమం అయితే.. గొడ్డలి పార్టీ విధానం విధ్వంసం, బూతులు, బాబాయ్‌ను గొడ్డలితో లేపేయడం, తల్లి, చెల్లిని ఇంటి నుంచి తరిమేయడం అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' (సీసీడీ) అనే జబ్బు ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీసుకొచ్చిన ఆర్సెలార్ మిట్టల్, గూగుల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను తానే తెచ్చానని జగన్ చెప్పుకోవడం ఆయనకున్న జబ్బు లక్షణమని అన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దు బండిలా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ విజయాలను, వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాలు గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

# ఇరాన్ నౌకపై ఉక్రెయిన్ దాడి..

తదితర దేశాల నుంచి వస్తువుల రవాణాకు ఇరాన్‌కు ఈ కాస్పియన్ సముద్ర మార్గమే దిక్కుగా మారింది. అలాంటి కీలకమైన దారిలో నౌకపై దాడి జరగడం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనలకు దారితీస్తోంది.
ఇదిలా ఉంటే, ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు చెర్నిహివ్, ఖార్కివ్ నగరాలపై రష్యా ఆదివారం తెల్లవారుజామున క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఏకంగా 7 బాలిస్టిక్ మిస్సైళ్లు, 136 ఆత్మాహుతి డ్రోన్లతో రష్యా వైమానిక దాడికి తెగబడినట్లు ఉక్రెయిన్ ఆర్మీ వెల్లడించింది. ఈ దాడిలో ఆరుగురు అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

# తిరుపతిలో కలకలం..

గత కొన్ని రోజులుగా తీవ్ర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రిలో చేర్పించగా, జూలై 23న నిర్వహించిన పరీక్షల్లో కరోనా నిర్ధారణ అయింది. అయితే ఆమె కుటుంబ సభ్యులకు జరిపిన పరీక్షల్లో ఎలాంటి వైరస్ లక్షణాలు లేవని వైద్యారోగ్య శాఖ స్పష్టం చేసింది.మరోవైపు



రాష్ట్రవ్యాప్తంగా కూడా కేసుల సంఖ్య పెరుగుతోంది. శనివారం ఒక్కరోజే ఏపీలో మరో 10 మందికి పైగా కరోనా బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 49కి చేరగా, ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో 24 మంది చికిత్స పొందుతున్నారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొత్త కేసులు వెలుగుచూడగా... కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒక్కో కేసు నమోదైంది. ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనాతో నలుగురు మృతి చెందినట్లు వైద్యశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. కేసుల సంఖ్య పెరుగుతుండటంతో అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు.

# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ..

భారతీయ వాతావరణ పరిస్థితుల్లో ఈ నోట్ల మన్నిక, పనితీరును పరిశీలించడమే ఈ క్షేత్రస్థాయి పరీక్షల ప్రధాన ఉద్దేశం. ఈ ప్రయోగాలు విజయవంతమైతేనే, వీటిని దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంపై తుది నిర్ణయం తీసుకుంటారు.అయితే, ప్లాస్టిక్ పాలిమర్ నోట్లను ప్రవేశపెడుతున్నంత మాత్రాన ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేసే ప్రతిపాదన ఏదీ లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగితపు నోట్లతో పాటే పాలిమర్ నోట్లు కూడా సమాంతరంగా చెలామణిలో ఉంటాయని మంత్రి వివరించారు. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నిక కలిగి ఉంటాయని, ఇవి సులభంగా పాడవవని అర్బీఐ పేర్కొంది. ముఖ్యంగా తక్కువ విలువ కలిగిన నోట్లు త్వరగా చిరిగిపోతుండటంతో, వాటిని తరచూ



మార్చాల్సి వస్తోంది. పాలిమర్ నోట్ల వినియోగం వల్ల ముద్రణ మరియు నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలి

విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు.... టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
మంగళవారం, జులై 28, 2026


# గోవధ నిషేధ చట్టం తీసుకురావాలి..

**ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి: కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: గోవధపై దేశవ్యాప్తంగా పూర్తి నిషేధం విధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ గౌ సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ ఆధ్వర్యంలో గోసేవకులు, సంత్ సమాజ ప్రతినిధులు సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దేశీయ గోవంశానికి రాజ్యాంగ పరిరక్షణ కల్పించాలని, రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ ద్వారా వినతిపత్రాన్ని పంపించాలని కోరారు. దేశవ్యాప్తంగా శాంతియుతంగా ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని, గోవంశ పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోందని, ఎన్టీఆర్ జిల్లాలో లక్ష్యంగా నిర్ణయించిన సంతకాలలో 14 శాతం సంతకాలు సేకరించి కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు.వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ స్వీకరించి సంబంధిత అధికారులు ద్వారా పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోసేవకులు, సంత్ సమాజ ప్రతినిధులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.



## 500 మంది విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం పంపిణీ!!

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి

సేవే పరమో ధర్మం అనే భావనతో మచిలీపట్నానికి చెందిన నడికోట నగేష్ కుమార్, ఆయన కుమారుడు నడికోట కృష్ణ ప్రసాద్ ప్రతి నెల చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఫోర్ట్ రోడ్‌లోని రాంజీ ప్రభుత్వ పాఠశాలలో 500 మంది విద్యార్థులకు ప్రత్యేక మధ్యాహ్న భోజనం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని మచిలీపట్నం మండలం సౌత్ ఎంఈఓ శ్రీనివాస రావు ప్రారంభించారు. విద్యార్థులకు వెజిటేబుల్ బిర్యానీ, గుడ్డు, బంగాళాదుంప కుర్మా, స్వీట్‌తో కూడిన పౌష్టికమైన, రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆనందంగా భోజనం స్వీకరించగా, నిర్వాహకుల సేవా భావాన్ని ఉపాధ్యాయులు అభినందించారు.ప్రతి నెలా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న నడికోట నగేష్ కుమార్, కృష్ణ ప్రసాద్‌లను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## దొంగ పట్టాల వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలి

**జాయింట్ కలెక్టర్ కు టీడీపీ నాయకులు వినతి**



మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి

వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం నియోజకవర్గంలో మాజీ మంత్రి పేర్ని నాని ఆధ్వర్యంలో దొంగ పట్టాలు పంపిణీ చేశారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు.సోమవారం నిర్వహించిన "మీ కోసం" ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దొంగ పట్టాల వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి, అఫిడవిట్‌ను హైకోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, ఆ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.హైకోర్టు ఆదేశాలను తక్షణమే అమలు చేసి, దొంగ పట్టాల వ్యవహారంలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.

## నిర్ణీత గడువులోగా అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



**ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ ఎం నవీన్**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ అధికారులను ఆదేశించారు. ప్రజా అర్జీల పెండింగ్ కేసులు పేరుకుపోయే పరిస్థితిని ఏమాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ మేరకు ఆయన ఇన్చార్జి డిఆర్ఓ ఎస్ పోతురాజు, కేఆర్ఆర్సి ఎస్డిసి పి నీలకంఠేశ్వర రెడ్డి, చిలకలపూడి సిఐ ఎస్కే అబ్దుల్ నబీతో కలసి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి శాఖ అధికారి వారానికి ఒకసారి పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించి పారదర్శకంగా, నాణ్యతతో సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.అర్జీలలో కొన్ని: పామర్రు మండలం ఐనంపూడి గ్రామంలో తాగునీటి ప్రధాన పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగునీరు కలుషితమై వినియోగానికి అనర్హంగా మారిందని, అలాగే డ్రైనేజీ సమస్యతో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన భట్టు వీర రాఘవులు పీజీఆర్ఎస్‌లో అర్జీ సమర్పించారు. ఈ సమస్యలపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ, వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెడన మున్సిపాలిటీ 2వ వార్డు భోజనగుడి రోడ్డు సమీపంలో గృహ వ్యర్థాలు, ప్లాస్టిక్, చనిపోయిన జంతువుల కళేబరాలు, ఇతర చెత్తాచెదారాలను వేయడంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డుగా మారి దుర్వాసన వెదజల్లడంతో పాటు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని స్థానిక ప్రజలు పీజీఆర్ఎస్‌లో అర్జీ సమర్పించారు. ఈ సమస్యపై పలు మార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వెంటనే ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ఏపీ యువతకు పెరిగిన అవకాశాలు



**లోక్‌సభలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రశ్నకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సమాధానం**

**నెలవారీ భృతి రూ.9,000కు పెంపు –మూడో విడతలో పీజీ విద్యార్థులకు ఛాన్స్**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (PMIS)లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కృష్ణా జిల్లా యువతకు విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ లోక్‌సభలో పూర్తి వివరాలతో సమాధానమిచ్చింది. పథకంలో చేసిన కీలక మార్పులు, జిల్లా వారీ పురోగతి, విద్యార్థులకు అందుతున్న లబ్ధిని కేంద్రం వెల్లడించింది.

పథకంలో తెచ్చిన ప్రధాన మార్పులు & నిబంధనలు:పీజీ విద్యార్థులకూ అవకాశం: సవరించిన మార్గదర్శకాలతో 2026 మార్చి 20న మూడో విడత ప్రారంభమైంది. మొదటిసారిగా పీజీ విద్యార్థులను కూడా ఇందులో భాగస్వాములను చేశారు. అయితే ఎంబీఏ (MBA) లేదా దానికి సమాన అర్హత ఉన్నవారు ఈ పథకానికి అర్హులు కారు.

భృతి పెంపు: యువతను ప్రోత్సహించేలా నెలవారీ భృతిని రూ.5,000 నుండి రూ.9,000కు పెంచారు.కాలానుగుణ వ్యవధి: ఇంటర్న్‌షిప్ వ్యవధిని విద్యార్థుల సౌలభ్యాన్ని బట్టి 6 లేదా 9 నెలలుగా ఎంచుకునే వెసులుబాటు కల్పించారు.

అర్హతలు: వయోపరిమితిని 18 నుంచి 25 ఏళ్లకు సవరించారు. డిగ్రీ, పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కంపెనీల పరిధిని సైతం విస్తరించారు.

కృష్ణా జిల్లాలో పథకం అమలు – పురోగతి (గణాంకాలు):

మొదటి విడత: 203 ఆఫర్లు రాగా... 60 మంది అంగీకారం తెలిపారు, 8 మంది ఇంటర్న్‌లుగా చేరారు.

రెండో విడత: 472 ఆఫర్లు రాగా... 105 మంది అంగీకారం తెలిపారు, 17 మంది చేరారు.

మూడో విడత (2026 జులై 15 నాటికి): 53 ఆఫర్లకు గాను 31 మంది అంగీకారం తెలుపగా, 22 మంది ఇంటర్న్‌లుగా బాధ్యతలు స్వీకరించారు.

డ్రాప్‌అవుట్‌ల నివారణకు పక్కా చర్యలు:ఇంటర్న్‌షిప్ మధ్యలో మానేసే వారి సంఖ్య తగ్గించేందుకు, ప్రాతినిధ్యం పెంచేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జియో-ట్యాగింగ్, రోలింగ్ ఇంటర్న్‌షిప్ విధానం, విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమల సంఘాలతో క్రమం తప్పకుండా సమన్వయం చేసుకుంటున్నట్లు స్పష్టం చేసింది.యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి:"యువతకు ఉపాధి మార్గాలను సుగమం చేసే ఈ పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అమలు చేయాలి. కృష్ణా జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని విశేషంగా ఉపయోగించుకోవాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు.

## పునాదిపాడులో బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి లోకేష్

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా




రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా కంకిపాడు మండలం పునాదిపాడులో పోలవరపు మాధవరావు, ఇతర కుటుంబ సభ్యుల విరాళం రూ.1.20 కోట్లు వెచ్చించి నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల లేబరేటరీలను పరిశీలించారు. విద్యార్థులతో సంభాషించారు. బాగా చదువుకోవాలని వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు, పూర్వ విద్యార్థులను కలిసి అభినందించారు. దాసరి ఆళ్వార స్వామి రచించిన భారతదేశ ప్రధానమంత్రులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, ఇతర ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ డీకే బాలాజీ, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.






## విద్యార్థులు క్రీడల్లో రాణించి దివిసీమకు పేరు తేవాలి

**అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్ష**

**అమరావతి ఛాంపియన్ షిప్-2026 నియోజకవర్గ జట్ల ఎంపిక ప్రారంభం**

ప్రజాభుమి ప్రతినిధి / అవనిగడ్డ

విద్యార్థులు క్రీడల్లో రాణించి దివిసీమకు మంచిపేరు తేవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. సోమవారం అవనిగడ్డలోని ఇండోర్ స్టేడియంలో అమరావతి ఛాంపియన్ షిప్-2026 నియోజకవర్గ జట్ల ఎంపికను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు విశేష ప్రోత్సాహం అందిస్తోందన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి కలిగిన క్రీడలో నైపుణ్యం పెంచుకుని ఎదగాలని పిలుపునిచ్చారు.



మూడు రోజుల పాటు జరిగే ఎంపిక ప్రక్రియను ఎమ్మెల్యే బుద్ధప్ర సాద్ షటిల్ కోర్టు ఓపెన్ చేసి, షటిల్ ఆడి ప్రార ంభించారు. సెలక్షన్లకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. అనంతరం ఆర్చరీ, అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాస్కెట్ బాల్, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను వ్యాయామ ఉపాధ్యాయులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈఓలు అన్నపరెడ్డి పిచ్చయ్య, సనకా శ్రీకాంత్, అసోసియేషన్ అధ్యక్షులు బడే వెంకటేశ్వరరావు, కార్యదర్శి బీపీఎల్ ప్రసాద్, కోశాధికారి నవీన్, గరికపాటి మారుతీ, అప్పికట్ల రామారావు, తాతాజీ, మునగాల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాల పెంపు, క్రమబద్ధమైన అధ్యయనం, నిరంతర పునశ్చరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

**ప్రతి విద్యార్థి పురోగతిని వ్యక్తిగతంగా పర్యవేక్షించి ఉత్తీర్ణత శాతం పెంచాలి**

ప్రజాభూమి బ్యూరో కృష్ణజిల్లా

విద్యార్థుల సామర్థ్యాల పెంపు, క్రమబద్ధమైన అధ్యయనం, నిరంతర పునశ్చరణపై ప్రత్యేక దృష్టి సారిస్తేనే విద్యా ప్రమాణాలు మెరుగుపడి ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పేర్కొన్నారు.సోమవారం కంకిపాడు మండలంలోని పునాదిపాడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన ఆయన, ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల విద్యా పనితీరు, వి ద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు, పదో తరగతి ఫలితాలను సమీక్షించి పలు సూచనలు చేశారు. సోమవారం కంకిపాడు మండలంలోని పునాదిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)ను సందర్శించిన ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల పనితీరును సమీక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల రేటింగ్, పదో తరగతి ఉత్తీర్ణత శాతం, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు, ఫార్మేటివ్ సమ్మేటివ్ అసెస్‌మెంట్ ఫలితాలను పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుత ఫలితాలు ఆశించిన స్థాయిలో లేవని అన్నారు. పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, ఉపాధ్యాయుల శ్రమకు తగిన ఫలితాలు కని పించడం లేదని పేర్కొంటూ, ఇందుకు గల కారణాలను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టా లని సూచించారు.విద్యార్థులు కష్టపడి చదువుతున్నప్పటికీ క్రమబద్ధమైన అధ్యయనం, నిరంతర పునశ్చరణ లోపించడం వల్ల నేర్చుకున్న అంశాలు నిలకడగా గుర్తుండటం లేదని అభిప్రాయపడ్డారు. ప్రతి పాఠాన్ని బోధించే ముందు ఒకసారి, బోధన సమయంలో శ్రద్ధగా, అనంతరం పునశ్చరణ చేసే అలవాటు విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు. వారంలో బోధించిన అంశాలను ప్రతి వారాంతంలో తప్పనిసరిగా రివిజన్ చేయించి, అవగాహనను బలోపేతం చేయాలని తెలిపారు. స్లిప్ టెస్టులు, యూనిట్ టెస్టులు నిర్వహించడం మాత్రమే కాకుండా, వాటి ఫలితాలను విశ్లేషించి ప్రతి విద్యార్థి ఏ అంశంలో వెనుకబడుతున్నాడో గుర్తించి వ్యక్తిగతంగా మార్గదర్శనం చేయా లని ఉపాధ్యాయులకు సూచించారు. ముఖ్యంగా పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను మూడు వర్గాలుగా గుర్తించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు బోధన, పునశ్చరణ, నిరంతర పర్యవేక్షణ ద్వారా వారిని ఉత్తీర్ణులను చేయాలని ఆదేశించారు.మాతృ భాష అయిన తెలుగులో కూడా విద్యార్థులు విఫలమవడం ఆందోళన కలిగించే అంశమని కలెక్టర్ పేర్కొన్నారు. తెలుగు భాషలో అక్షరదోషాలు, భావవ్యక్తీకరణ, రచనా నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అవసరమని చెప్పారు. విద్యార్థుల బలహీనతలను ప్రారంభ దశలోనే గుర్తించి ప్రాథమిక స్థాయి నుంచి బోధన అందిస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు.ప్రతి ఉపాధ్యాయుడు తన సొంత పిల్లల చదువుపై చూపే శ్రద్ధతోనే వెనుకబడిన విద్యార్థుల పట్ల బాధ్యత వహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి తరగతిలో ప్రత్యేక శ్రద్ధ అవసరమైన విద్యార్థులను గుర్తించి వారిపై నిరంతర పర్యవేక్షణ, తల్లిదండ్రులతో సమన్వయం, వ్యక్తిగత మార్గదర్శనం అందిస్తే పాఠశాల ఫలితాల్లో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని తెలిపారు.పాఠశాల గత వైభవాన్ని నిలబెట్టే బాధ్యత ప్రస్తుత ఉపాధ్యాయులందరిపైనా ఉందని పేర్కొన్న కలెక్టర్, వచ్చే విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాల్లో స్పష్టమైన పురోగతి కనిపించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల సమిష్టి కృషితో పునాదిపాడు జెడ్పీహెచ్ఎస్‌ను జిల్లాలో ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.సమావేశంలో విద్యాశాఖ ఆర్జెడి జి నాగమణి, డీఈవో యు వి సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డిఇఓ పద్మారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## చలో ఐటిడిఏ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి : సిపిఎం



ప్రజా భూమి ప్రతినిధి–వేలేరుపాడు

ఈనెల 29న నిర్వహించ తలపెట్టిన చలో ఐటీడీఏ కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా గిరిజనులంతా ఏకమై జయప్రదం చేయాలని గిరిజన సంఘ నాయకుడు సిపిఎం కార్యదర్శి ధర్ముల రమేష్ పిలుపునిచ్చారు. వేలేరుపాడు మండలం కొత్తూరు గ్రామంలో చలో ఐటిడిఏ కార్యక్రమని ఉద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం కార్యదర్శి ధర్ముల రమేష్ సోమవారం మాట్లాడుతూ, జీవో నెంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయ జీవో తెస్తామని అన్న హామీని అమలు చేయాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా రక్షించాలని, అటవీ హక్కుల చట్టం 2006 చట్ట ప్రకారం ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఈ నెల 29 న ఐటీడీఏ కే ఆర్ పురం జరుగుతున్న కార్యక్రమాన్ని ఆదివాసీలందరు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు. మన చట్టాలు, హక్కులు మన భవిష్యత్తు ప్రమాదం లో పడుతున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ పోరాటంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కొత్తూరు గ్రామంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు, గిరిజనులు ఉన్నారు.

## జీలుగుమిల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 29న జరిగే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలి

–పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



ప్రజా భూమి ప్రతినిధి–జీలుగుమిల్లి

ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు సారథ్యంలో ఈ నెల 29వ తేదీ (బుధవారం) జీలుగుమిల్లి జెడ్పీ హైస్కూల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు, అలాగే పోలవరం నిర్వాసిత గ్రామాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు తగిన ఉద్యోగాలను పొందాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ మెగా జాబ్ మేళాలో 11 ప్రముఖ సంస్థలు పాల్గొని, మొత్తం 930 ఉద్యోగాల భర్తీకి నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రెజ్యూమ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జీలుగుమిల్లి సి. ఐ యాదగిరి, ప్రతినిధులు ఇజ్రాయిల్ రాజు, ప్రవీణ్, జనసేన మండల నాయకులు బండారు అనిల్ కుమార్, తమ్మన సాంబశివరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసమే మా బలం - ప్రజాసేవే మా ధ్యేయం



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

నూజివీడు పట్టణం 8వ వార్డులో శనివారం నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేస్తూ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రజల సూచనలు, అభిప్రాయాలను తెలుసుకుని మరింత పారదర్శకమైన పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజల విశ్వాసమే తమ బలం, ప్రజాసేవే తమ ధ్యేయమని పేర్కొన్నారు.

## ఆంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలి

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలోని అడవి ఆంజనేయస్వామి ఆలయంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి ఆంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. దేవాలయాల అభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అంద రూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా సాయి మందిరాల్లో విశేష పూజలు

ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



గురుపౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆగిరిపల్లి విరూపా టౌన్షిప్ లో గల సాయి మందిరం, గన్నవరం రోడ్డులోని సాయిబాబా మందిరం, సింగన్నగూడెం బస్టాప్ వద్దనున్న శ్రీ సర్వకార్యసిద్ధి శిరిడి సాయిబాబా మందిరంలో అభిషేకాలు, అర్చనలు, గురుపూజలు నిర్వ హించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కూడా ఉంటుందని వెల్లడించారు.

## లోనీ రైతుల పంటల బీమా ప్రీమియాన్ని వెంటనే జమ చేయాలి

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



లోనీ రైతుల ఖాతాల నుంచి మినహాయించిన పంటల బీమా ప్రీమియం మొత్తాలను సంబంధిత బీమా కంపెనీల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి బ్యాంకు అధికారులను ఆదేశించారు. పీఎంఎఫ్‌బీవై పథకం కింద వరి, మినుముల ప్రీమియంను ఐసీఐసీఐ లాంబార్డ్ ఖాతాలో, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం కింద ప్రత్తి, నిమ్మ పంటల ప్రీమియంను ఏఐసీ లిమిటెడ్ ఖాతాలో జమ చేయాలని సూచించారు. ఈ మేరకు సోమవారం మండల వ్యవసాయ అధికారి జే. భవాని ఆగిరిపల్లిలోని ఎస్‌బీఐ, కేడీసీసీ, సప్తగిరి గ్రామీణ బ్యాంకులను సందర్శించి కలెక్టర్ ఆదేశాలను బ్యాంకు మేనేజర్లకు తెలియజేశారు. మినుములు, ప్రత్తి, నిమ్మ పంటలకు జూలై 31, వరి పంటకు ఆగస్టు 15 వరకు పంటల బీమా నమోదు గడువు ఉన్నందున, లోనీ రైతుల ప్రీమియం మొత్తాలను తక్షణమే బీమా సంస్థలకు జమ చేసి రైతులకు పంటల బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## పిజిఆర్ఎస్,లో స్వీకరించిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

### జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.

ఏలూరు



ఏలూరు, జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి యం. శ్రీదేవి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి లు ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజలు నుండి స్వీకరించిన ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోపుగా పూర్తిస్థాయి పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీదారులకు సంతృప్తిస్థాయి మరింత పెంచేలా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులుపై ఉందని స్పష్టం చేశారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని అన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చక్కని పరిష్కారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ అవగాహన కార్యక్రమం

### జ్యూట్ బ్యాగుల పంపిణీ.

ప్రజా భూమి ప్రతినిధి–పెదపాడు.



ఆదిత్య డిగ్రీ కళాశాల, సత్రంపాడులో నేడు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో "ప్లాస్టిక్ రహిత సమాజం – పర్యావరణ పరిరక్షణ" అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే హానికరమైన ప్రభావాల గురించి విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగులను ఉపయోగించాలని సూచిస్తూ జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, "ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్లాస్టిక్‌కు బదులుగా జ్యూట్ బ్యాగులు వంటి పర్యావరణహిత వస్తువులను ఉపయోగించడం అలవాటు చేసుకోవాలి. యువత ఈ విషయంలో ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీ ఫణి కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. హరిబాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆదివాసి గర్జన" ర్యాలీని జయప్రదం చేయండి

–ఆదివాసి గిరిజన సంఘం.



ప్రజా భూమి ప్రతినిధి–బుట్టాయగూడెం

ఆదివాసీల రాజ్యాంగ, చట్టబద్ధ హక్కుల పరిరక్షణ కోసం జీవో నెం. 3 పునరుద్ధరణ, 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల జూలై 29న నిర్వహిస్తున్న "ఆదివాసి గర్జన" ర్యాలీని విజయవంతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం ఏలూరు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆదివాసి గర్జన ర్యాలీలో ఆదివాసీలు, గిరిజన యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని ఆదివాసుల హక్కుల సాధనకు సంఘీభావం తెలియజేయాలని కోరింది. జీవో నెం. 3 అమలు ద్వారా గిరిజనులకు విద్య, ఉద్యోగాల్లో రాజ్యాంగబద్ధ రక్షణ కల్పించాలని, అలాగే 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేసి గిరిజన భూములను పరిరక్షించాలని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ఆదివాసీల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ "ఆదివాసి గర్జన" ర్యాలీని విజయవంతం చేయడం ప్రతి ఆదివాసి బాధ్యత అని జిల్లా కమిటీ పేర్కొంది. అన్ని మండలాలు, గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

## నీట్ పేపర్ లీకేజ్ కారణంగా మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలి

### సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్.

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు



భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏలూరు పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్ కారణంగా 22 మంది విద్యార్థులు చనిపోయారని వారి మృతికి భారత కమ్యూనిస్టు పార్టీ తరపున నివాళి అర్పిస్తున్నామన్నారు. విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న దురదృష్ట సంఘటనలపై జవాబుదారీతనం కోసం పోరాడిన దేశంలోని విద్యార్థులు, యువతకు అభినందనలు తెలిపారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించడం ఈ దేశ విద్యార్థి, యువజన పోరాటల ఫలితమేనని అన్నారు. కేవలం విద్యాశాఖ మంత్రి రాజీనామాతోనే దేశంలోని విద్యా వ్యవస్థలో సమస్యలు తీరిపోవని, తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలను వికేంద్రీకరణ చేయాలని ఉమ్మడి ప్రవేశ పరీక్షా విధానం, జాతీయ విద్యా విధానాన్ని రద్దుచేసి విద్యా వ్యవస్థలోని మాఫియాను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షా పత్రం లీకు వలన చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ కి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. నీట్ పేపర్ లీక్ వలన చనిపోయిన విద్యార్థులకు సంతాపం తెలియచేసి నివాళి అర్పించారు. దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థలోని మాఫియాను అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలు పారదర్శకంగా పరీక్షలు నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించాలని దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమాలలో పాల్గొన్న విద్యార్థి యువజనలపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వాణిజ్యీకరణ, కేంద్రీకరణ ప్రధానంగా ఉన్న జాతీయ విద్యా విధానం 2020ని రద్దు చేయాలని, లేనిపక్షంలో పేపర్ లీక్ ల పరంపర కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలని హితవు పలికారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని పరీక్ష విధానాలను రాష్ట్రాలకు అప్పగించే విధంగా కూటమి ప్రభుత్వం ప్రశ్నించాలన్నారు. సిపిఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి యువజన ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాలలో ప్రజలందరూ పాల్గొనాలని తద్వారా ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు కొల్లూరి సుధారాణి, మావూరి విజయ, జిల్లా కౌన్సిల్ సభ్యులు భజంత్రీ శ్రీనివాసరావు, ఎం.ఏ.హకీమ్, ఉప్పులూరి లక్ష్మి, ఉప్పులూరి భవాని, బళ్ల కనకదుర్గారావు, ఉప్పులూరి రాజమణి, ఉప్పులూరి జ్యోతి, పంతం సుందరమ్మ, దాసిపల్లి ఎర్రయ్య, కుమార్ బాబు, జుజ్జువరపు సురేంద్ర, అక్కిరెడ్డి పోతరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల హక్కులను పరిరక్షించాలి

### న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఐటీడీఏ ముట్టడి.

ప్రజా భూమి ప్రతినిధి–బుట్టాయగూడెం



ఏజెన్సీ ప్రాంతంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని, 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని, జీవో నెంబర్ 3, తరహా జీవోకు ముఖ్యమంత్రి హామీను వెంటనే అమలు చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కోట రామచంద్రపురం ఐ టి డి ఏ వద్ద సిపిఐ ఎం.ఎల్.న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ , అనంతరం ఐటిడిఏ ముట్టడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలి సంఘం ( ఏ ఐ కె ఎమ్ ఎస్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాస్, కె.రాఘవ లు మాట్లాడుతూ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆదివాసి చట్టాలను హక్కులను కాల రాస్తున్నారని అన్నారు. 1/70 చట్టం, పిసా చట్టం అమలు విషయంలో ప్రభుత్వ యంత్రాంగం మీన మీషాలు లెక్కిస్తునారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యా వైద్యం అభివృద్ధి పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. బుట్టాయగూడెం సామాజిక ఆసుపత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల చనిపోయిన మోతుగూడెం విద్యార్థిని మృతి సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులు చదువుకుంటున్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలను , యూపీ స్కూల్ గా మార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆదివాసి గిరిజన విద్యార్థులు చదువుకుంటున్న లంక పాకల, పులి రామన్నగూడెం, రెడ్డి కోపల్లి, ఇటికలకోట పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసి చట్టాలు పటిష్టంగా అమలు చేస్తూ గిరిజన ప్రజలకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ముట్టడి కార్యక్రమం లో అఖిలభారత ఆదివాసి వేదిక ( ఏ ఐ టీ ఎఫ్) జాతీయ కన్వీనర్ ఎస్ రామ్మోహన్, తగరం బాబురావు, పి వో డబ్ల్యు జిల్లా అధ్యక్షురాస్త్ర6బ6ఎలు వెట్టి భారతి, న్యాయవాది యు ఏసుబాబు ,పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి, బన్నీ వినోద్, ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఈ. భూషణంలు మాట్లాడుతూ 1/70 చట్టం రద్దు చేయించడం కోసం సుప్రీంకోర్టులో గిరిజనేతరులు పిటిషన్ వేసారని ఇది చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఆదివాసి జాతిని, ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదలను, భూములను లాక్కోవడం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని వారు అన్నారు. గిరిజన చట్టాల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ముందుగా సాయిబాబా గుడి దగ్గర నుండి ఆదివాసి ప్రజలతో భారీ ర్యాలీ ప్రారంభమై ఐటిడిఏ కార్యాలయానికి చేరుకొని కార్యాలయం ముట్టడి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ కే ఎం ఎస్ నాయకులు కన్నారావు, కొండలరావు, వి సద్గురు, ముక్కారెడ్డి, సోమరాజు, భీమరాజు, పి ఓ డబ్ల్యు నాయకులు జిల్లా కార్యదర్శి కుర సం లత, శాంతి, కారం అరుణ, పి వై ఎల్ నాయకులు గురుగుంట్ల ప్రసాద్, లక్ష్మీనారాయణ, రాజు, మాజీ సర్పంచులు మడి శ్రీరాములు, ముక్కారెడ్డి, , మాజీ ఎంపీటీసీ కొవ్వాసు గోవిందరాజు, తదితరులు నాయకత్వం వాయించారు. ఆదివాసి గిరిజన ప్రజలు నలుమూలల నుండి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు హీరింగ్ ఎయిడ్స్ పంపిణీ.



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా.

ఏలూరు జిల్లా దొండపాడులోని పరివర్తన్ ప్రత్యేక పాఠశాలలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అత్యాధునిక గ్రూప్ హియరింగ్ సిస్టమ్ను ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, ప్రారంభించి, విద్యార్థులకు హియరింగ్ ఎయిడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినికిడి లోపం ఉన్న చిన్నారులకు ఆధునిక సాంకేతిక పరికరాలు, నాణ్యమైన విద్య, సరైన అవకాశాలు కల్పిస్తే వారు కూడా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఎస్పీ పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను ప్రేమతో, గౌరవంతో ఆదరించి వారి ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ విలువైన సహకారం అందించిన దాతలు రావెళ్ల కిషోర్ ప్రసాద్, స్వర్ణకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

### జిల్లా అధికారులతో పిజిఆర్ఎస్ అర్జీలు పరిష్కార ప్రగతిపై

# జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్



ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా

పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటునని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులను హెచ్చరించారు. స్థానిక జిల్లా కలెక్టరేటు నుండి సోమవారం పిజిఆర్ఎస్ ధరఖాస్తులు పరిష్కారంలో అధికారులతో జిల్లా కలెక్టరు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. శాఖలు వారీగా పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన అర్జీలు పరిష్కార ప్రగతిలో లోటు కనిపించిన అధికారులు పట్ల జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో అర్జీదారుని కలిసి వారి సమస్యను స్వయంగా తెలుసుకుని, అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని మరలా సోమవారం నాటికి పరిష్కారంలో ప్రగతిని సాధించాలని, లేకపోతే శాఖా పరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు హెచ్చరించారు. పిజిఆర్ఎస్ ధరఖాస్తులు పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించవద్దన్నారు. కొంతమంది అధికారులు కింద స్థాయి సిబ్బంది అర్జీదారుని దగ్గరకు పంపిస్తున్నారని, కొందరు నాపరిధి లోనిది కాదని సమాధానం చెబుతున్నారని ఇది క్షమించరాని నేరమని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో అర్జీదారుని వద్దకు వెళ్ళి వారితో ఫ్రెండ్లీగా మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, సానుకూల దృక్పధంతో నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలని అన్నారు. పిజిఆర్ఎస్ ధరఖాస్తులు పరిష్కారంలో అర్జీదారులు నుండి ఒక్కఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులుపై చర్యలు తీసుకుంటామని అన్నారు.జూమ్ కాన్ఫరెన్సులో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె. అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, కె.లక్ష్మీప్రసన్న, యం.వి. రమణ, వివిధ శాఖలు జిల్లా, డివిజన్, మండల అధికారులు వారివారి కార్యాలయాలు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# వసంతవాడలో ప్రారంభమైన ఇంటింటికి అభివృద్ధి సంక్షేమం

### రెండేళ్లలో సాధించిన ప్రగతిని ప్రజల్లోకి తీసుకువెళ్లిన కూటమి నేతలు



ప్రజా భూమి ప్రతినిధి–వేలేరుపాడు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సాధించిన అభివృద్ధి,సంక్షేమం ఇంటింటికి వెళ్లి వివరించే కార్యక్రమాన్ని సోమవారం వేలేరుపాడు మండలంలోని వసంతవాడ గ్రామంలో కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు అమరవరం అశోక్, జనసేన కార్యదర్శి మేచినేని సంజయ్ లు అభివృద్ధి సంక్షేమాలను ప్రభుత్వం ఏ విధంగా అందిస్తుంది. మున్ముందు అందించనున్న కార్యక్రమాలను వివరించడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అధ్వాన్నంగా ఉన్న రహదారులను బాగు చేయడం జరిగిందని, ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పోలవరం నిర్వాసితులకు అందాల్సిన ప్యాకేజీలను అందించడం జరిగిందని, ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తుందని, అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా ఎంతో అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో ఎన్నో బృహత్తర కార్యక్రమాలను చేపట్టటం జరుగుతుందన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి వర్ణనాతీతంగా పేర్కొన్నారు. ఇప్పటికే ఎన్నో సంస్థలను( కంపెనీలను) రాష్ట్రానికి తీసుకువచ్చి అభివృద్ధి దశగా బాటలు వేయడం జరుగుతుందని ఈ సందర్భంగా విఫలీకరించారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందించటమే ఈ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కట్టం రాంబాబు, కుకునూరు సత్తిపండు కరటూరి రాధాకృష్ణ, నోపా శ్రీరాములు, కుంజా విజయ్, సోడే రామకృష్ణ, కుంజా రాధాకృష్ణ, గొట్టిపర్తి అనిల్, కుక్కునూరు రాంబాబు కోటిపల్లి ముత్యాలు తదితరులంతా ఉన్నారు.

# ఐదేళ్ల విధ్వంస పాలనకు.. రెండేళ్ల వికాస పాలనకు ప్రజలే సాక్ష్యం

- సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రజల్లో సంతృప్తి
- మంత్రి నిమ్మల రామానాయుడు



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన ఇంటింటికీ ప్రచార కార్యక్రమం లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. పాలకొల్లు పట్టణంలో 21వ వార్డు లాకుల ప్రాంతంలో కూటమి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రెండేళ్లలో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు అందుతున్నాయా అని మంత్రి నిమ్మల ఓ మహిళను అడుగ్గా మా ఇంట్లో ఇద్దరికీ పెన్షన్ తీసుకుంటున్నామని ఆనందంతో తెలిపింది. మరో ఇంటి వద్ద వేరొక మహిళ మా ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం కింద. రూ 13000 చొప్పున 39 వేలు జమైనట్లు తెలిపింది. ఉండ్రోతు కృష్ణ అనే వ్యక్తి మొక్కజొన్నల వ్యాపారం చేసుకుంటున్నానని, రోజుకి బండికి రూ 30 రూపాయలు చొప్పున అద్దెకి తీసుకుంటున్నానని ఓ బండి ఇప్పించాలని కోరగా ఇస్తానంటూ మంత్రి భరోసా ఇచ్చారు. ఇలా ప్రతి ఇంటి వద్ద పథకాల గురించి అడుగుతూ ముందు కదిలారు. మంత్రి నిమ్మలకు మహిళలు స్వాగతం పలికి హారతులు ఇచ్చి దీవించారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు జరుగుతున్న ప్రతి ఇంటికి ఒకటి నుంచి మూడు వరకు లబ్ది అందుతున్నాయని, అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నారని తెలిపారు. గొడ్డలి పార్టీ ఐదేళ్ల నియంతృత్వ, కక్షసాధింపు, అక్రమ కేసులు, విధ్వంస పాలనకు ప్రజలు విముక్తి పొంది రెండేళ్లు పూర్తయ్యాయని, ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస రాజకీయాలకు శ్రీకారం చుట్టిందని, కానీ కూటమి ప్రభుత్వం మాత్రం రాష్ట్రాన్ని వికాసం వైపు పరుగులు పెట్టిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు.ఉపాధ్యాయ నియామకాల విషయంలో ప్రతి సంవత్సరం డీఎస్సీ, మెగా డీఎస్సీ అంటూ హామీలు ఇచ్చిన గత ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే డీఎస్సీ నిర్వహించి 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించిందన్నారు.ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనకు, రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పొట్నూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం

### కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

ఆలమూరు మండలంలో దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అందించిన ఉచిత మోటార్ సైకిళ్లను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. మండలంలో మొత్తం ఆరుగురికి ఈ మోటారు సైకిళ్ల అందగా వారంతా సోమవారం ఉదయం ఆలమూరులో ఎమ్మెల్యే బండారు పర్యటనలో పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా, వారికి స్వతంత్ర జీవనాన్ని కల్పించేందుకు ఈ పథకం ఉద్దేశించబడిందని తెలిపారు. లబ్ధిదారులతో మాట్లాడి గత గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో దివ్యాంగులకు లభిస్తున్న సంక్షేమ పథకాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2019 నుంచి 2024 వరకు 2019కు ముందు చంద్రబాబు నాయుడు తమకు ఇచ్చిన పింఛన్ మొత్తం రూ.3వేలు మాత్రమే అందేదని 5 ఏళ్లలో ఒక్క రూపాయి కూడా వైసిపి హయాంలో పెంచలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని రూ.6 వేలు చేసి ప్రభుత్వం తమను ఆదుకుందని దివ్యాంగులు తెలిపారు. దివ్యాంగులకు కూటమి ప్రభుత్వంలో అన్ని విధాలా లబ్ధి జరుగుతుందన్నారు. ప్రభుత్వం సోలార్ ఎనర్జీ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా సోలార్ యూనిట్ అమర్చుకోవడానికి అవకాశం కల్పిస్తుందని, బిసి ఓసి వర్గాలకు రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆలమూరులో ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసుకున్న సోలార్ యూనిట్ లను ఎమ్మెల్యే బండారు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గాలకు కూటమి ప్రభుత్వం ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తుందన్నారు. సోలార్ యూనిటీ ఏర్పాటును ఉచితంగా చేయడంతో పాటు నెలకు రూ.200లను వారికి అద్దె రూపంలో చెల్లిస్తుందన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఆగస్టు 31 నాటికి జొన్నాడ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ సర్వీస్ రోడ్లు పూర్తి చేయాలి

–జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్.

ప్రజాభూమి ప్రతినిధి–అమలాపురం



ఆగస్టు 31 నాటికి జొన్నాడ ఫ్లైఓవర్ బ్రిడ్జ సర్వీస్ రోడ్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణమూర్తి తో కలిసి జొన్నాడ ఫ్లైఓవర్ బ్రిడ్జ నిర్మాణ పనులు, సర్వీస్ రోడ్లు, అప్రోచ్ రోడ్లు వంటి అంశాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 31 నాటికి సర్వీస్ రోడ్డు వేగవంతంగా పనులను పూర్తి చేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశించారు. అలాగే మిగిలిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.పనుల్లో ఎటు వంటి జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయంతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని, అధికారులతో సమన్వయం చేసుకొని ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కు ఆదేశించారు.



## రేఖపల్లిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభం

ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం.

మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ క్లస్టర్ ఇంచార్జ్ వాళ్ళ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని సోమవారం రేఖపల్లి గ్రామంలో ప్రారంభించారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు, క్లస్టర్ ఇంచార్జ్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు విజయాలు పై ప్రజలకు వివరించటం, ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సూచనలతో, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆదేశానుసారము ఈ కార్యక్రమం గ్రామ గ్రామమున నిర్వహించడం జరుగుతుందనీ వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాయం రామారావు, సొసైటీ చైర్మన్ గొంది చంద్రయ్య, యూనిట్ ఇన్చార్జులు బొర్రా నరసింహారావు, బీరకా ప్రకాష్ రావు, ముత్యాల చంద్రశేఖర్, సవలం రాజేంద్రప్రసాద్, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ తెల్లం అప్పారావు, మాజీ కార్యదర్శి బురక కన్నారావు, వడ్డీగూడెం శివాలయం చైర్మన్ బొర్రా ఆదినారాయణ, బోదు బోయిన సురేష్, చక్రపాణి, వెంకమ్మ, కోట్ల వాసు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలి



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులను శాశ్వ త ఉద్యోగులుగా చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 30న ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిం చే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆగిరిపల్లిలోని కుశలవ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వద్ద గేటు మీటింగ్ నిర్వహించి కార్మికులకు అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.ఇ.డి. ప్రసాద్, నూజివీడు కార్యదర్శి జి. రాజు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం అందరూ ధర్నాలో పాల్గొనాలని కోరా రు. ఈ కార్యక్రమంలో కుశలవ యూనియన్ నాయకులు అయ్యప్ప, శ్రీనివాస్, చంటి, పేతురు, రాఘవ, నరేష్, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో ఐదు పశువులు మృతి.

ప్రజా భూమి ప్రతినిధి–బుట్టాయగూడెం



మండలంలోని ఇనుమూరులో ఆదివారం రాత్రి కురిసిన వర్షాల సందర్భంగా పిడుగుపడి ఐదు పశువులు మృతి చెందాయని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కారం ముత్యాల రావు తెలిపారు. స్థానిక విలేకరులతో ముత్యాలరావు మాట్లాడుతూ పశువులే జీవనాధారంగా ఉన్న గిరిజన కుటుంబాలకు ఈ ఘటన తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశా రు.సంబంధిత అధికారులు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించి, అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే, ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయే గిరిజన కుటుంబాలకు అత్యవసర సహాయ చర్యలు చేపట్టా లని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు ఎదురైనప్పుడు వెంటనే స్పందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.బాధిత గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేసి, వారి జీవనోపాధి పునరుద్ధరణకు అవసరమైన సహాయం అందించాలని ముత్యాలరావు కోరారు.

## సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి, వ్యవసాయంపై కీలక ఆదేశాలు

### వర్షాకాల పారిశుధ్య చర్యలు, పంట బీమా నమోదు, ఆరుతడి పంటల సాగుపై అధికారుల సూచనలు



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల అధ్యక్షురాలు గొళ్ళ అనూష అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిం చాలని, డ్రైనేజీలను ప్రతిరోజూ శుభ్రం చేయడంతో పాటు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల అధ్యక్షురాలు అధికారులను ఆదేశించారు. అనంతరం వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి భవాని మాట్లాడుతూ మండలంలోని రైతులు బోర్ల కింద వరి సాగుకు దూరంగా ఉండి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆ పంటలకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు మండల వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తామని అవసరమైన రైతులు కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట బీమా నమోదు చేసుకోవాలని, గ్రామ కార్యదర్శులు తమ గ్రామాల్లో రైతులకు ఈ విషయాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో అబ్దుల్ సలాం, డిప్యూటీ ఎంపీడీవో దుర్గారావు, జడ్పీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రెండేళ్ల అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తున్న డోర్ టూ డోర్ కార్యక్రమం



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం చిన్న ఆగిరిపల్లి గ్రామంలోని 265వ బూత్లో "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం" డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు పామర్తి రామాంజనేయ కుమార్, ఆగిరిపల్లి పీఏసీఎస్ చైర్మన్ పల్లగాని గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పల్లగాని రామ్మోహన్ రావు, పల్లగాని రత్తయ్య, పామర్తి రామకృష్ణ, పరసా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## క్షీరా రామంలో సప్త ప్రదక్షిణాలు భక్తులు

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు



పాలకొల్లు పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు తేదీ 27 7.26 సోమవారం సాయంత్రం గం.5 గంటల 30 నిమిషాలకు ఏడు మారేడు దళములతో మాడవీధుల్లో సప్త ప్రదక్షిణాలు చేయుటకు గాను భక్తులు సుమారు 350 మంది పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ఆలయ చైర్మన్ మీసాల రామచంద్రరావు, సూపరింటెండెంట్ పి . వాసు, ఆలయ ప్రధాన అర్చకులు సన్నిధి రాజు రామ కృష్ణమూర్తి (కిష్టప్ప) గారు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

మంగళవారం 28 జూలై 2026

## హాస్టల్ తనిఖిచేసిన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్




ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాల మేరకు, అనంతపురము జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ భీమారావు ఆదేశాలతో ఈరోజు అనగా 27-07-2026 వ తేదిన ఎస్సీ కాలేజీ హాస్టల్, ఎస్సీ బాలికల హాస్టల్ బిసి బాలికల హాస్టల్ నందు " ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పాటించడం జూలై 28" పురస్కరించు కొని ఈరోజు న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. నీరు, అడవులు, ఖనిజాలు, వన్యప్రాణుల వంటి సహజ వనరులను కాపాడుకోవడం. భూమిపై జీవ సమతుల్యత దెబ్బతినకుండా పర్యావరణాన్ని ఎలా పరిరక్షించాలో ప్రజల్లో చైతన్యం తెప్పించడం, రాబోయే తరాల కోసం భూమిపై వనరులు మిగిలేలా సుస్థిరమైన విధానాలను ప్రోత్సహించడం విషయాలను విద్యార్థులకు వివరించడం జరిగింది. జిల్లా న్యాయ సేవ అదికార సంస్థ సేవలు, మరియు 1098 చైల్డ్ హెల్ప్ లైన్ గురుంచి జిల్లా న్యాయ సేవ అదికార సంస్థ, అనంతపురము కార్యదర్శి రాజశేఖర్ విద్యార్తులకు వివరించారు. హాస్టల్ వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కల్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వర్లీ కళాకృతుల ద్వారా వినూత్నంగా సంపూర్ణ రామాయణం ప్రదర్శన..

**- : తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు..**

**- : విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం





గార్లదిన్నె మండలం కల్లూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వర్లీ కళాకృతుల ద్వారా (వర్లీ ఆర్ట్ పెయింటింగ్స్) "సంపూర్ణ రామాయణం"ను వినూత్నంగా ప్రదర్శించినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా అధికారికంగా గుర్తింపు పొందారు. ఈ విషమమై అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం డిప్యూటీ డిఈఓ శ్రీనివాసరావుతో కలిసి గార్లదిన్నె మండలం కల్లూరు జడ్పీ హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు డా.వరలక్ష్మి, స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ వర్లీ కళాకృతుల ద్వారా (వర్లీ ఆర్ట్ పెయింటింగ్స్) "సంపూర్ణ రామాయణం"ను వినూత్నంగా ప్రదర్శించినందుకుగాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా అధికారికంగా గుర్తింపు పొందడం పట్ల ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు డా.వరలక్ష్మి, ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు కుమార్తె, స్పెషల్ ఎడ్యుకేటర్ సైకాలజిస్ట్ మరియు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ సాయి దీపిక సంకేపల్లి, విద్యార్థులను అభినందించారు. తక్కువ సమయంలో వర్లీ కళాకృతుల ద్వారా "సంపూర్ణ రామాయణం"ను అర్థం చేసుకుని వినూత్నంగా ప్రదర్శించడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు డా.వరలక్ష్మి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య మరియు వృత్తి విద్యను విద్యార్థులకు పరిచయం చేసేందుకు మరియు నూతన జాతీయ విద్యా విధానం అమలు చేసేందుకు ఈ విధానం దోహదపడుతుందని తెలిపారు. "సంపూర్ణ రామాయణం"లోని 7 ఖండాలను 7 గురు విద్యార్థులు, 20 మార్కులకు ఉన్న పాఠ్యాంశాన్ని 20 కుండల మీద చిత్రీకరించి రికార్డు సాధించటం జరిగిందని తెలిపారు. తాను, తన కుమార్తె సాయి దీపిక సంకేపల్లి "సంపూర్ణ రామాయణం"ను వినూత్నంగా ప్రదర్శించినందుకుగాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా అధికారికంగా గుర్తింపు పొందడం జరిగిందని తెలిపారు. తమ ద్వారా విద్యార్థులు కూడా వర్లీ కళాకృతుల ద్వారా "సంపూర్ణ రామాయణం"ను అర్థం చేసుకుని వినూత్నంగా ప్రదర్శించడంతో వారికి కూడా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, జడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు రక్షిత, సౌజన్య, సుప్రజ, హేమంత్, తరుణ్ తేజ, సురేఖ, 9వ తరగతి విద్యార్థిని శ్రీలేఖ, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల చేయూతతో ప్రభుత్వ పాఠశాలకు కొత్త భరోసా

**-మెరిట్ విద్యార్థులకు ఇంటర్ విద్య ఉచితం**

**-నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల మరోసారి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికకు వేదికైంది. 1980--81 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం తమ పాత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమను తీర్చిదిద్దిన విద్యాలయానికి తిరిగి వచ్చి, పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అనిల్ కుమార్, డాక్టర్ రామచంద్రరావులు విద్యార్థులకు ప్రోత్సాహక ప్రకటన చేశారు. ఈ విద్యాసంవత్సరం నుంచి నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసిస్తే, వారి ఫీజులను తామే పూర్తిగా భరిస్తామని ప్రకటించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన పూర్వ విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాల కల్పనలో తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి గంగప్ప మాట్లాడుతూ, తాను చదువుకున్న అమరాపురం మండలం వలస గ్రామ పాఠశాలలో పూర్వ విద్యార్థులు కలిసి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అదే స్ఫూర్తితో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ విద్యాసంస్థల అభివృద్ధికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు, విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు, విద్యా నాణ్యత పెంపు వంటి అంశాల్లో పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ మాట్లాడుతూ, తమ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు తిరిగి వచ్చి విద్యార్థులను ప్రోత్సహించడం, విద్యాభివృద్ధికి చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. వీరి సహకారం ఇతర పూర్వ విద్యార్థులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు వెంకటేష్, భారతి, గీత, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల ప్రకటనతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆనందం వ్యక్తమైంది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం మరింత పెరగాలని పలువురు ఆకాంక్షించారు.



## ఎన్ టి ఏ వ్యవస్థను రద్దుచేసి నీట్ పరీక్షల నిర్వహణ రాష్ట్రాలకు అప్పజెప్పండి. సిపిఐ మండల కార్యదర్శి డి పెద్దయ్య




ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలోనీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ జాతీయ పిలుపు మేరకు ఎన్ టి ఏ వ్యవస్థను రద్దుచేసి నీటి పరీక్షలు నిర్వహణ రాష్ట్రాలకు అప్పచేపాలని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి డి, పెద్దయ్య మాట్లాడుతూ కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవి బిజెపిపార్టీ కి చెందిన వారికి కాకుండా ఎన్ డి లో ఉన్న లౌకిక పార్టీ ల ఎంపీలకు ఇవ్వాలని, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద 49 రోజులపాటు విద్యార్థిని యువకులు వారి తల్లిదండ్రులు పోరాటాలలో పాల్గొన్నారు. పోరాట ఫలితంగానే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఇది విద్యార్థులు సాధించిన ఘనవిజయం. అదేవిధంగా నీట్ పరీక్ష పేపర్ లీకేజీ తో సహా ఆరోపణలు వెలువెత్తుతున్న నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. గతం నుంచి కూడా పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్టిఏ ను రద్దు చేయాలని ఆయా రాష్ట్రాలకు అధికారం ఇవ్వాలని కోరుతున్నాయి. కేంద్రంలో మోడీ ఆధ్వర్యంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా విద్యా రంగాన్ని వ్యాపార దృక్పథంతో చూడడంతో పాటు మతపరమైన రంగు పులుముడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మోడీ సర్కార్ 2020 లో ప్రవేశపెట్టిన విద్యార్థి వ్యతిరేకంగా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. కావున ఎన్టిఏ వ్యవస్థను రద్దుచేసి నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రానికి అప్పజెప్పాలని నీటి పేపర్ లీకేజీ వలన ఆత్మహత్య చేసుకున్న ఒక్కొక్క కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని, అలాగే ఒక కుటుంబానికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని, జంతర్ మంతర్ ఆందోళనలో కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు నిరుద్యోగులపై బనయించిన కేసులు ఎత్తివేయాలని భారత కమ్యూనిటీ పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలవడం జరిగినది. ఈ కార్యక్రమంలోసహాయ కార్యదర్శి, బాలు, వృత్తి దారుల మండల అధ్యక్షులు, ఓబుళపతి, డి హెచ్ పి ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు, పెద్దన్న, రాఘవేంద్ర, నారాయణ, ఓబులేష్, రాజు, పుట్లూరు నారాయణ, సుబ్బరాయుడు, ఓబుళపతి, రాజ్ కుమార్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్






ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

నేటి యువతభాగస్వామ్యం మన దేశ అభివృద్ధి లోఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు మై భారత్ కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వ శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరి ముఖ్యంగా విద్యా, సంక్షేమ, క్రీడా, ఎన్ఎస్ఎస్, జిల్లా ప్రజా పరిషత్, డిపిఓ, ఎస్ ఎస్ ఏ, ఆన్ సెట్ తదితర శాఖ అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మై భారత్ కార్యక్రమాలను గ్రామస్థాయి నుండి మొదలుకొని కళాశాలల వరకు విస్తృతంగా తీసుకెళ్లి యువతలో అవగాహన పెంపొందించాలని తెలిపారు. యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావడానికి మై భారత్ వేదికగా నిలుస్తోందని జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు విద్యాసంస్థలు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. 2026 -27 సంబంధించి జిల్లాలో మైభారత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వార్షిక కార్యచరణ ప్రణాళిక యువ జన కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ శిక్షణలో సామాజిక సేవ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ తదితర కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించి ఈ సందర్భంగా కార్యాచరణను జిల్లా కలెక్టర్ రూపొందించి పలు ఆదేశాలు సూచనలు జారీ చేశారు. అనంతరం మైభారత్ ప్రచార సామాగ్రి పోస్టర్ల స్టిక్కర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలోజిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్, డిఆర్ఓ మాలోల యువజన అధికారి ఐశయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్ , మల్లికార్జున రెడ్డి, పద్మావతి, కిరణ్మయి, డి ఐ పి ఆర్ ఓ బాల కొండయ్య, మై భారత్ కోఆర్డినేటర్ బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బి సాటి జీవన్ కుమార్, జయ మారుతి, వాలంటీర్లు అంబరీష్, సాయి కార్తీక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. జి.మమత, ఆన్ సెట్ మేనేజర్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురానికి ఎయిర్‌పోర్టు అవసరం పునఃసర్వేతో మార్గం చూపండి

- కేంద్ర మంత్రి రామ్‌మోహన్ నాయుడిని కోరిన రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపి అంబికా లక్ష్మి నారాయణ..



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లాలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలని కోరుతూ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్‌మోహన్ నాయుడితో సమావేశమై కోరారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గతంలో అనంతపురం జిల్లాలోని కూడేరు పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో చుట్టుపక్కల కొండలు ఉండడం వల్ల రెండు వైపులా విమానాలు ల్యాండ్ అయ్యే అవకాశం లేదని ఏవియేషన్ అధికారులు నివేదిక ఇచ్చిన విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. అయితే విశాఖపట్నం పాత విమానాశ్రయంలో అమలు చేసినట్లుగా వన్‌సైడ్ ల్యాండింగ్ విధానంలో రన్‌వే ఏర్పాటు చేసిన తరహాలో కూడేరు ప్రాంతంలో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. మరోసారి సమగ్ర సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రాంతీయ విమానయానాన్ని మరింత విస్తరించేందుకు చేపట్టిన చర్యలను కూడా మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. రాబోయే పదేళ్లలో దేశవ్యాప్తంగా మరో 100 ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఉడాన్ పథకాన్ని అనంతపురానికి వర్తింప చేయాలని పయ్యావుల కోరారు. అనంతపురం జిల్లా దేశంలోనే ఉద్యాన పంటల సాగులో అగ్రగామి జిల్లాల్లో ఒకటని, పెద్దఎత్తున ఇక్కడి నుంచి వివిధ మార్కెట్లకు తరలుతున్నాయని మంత్రి పయ్యావుల కేశవ్ రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుతో హార్టికల్చర్ కార్గోకు విస్తృత అవకాశాలు ఏర్పడి, రైతులు తమ ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు వేగంగా ఎగుమతి చేసే అవకాశం లభిస్తుందని, తద్వారా మెరుగైన గిట్టుబాటు ధరలు లభించి రైతుల ఆదాయం పెరుగుతుందని వివరించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందని, ఈ దిశగా చేపడుతున్న కార్యక్రమాలకు అనంతపురంలో ఎయిర్‌పోర్టు కీలక మౌలిక వసతిగా నిలుస్తుందని పయ్యావుల తెలిపారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి సర్వే నిర్వహించి 30 రోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

# రైతు కోసం చెమటోడ్చిన చేతులు...

- నేడు న్యాయం కోసం పోరాటం.. -12 ఏళ్ల సేవలకు గుర్తింపు ఎక్కడ..,!
- రూ.35 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఉచిత వైద్యం, ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

వ్యవసాయ రంగానికి వెన్నెముక రైతు అయితే, రైతుకు క్షేత్రస్థాయిలో అండగా నిలిచే ఉద్యోగుల్లో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎంపీఈవోలు) కీలకమైనవారు. విత్తనం నుంచి కోత వరకు రైతు వెంట ఉంటూ ప్రభుత్వ వ్యవసాయ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయించడం, రైతులకు సాంకేతిక సూచనలు అందించడం, పంటల పరిస్థితిని పరిశీలించడం, పంట నష్టాలను నమోదు చేయడం, ప్రభుత్వానికి నివేదికలు పంపడం, రైతులకు అవగాహన కల్పించడం వంటి అనేక బాధ్యతలను ఈ సిబ్బంది నిర్వర్తిస్తున్నారు. అయితే రైతు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఈ ఉద్యోగుల జీవితాలు మాత్రం నేటికీ అనిశ్చితిలోనే కొనసాగుతున్నాయి. రైతు సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తూ ప్రభుత్వ వ్యవసాయ పథకాలను గ్రామీణ స్థాయిలో విజయవంతంగా అమలు చేస్తున్న మండల వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎంపీఈవోలు) ఇప్పుడు తమ హక్కుల సాధన కోసం ఉద్యమబాట పట్టారు. గత 12 సంవత్సరాలుగా వ్యవసాయ శాఖకు సేవలందిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత, గౌరవప్రదమైన వేతనం, సంక్షేమ సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం సూత్రం ప్రకారం నెలకు రూ.35 వేల కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగాలను రెగ్యులర్ చేసి, ఉచిత వైద్య సేవలు, ప్రమాద బీమా, ఈహెచ్ఎస్ (హెల్త్ కార్డు) వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమంలో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం జిల్లాకు చెందిన 189 మంది, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన 145 మంది, మొత్తం 334 మంది ఎంపీఈవోలు గత పక్షం రోజులుగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వినతిపత్రాల సమర్పణ, నల్ల బ్యాడ్జీలతో విధులు, ధర్నాలు, పెన్‌డౌన్ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సానుకూల స్పందన కనిపించకపోవడం వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఎంపీఈవోలు వ్యవసాయ శాఖలో అత్యంత కీలకమైన క్షేత్రస్థాయి సిబ్బంది. పంటల నమోదు, ఈ-క్రాప్, రైతు భరోసా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టాల అంచనా, ప్రభుత్వ సబ్సిడీ పథకాల అమలు, రైతులకు సాంకేతిక సలహాలు, అవగాహన కార్యక్రమాలు వంటి అనేక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను రైతుల గడపకు చేర్చడంలో వారే ప్రధాన వారధిగా ఉన్నప్పటికీ, వారి సేవలకు తగిన గుర్తింపు లభించడం లేదని సంఘం నాయకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎంపీఈవోలకు అందుతున్న గౌరవ వేతనం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల విద్య, వైద్య ఖర్చుల నేపథ్యంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు చెబుతున్నారు. అంతేకాకుండా గత కొన్ని నెలలుగా వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రధాన డిమాండ్లలో ఎంపీఈవోలను వెంటనే రెగ్యులర్ చేయడం, సమాన పనికి సమాన వేతనం ప్రకారం నెలకు రూ.35 వేల వేతనం అమలు చేయడం, నాన్-శాంక్షన్ పోస్టులను శాంక్షన్ పోస్టులుగా మార్చడం, ఈహెచ్ఎస్ హెల్త్ కార్డు సదుపాయం కల్పించడం, ప్రమాద బీమాతో పాటు విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించడం, మహిళా ఉద్యోగినులకు చైల్డ్ కేర్ లీవ్స్ మంజూరు చేయడం వంటి అంశాలు ఉన్నాయి.

**ఎంపీఈవోల ప్రధాన డిమాండ్లు ఇవే...**

దశాబ్దానికి పైగా సేవలందిస్తున్న ఎంపీఈవోలను తక్షణమే రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం సూత్రం ప్రకారం కనీసం నెలకు రూ.35,000 గౌరవ వేతనం అమలు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం నాన్-శాంక్షన్ పోస్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగులను శాంక్షన్ పోస్టుల్లోకి తీసుకుని శాశ్వత ఉద్యోగ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కుటుంబ సభ్యులకు కూడా వైద్య భద్రత కల్పించే హెల్త్ కార్డు సౌకర్యాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి ప్రమాద బీమాతో పాటు ఎక్స్‌గ్రేషియా సాయం అందించే విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళా ఎంపీఈవోలకు చైల్డ్ కేర్ లీవ్స్ మంజూరు చేసి కుటుంబ బాధ్యతలను నిర్వర్తించే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

**రైతు కోసం పనిచేస్తున్న మాకు న్యాయం చేయాలి- వల్లపు రాజేష్‌బాబు జిల్లా అధ్యక్షులు ఎంపీఈవో అసోసియేషన్ శ్రీ సత్యసాయి**



వ్యవసాయ శాఖలో 12 సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న ఎంపీఈవోలు ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రైతు కష్టసుఖాల్లో భాగస్వాములమై, పంటల నమోదు నుంచి ప్రకృతి విపత్తుల సమయంలో నష్టాల అంచనా వరకు ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తున్నాం. అయినప్పటికీ ఉద్యోగ భద్రత, గౌరవప్రదమైన వేతనం, సంక్షేమ సౌకర్యాలు లేకపోవడం బాధాకరం. మా సేవలను గుర్తించి వెంటనే ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలి'' అని డిమాండ్ చేశారు.

**ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాల మనుగడ ప్రశ్నార్థకం- ఆర్. మీనా ఎంపీఈవో ధర్మవరం**



క్షేత్రస్థాయిలో పగలు, రాత్రి తేడా లేకుండా రైతులకు సేవలు అందిస్తున్నాం. అయితే ప్రస్తుతం అందుతున్న గౌరవ వేతనం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదు. పెండింగ్ వేతనాలు విడుదల కాకపోవడంతో అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిళా ఉద్యోగినుల కోసం చైల్డ్ కేర్ లీవ్స్, ఈహెచ్ఎస్, ప్రమాద బీమా వంటి కనీస సంక్షేమ సౌకర్యాలు కూడా లేవు. ప్రభుత్వం మా సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# కూటమి ప్రభుత్వ విధానాలపై 28న కడపలో భారీ నిరసన ర్యాలీ

**-డీఎస్సీ అక్రమాలపై వైకాపా నిరసన - 28న కడపకు తరలిరండి**
**-విద్యార్థి-యువత ర్యాలీని జయప్రదం చేయండి: వైఎస్ మనోహర్ రెడ్డి**



ప్రజాభూమి,పులివెందుల
కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువత పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు, డీఎస్సీ నియామకాల్లో జరుగుతున్న అక్రమాలకు నిరసనగా ఈ నెల 28వ తేదీన కడపలో భారీ విద్యార్థి-యువత నిరసన ర్యాలీ నిర్వహించను న్నట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ర్యాలీని చేపడుతున్నామని వైఎస్ మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి విద్యార్థుల భవిష్యత్తును గాలికొదిలేసిందని ఆరోపించారు. ఉద్యోగాల భర్తీలో జాప్యం, డీఎస్సీ లో అవకతవకలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేత వంటి చర్యలతో యువత జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ఈ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ప్రతి విద్యార్థి, యువకుడు స్వచ్ఛందంగా కదలి రావాలి. 28న కడపలో జరిగే నిరసన ర్యాలీని భారీగా విజయవంతం చేయాలి"లి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థి విభాగం, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీని విజయవంతం చేసేందుకు ఇప్పటి నుండే ప్రచారం ముమ్మరం చేయాలని నాయకులు నిర్ణయించారు.

# ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీడీపీ నేతలు

**- సిద్ధవటం మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన**



ప్రజాభూమి, సిద్ధవటం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో చేపట్టిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం సోమవారం సిద్ధవటం మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ గంగానగర్ గ్రామంలో 27, 29 బూతుల పరిధిలో నిర్వహించారు. టిడిపి రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజా నాయుడు, పందిపాటి బాలకృష్ణ పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను తెలుసుకొని పార్టీ దృష్టికి తీసుకెళ్లేందుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రజల సంక్షేమాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- ప్రజల వద్దకు ప్రభుత్వం -- ప్రతి ఇంటికి సంక్షేమం**

**- టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి**

ప్రజాభూమి, వేంపల్లె
ప్రజల సంక్షేమం, అభివృద్ధే టిడిపి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పట్టణంలో నిర్వహించిన 'ప్రజల వద్దకు ప్రభుత్వం -- ప్రతి ఇంటికి సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజా పాలన అందిస్తోందన్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బీటెక్ రవి ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, వారి స్పందనే మంచి పాలనకు నిదర్శనమని టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టౌన్ క్లస్టర్ ఇంచార్జీ మహమ్మద్, నాయకులు తెలంగాణ వలి, పి.వి. రమణ, తిప్పారెడ్డి, మోహన్ రెడ్డి, కటిక నాగరాజు, జబిబుల్లా, దక్కా రమేష్, మాబుషరీఫ్, తక్కెల షరీఫ్, పీరా సాహెబ్, యాసిన్, పూల అల్లాబకష్, రామచంద్ర, గండికోట శివ, ఇస్మాయిల్, మదార్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరాలి

**- జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థులు**

ప్రజాభూమి, వేంపల్లె
విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసుల రెడ్డి సూచించారు. సోమవారం నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల ఎంపిక ట్రయల్స్‌లో ఆ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 వాలీబాల్ విభాగంలో వి. గురుచరణ్, పి. విష్ణుచరణ్, బి. అజయ్, ఎస్. యాకూబ్, పి. నాయబ్ రసూల్, అలాగే లాంగ్ జంప్ విభాగంలో ఎల్. ఆనంద్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసుల రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించి, జిల్లా స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో కృషి చేసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు నిషాల్, ప్రమీల కుమారిని ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.




## కేవైసీ పూర్తికాని వినియోగదారులకు ఇకపై గ్యాస్ బుకింగ్ అవ్వదు

**-ఈ కేవైసీ చేయించుకుని వారు తప్పకుండా చేయించుకోవాలి**

**శ్రీ సాయి హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ**

ప్రజాభూమి,పులివెందుల
ప్రభుత్వ నిబంధనల ప్రకారం, కేవైసి పూర్తికాని వినియోగదారులకు, ఇకపై గ్యాస్ బుకింగ్ అవ్వదు అనిశ్రీ సాయి హెచ్పీ గ్యాస్ ఏజెన్సీ వారు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా వినియోగదారుడు చనిపోయి ఉంటే, వారికి సంబంధించిన వారి పేరు మీదకు కనెక్షన్ మార్చుకొని కేవైసి చేయించు కోవాలని వారు తెలిపారు. అలాంటి సమస్య ఉన్న మా వినియోగదారులు నారాయణ కాలేజ్ మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్‌కు వచ్చి ఆధార్ కార్డు, గ్యాస్ పాస్ బుక్‌తో కేవైసి పూర్తి చేయించుకోవాలని వారు తెలిపారు.




# ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

**ట్రాఫిక్ నిబంధనలు తప్పితే కఠిన చర్యలు**

**జీరో యాక్సిడెంట్లే లక్ష్యం: డీఎస్పీ బుక్కే మురళి**




ప్రజాభూమి,పులివెందుల
కడప జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పులివెందుల పట్టణంలోని ఆటో డ్రైవర్లు మరియు యజమానులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పులివెందుల డీఎస్పీ శ్రీ బుక్కే మురళి, ఎంవీఐ ప్రసాద్ హాజరయ్యారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జి. ప్రసాదరావు మాట్లాడుతూ డ్రంకెన్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వంటివి చేయవద్దని సూచించారు. అలాగే హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, ప్రయాణికుల నుండి అధిక చార్జీలు వసూలు చేయరాదని పేర్కొన్నారు. ఎంవీఐ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి వాహన డ్రైవర్ తప్పనిసరిగా ఆర్సీ, లైసెన్స్, బీమా, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని, వాటి ప్రాముఖ్యతను వివరించారు. డీఎస్పీ బుక్కే మురళి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, నిర్దేశిత ఆటో స్టాండ్‌లలోనే వాహనాలు నిలపాలని సూచించారు. ముఖ్యంగా స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనం నడపడం తమ ప్రాణాలకు, ఇతరుల ప్రాణాలకు ముప్పు అని తెలిపారు. ప్రయాణికులు మర్చిపోయిన విలువైన వస్తువులు దొరికితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో అప్పగించి నిజాయితీ చాటుకోవాలని కోరారు. మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పులివెందుల పట్టణం నిఘా నేత్రాల పర్యవేక్షణలో ఉందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జీరో యాక్సిడెంట్లే పులివెందుల పోలీసుల లక్ష్యంఅని చెప్పి ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ఆటో డ్రైవర్లు, యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆపదలో ఉన్న విద్యార్థికి అండగా నిలిచిన ఉపాధ్యాయులు

**దాతల సహకారం స్ఫూర్తిదాయకం.**

**ఏఐఎఫ్ఇటిఓ జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి**

ప్రజాభూమి పోరుమామిళ్ల :
ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేద విద్యార్థికి మేమున్నామంటూ అండగా నిలిచి,వైద్యచికిత్స కోసం ఆర్థిక సహకారం అందించిన ఉపాధ్యాయులు, దాతల సహకారం స్ఫూర్తిదాయకమని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్ ఇటి ఓ)జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి తెలిపారు. ఎగువరామాపురం జడ్పీ ఉన్నత పాఠశాల నందు ఆరవ తరగతి చదువుతున్న సుంకర మదన్ ఇటీవల పాముకాటుకు గురికావడం జరిగినది. అత్యవసర చికిత్స నిమిత్తం గిద్దలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రి నందు చేర్చడమైనది. తండ్రి లేకపోవడం,పేదరికం కారణంగా హాస్పిటల్ ఖర్చులు భరించలేని స్థితిని గమనించిన, ఉపాధ్యాయ సంఘనాయకుడు రమణారెడ్డి మరియు పాఠశాల ఉపాధ్యాయులు కస్తూరి శ్రీనివాసులు,కె.వి. సత్యనారాయణ, ఎస్.కమల్ వారి వంతుగా విద్యార్థికి కొంత ఆర్థిక సహాయం అందజేస్తూ, సోషల్ మీడియా వేదికగా పంపిన సందేశానికి స్పందించిన పలువురు దాతలు దాతృత్వంతో అందజేసిన ఒక లక్ష యాభై మూడువేల అయిదు వందల రూపాయలను సోమవారం ఆసుపత్రికి వెళ్లి విద్యార్థి తల్లి కాంతమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యల పరిష్కారం లోనే కాకుండా సామాజికసేవలో సైతం ముందుంటామని చాటి చెబుతూ, ఆపదలో ఉన్న విద్యార్థికి సహాయం చేసిన ఎస్టీయు నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు,మరియు ఇతర దాతలు అభినందనీయులని పేర్కొన్నారు. విద్యార్థి మదన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులు తమ సహచర విద్యార్థికి చేయూత అందజేయాలని సదుద్దేశంతో సోమవారం వారి ఖర్చుల కోసం తెచ్చుకున్న డబ్బులను పోగు చేసి విద్యార్థి తల్లికి పాఠశాల ఉపాధ్యాయుల ద్వారా అందజేయడం జరిగినది. విద్యార్థి తల్లి కాంతమ్మ వారి బంధువులు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ బిడ్డ వైద్య ఖర్చులకు ఆర్థికసహాయం చేసిన దాతల మేలు జీవితాంతం మరిచి పోలేమన్నారు. మీ అందరి ఆశీస్సులతో తమ బిడ్డ త్వరలోనే కోలుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు మార్కాపురం జిల్లాఅధ్యక్షుడు టి.కె.ఎస్. ప్రసాద్,కడప జిల్లా ఆర్థిక కార్యదర్శి యు.సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్ బాబు,వీరారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మణిమాల,శివ తదితరులు పాల్గొన్నారు.



# బాబు శ్యామ్ నందన్ ప్రాణం కోసం రోడ్డెక్కిన తపస్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు

**17 కోట్ల జోల్జెన్స్మా ఇంజెక్షన్ కోసం విద్యార్థుల పోరాటం**

**ఎస్ఎంఎ వ్యాధితో పోరాడుతున్న శ్యామ్ నందన్‌ను కాపాడండి**

ప్రజాభూమి,పులివెందుల
అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ టైప్-1 ( ఎస్ ఎం ఏ టైప్ -1) వ్యాధితో బాధపడుతున్న అనంతపురం జిల్లా, కదిరిగుట్టపల్లెకు చెందిన బాబు శ్యామ్ నందన్ ప్రాణాలను కాపాడేందుకు తపస్య ఇంటర్మీడియట్ కాలేజ్ విద్యార్థులు మానవతా కార్యక్రమం చేపట్టారు. శ్యామ్ నందన్ చికిత్సకు "జోల్జెన్స్మా అనే ఇంజెక్షన్ అవసరం. ఈ ఒక్క ఇంజెక్షన్ ఖర్చు రూ. 17 కోట్లుఇంత భారీ మొత్తాన్ని భరించలేని కుటుంబ పరిస్థితిని చూసి చలించిన సహ విద్యార్థులు ఫండ్ సేకరణకు పూనుకున్నారు. సోమవారం పులివెందుల పట్టణంలోని వాణిజ్య సముదాయాలు, ప్రధాన రహదారుల్లో విద్యార్థులు ఇంటింటికి తిరుగుతూ, షాపుల వద్ద నిలబడి ప్రజల నుండి విరాళాలు సేకరించారు. మన చిన్న సహాయం ఒక ప్రాణాన్ని కాపాడుతుంది అంటూ శ్యామ్ నందన్ పరిస్థితిని వివరిస్తూ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు, వ్యాపారులు హృదయపూర్వకంగా స్పందించి తమ వంతు సహాయం అందించారు. ఎస్ఎంఎస్ టైప్ -1 అనేది నరాలకు సంబంధించిన అరుదైన జన్యుపరమైన వ్యాధి. సరైన సమయంలో జోల్జెన్స్మా ఇంజెక్షన్ ఇస్తే పూర్తిగా కోలుకునే అవకాశం ఉంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ బాబు శ్యామ్ నందన్ ను కాపాడుకోవడం కోసం సమాజం అందరూ ముందుకు రావాలని, ప్రతి ఒక్కరూ ఈ మానవతా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. శ్యామ్ నందన్ త్వరగా కోలుకోవాలని అందరూ ఆకాంక్షించారు.




# నిత్య పూజయ్యకోన ఆలయంలో మహిళలకు మౌలిక వసతులు కల్పించాలి



ప్రజాభూమి, సిద్ధవటం:
సిద్ధవటం మండలంలోని వంతాటిపల్లి సమీప లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజేశ్వర కోన ఆలయంలో మహిళా భక్తులకు కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళా భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకుంటారు. అయితే ఆలయ ప్రాంగణంలో మహిళలకు టాయిలెట్లు, స్నానపు గదులు, బాత్రూమ్‌లు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వారు తెలిపారు. పంచలింగాల గుడి సమీపంలో మాట్లాడిన మహిళా భక్తులు, ఆలయానికి లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ ఎండోమెంట్స్ శాఖ అధికారులు మహిళలకు అవసరమైన వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి మహిళా భక్తుల కోసం టాయిలెట్లు, స్నానపు గదులు తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరారు.

# ఇంటింటా సంక్షేమ పథకాల ప్రచారం చేపట్టిన టీడీపీ శ్రేణులు



ప్రజాభూమి, సిద్ధవటం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు సిద్ధవటం మండలం మాచుపల్లి గ్రామంలో సోమవారం టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజు ఆదేశాల మేరకు బూత్ నంబర్లు 5, 6, 7 పరిధిలో మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లు సంజీవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తోందని అన్నారు. శ్రీశక్తి, తల్లికి వందనం, రైతు భరోసా, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి పథకాలపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లు సంజీవరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బాలిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బూత్ ఇన్‌చార్జులు మల్లు రమణారెడ్డి, పిచ్చిరెడ్డి, శేఖర్ రెడ్డి, మల్లు విజయభాస్కర్ రెడ్డి, కో-కన్వీనర్ వేణుగోపాల్ రెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ శీతల గంగమ్మ జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వచ్చే బుధ, గురువారాల్లో నిర్వహించనున్న జాతరను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంతో పాటు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. జాతీయ రహదారి వెంట వివిధ వేషధారణలతో ఆకర్షణీయమైన లైటింగ్ కటౌట్లు ఏర్పాటు చేస్తుండగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఆలయ గర్భగుడికి పెయింటింగ్ పనులు, పరిసరాల పరిశుభ్రత, విద్యుత్ అలంకరణలు వేగంగా కొనసాగుతున్నాయి. జాతర మహోత్సవానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అన్ని ఏర్పాట్లను అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తూ పూర్తి చేస్తున్నారు.

## కర్నూలు రేంజ్ డీఐజీని మర్యాదపూర్వకంగా కలిసిన రంగసముద్రం ఎంపీటీసీ రమణ



ప్రజాభూమి పోరుమామిళ్ల :
కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌ను రంగసముద్రం ఎంపీటీసీ కల్వకూరి రమణ మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై ఆయనతో చర్చించారు. అనంతరం డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాపయ్య, శ్రీకాంత్, మహమ్మద్, నాయబ్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి

**- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి**

**- 28న జరిగే నిరసన ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి**

**- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి**



ప్రజాభూమి, సిద్ధవటం: రాష్ట్రంలో నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని, దీనిపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం భాకరాపేటలోని తన నివాసంలో ఆమె మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో డీఎస్సీపై హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియామకాలను అవినీతి, అక్రమాలకు వేదికగా మార్చిందని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా పేరుతో మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరిగిందని, ప్రత్యేక జీవోల ద్వారా అక్రమాలకు పాల్పడి అనంతరం వాటిని రద్దు చేశారని విమర్శించారు. డీఎస్సీ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో ప్రభుత్వం విఫలమై వేలాది మంది విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకం కలిగించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ అవకతవకలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలపై జూలై 28న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన ర్యాలీలో నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

# గోవధ, గోవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

## గో రక్షకులపై అక్రమ కేసులు నమోదు చేయకుండా నిష్పాక్షికంగా వ్యవహరించాలి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమంలో గోవధ, గోవుల అక్రమ రవాణాకు సంబంధించి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ కోరింది. ప్రజలు, గో ప్రేమికులు, రైతులు, గోశాల నిర్వాహకులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని గోవధ, గోవుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. భారతీయ సంస్కృతిలో గోవుకు విశిష్టమైన స్థానం ఉందని, వ్యవసాయం, పాడి పరిశ్రమ, సేంద్రియ వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణలో గోవు కీలక పాత్ర పోషిస్తుందని బీజేపీ పేర్కొంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్--48 ప్రకారం రాష్ట్రాలు గోవధను నిరోధించే చర్యలు తీసుకోవాలని, ఆర్టికల్--51ఊ(ఘ) ప్రకారం జీవరాశుల పట్ల కరుణ చూపడం ప్రతి పౌరుడి ప్రాథమిక విధిగా పేర్కొనబడిందని గుర్తు చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధ మరియు జంతు సంరక్షణ చట్టం--1977, జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం--1960 ప్రకారం గోవధ, గోవుల అక్రమ రవాణా, జంతువులను అమానుషంగా తరలించడం నేరమని స్పష్టం చేసింది. అయితే వాస్తవ పరిస్థితుల్లో అనేక ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణా కొనసాగుతోందని, స్థానికులు సమాచారం ఇచ్చినా కొన్ని సందర్భాల్లో పోలీసుల నుంచి తక్షణ



స్పందన లేకపోవడం వల్ల గో ప్రేమికులు, గో రక్షకులు స్వయంగా సమాచారం ఇచ్చి వాహనాలను అడ్డుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొంది. ఇలాంటి సందర్భాల్లో అసలు నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బదులు, సమాచారం ఇచ్చిన లేదా గో రక్షణ కోసం ప్రయత్నించిన వారిపైనే కేసులు నమోదు అవుతున్నాయనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపింది. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడం సమర్థనీయం కాదని, అదే సమయంలో చట్టబద్ధంగా సమాచారం అందించే పౌరుల పట్ల కూడా న్యాయబద్ధంగా, నిష్పాక్షికంగా వ్యవహరించడం పోలీసు శాఖ బాధ్యత అని పేర్కొంది. ఈ నేపథ్యంలో గోవధ, గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సున్నిత ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని, ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని, చట్టవిరుద్ధ రవాణా నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేసింది. పశువుల రవాణాకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర చట్టాలపై పోలీసు సిబ్బందికి ప్రత్యేక అవగాహన కల్పించాలని, గో రక్షణ పేరుతో చట్టవ్యతిరేక చర్యలు జరగకుండా చూడడంతో పాటు చట్టబద్ధంగా సమాచారం ఇచ్చిన వారిపై అనవసరంగా కేసులు నమోదు చేయకుండా నిష్పాక్షిక విచారణ జరపాలని కోరింది. అదేవిధంగా పశుసంవర్ధక శాఖ, రవాణా శాఖ, స్థానిక పరిపాలనతో సమన్వయం చేసుకుని సంయుక్త తనిఖీలు నిర్వహించాలని, స్వాధీనం చేసుకున్న గోవులను గుర్తింపు పొందిన గోశాలలకు అప్పగించి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, అక్రమ గో రవాణాకు పాల్పడే ముఠాలపై సమాచార సేకరణ చేసి కఠిన చర్యలు చేపట్టాలని, గోవధ, జంతు హింస, అక్రమ రవాణాపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. గోవధ, గోవుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని, ఫిర్యాదులపై వేగంగా స్పందించి నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో చట్టబద్ధంగా సమాచారం అందించే పౌరుల హక్కులను పరిరక్షిస్తూ న్యాయబద్ధంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాలని భారతీయ జనతా పార్టీ కోరింది. లేని పక్షంలో ప్రజా మద్దతుతో ఉద్యమ కార్యాచరణ చేపడతామని బీజేపీ హెచ్చరించింది.

# మహిళల ఆత్మరక్షణే లక్ష్యన్న జనసేన నాయకులు మిథున్ శాలి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో రేణిగుంటలో ప్రారంభం కానున్న రాక్ ఫైటర్స్ టెక్వాండో క్లబ్ ప్రారంభం కానుంది. రేణిగుంట ఎన్టీఆర్ సర్కిల్‌లో వద్ద బషీర్ కాంప్లెక్స్‌లో రాక్ ఫైటర్స్ టెక్వాండో క్లబ్ ను జనసేన నాయకుడు మిథున్ శాలి ఆధ్వర్యంలో జూలై 29 ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మిథున్ శాలి మీడియాతో మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్షల్ ఆర్ట్స్‌పై చూపుతున్న ఆసక్తి, క్రమశిక్షణ,ఆత్మరక్షణపై ఆయన ఇస్తున్న ప్రాధాన్యతతో స్ఫూర్తి పొంది ఈ టెక్వాండో క్లబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యంగా నేటి పరిస్థితుల్లో ప్రతి మహిళకు సెల్ఫ్ డిఫెన్స్ నైపుణ్యాలు ఎంతో అవసరమని,అదేవిధంగా చిన్నారులు,యువత మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని అన్నారు. క్లబ్ వ్యవస్థాపకుడు,కోచ్ వై.అవినాష్ ఆధ్వర్యంలో టెక్వాండోతో పాటు సెల్ఫ్ డిఫెన్స్,నన్‌చాకు,సిలంబం, ఉరుమి వంటి శిక్షణలు అందించనున్నట్లు తెలిపారు. నిరుపేద బాల బాలికలకు ఉచితంగా నేర్చుకునే అవకాశం కల్పిస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విజయ్ ఆనంద్,జొన్నలగడ్డ మురళి, శ్రీనివాసులు,టి మణికంఠ, జ్యోతి కుమార్,చిన్నా,జాన్, మహేష్,క్రీడాకారులు,యువత పాల్గొని క్లబ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసిన చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి



శ్రీకాళహస్తిలో శ్రీ ద్రౌపతి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన పవిత్ర అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం లక్షలాది మంది భక్తుల సమక్షంలో అత్యంత వైభవోపేతంగా, కనులపండువగా విజయవంతంగా జరగడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ బ్రహ్మోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడంలో విశేష కృషి చేసిన కూటమి నాయకులకు, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఆలయ అధికారులకు, దేవస్థాన సిబ్బందికి, పోలీసు శాఖ అధికారులకు మరియు సిబ్బందికి, పారిశుధ్య సిబ్బందికి, విద్యుత్ శాఖ అధికారులకు, అగ్నిమాపక శాఖ సిబ్బందికి, వైద్య సిబ్బందికి, మీడియా ప్రతినిధులకు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ మహోత్సవం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరి సేవలు చిరస్మరణీయమైనవి. శ్రీ ద్రౌపతి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వారి దివ్య అనుగ్రహం మీ అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# మన తిరుపతి ప్రెస్ క్లబ్‌లో స్వామి రితిదేవ్ ఆధ్యాత్మిక ప్రసంగం




ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

పతంజలి యోగపీఠం సౌత్ జోన్ ఇన్‌చార్జ్ స్వామి రితిదేవ్ మన తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్వామి రితిదేవ్ మాట్లాడుతూ, మానవ జన్మను సద్వినియోగం చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కోపాన్ని నిగ్రహించాలంటే ప్రతిరోజూ లాంగ్ బ్రీతింగ్ (దీర్ఘ శ్వాసాభ్యాసం) చేయడం, నెమ్మదిగా మరియు ఆలోచించి మాట్లాడడం అలవాటు చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత జీవితం, వృత్తిపరమైన జీవితం, కుటుంబ జీవితం, సామాజిక జీవితం–ఈ నాలుగు రంగాలలో సమతుల్యత సాధించడానికి యోగానే ఉత్తమ మార్గం అని ఆయన పేర్కొన్నారు. అలాగే, యోగ ఋషి బాబా రాందేవ్ యోగా, ఆయుర్వేదం ద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించి, సమాజ సేవలో విశిష్టమైన పాత్ర పోషిస్తున్న మహనీయులని కొనియాడారు. అనంతరం మన తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శిక్షణ పూర్తి చేసిన తపసి మురళీ రెడ్డి, అనిల్ గారిని స్వామి రితిదేవ్ గారు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులందరూ పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# కాలభైరవ స్వామి సన్నిధిలో సినీ నటుడు సుమన్

ప్రజాభూమి ప్రతినిధి ఐరాల



ఐరాల మండలం పోలకల సంతగెట్ సమీపంలోనీ కాలభైరవ స్వామి దేవాలయని సినీ నటుడు సుమన్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బత్తల సురేంద్ర నాయుడు, బత్తల నాగరాజు నాయుడు, ట్రస్టు చైర్మన్ మురళి బాబు, సెక్రటరీ ధనుంజయ నాయుడు స్వాగతం పలికి శాలువ కప్పి, పుష్పగుచ్చం తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు రుద్రరాజు శ్రీదేవి, బత్తల రవి నాయుడు, బిటి ప్రసాద్, పోలకల రవీంద్రనాథ్ బాబు, యూత్ జయదీప్, జ్యోతి, భార్గవ్, భాను, తిరుమల, సాయి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

## -తహసీల్దార్ లక్ష్మీనారాయణ

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ



ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన వివిధ వినతులు సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష చేపట్టారు. ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తహసీల్దార్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలనిప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పాలియేటివ్ కేర్ ఇంప్లిమెంటేషన్ పైలట్ ప్రాజెక్ట్ ను సద్వినియోగం చేసుకోండి -డాక్టర్ రోజారమణి

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం



వెూడల్ రూరల్ హెల్త్ రీసర్చ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోం బేస్డ్ పాలియేటివ్ కేర్ ఇంప్లిమెంటేషన్ పైలట్ ప్రాజెక్ట్ -- ఫేజ్-శ్రీలో భాగంగా కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. శిక్షణ రెండో రోజు పాలియేటివ్ కేర్ అవసరమున్న రోగులను గుర్తించి వారికి అవగాహన కల్పించి, అవసరమైన సహాయక పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో దాతలు రిటైర్డ్ డీఎస్పీ జీవమాని పోతప్ప ఇద్దరు పేషెంట్లకు రెండు వీల్‌చైర్లను, ఎస్.వి. మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ డా.వెంకటేశ్వర్లు ఒక ఎయిర్ బెడ్ విరాళంగా ఎపి ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జయరాం ప్రసాద్, రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,ప్రొఫెసర్ డాక్టర్ రోజారమణితో కలిసి, పేషెంట్లు మరియు వారి సంరక్షకుల కోసం రూపొందించిన విద్యా పోస్టర్లు, అవగాహన చార్టులను ప్రాజెక్టు తరపున అందజేశారు. వీటిలో బెడ్ సోర్ సంరక్షణ, మౌత్ కేర్, ఇంట్లో తయారు చేసుకునే నార్మల్ సలైవా, నార్మల్ మౌత్ వాష్, ఆర్టిఫిషియల్ సలైవా తయారీ విధానాలు తదితర పాలియేటివ్ కేర్‌కు సంబంధించిన ఉపయోగకరమైన సమాచారం పొందుపరిచారు. ఈ పోస్టర్లు పేషెంట్లు, కేర్ గివర్స్‌కు ఇంటి వద్దనే మెరుగైన సంరక్షణ అందించేందుకు ఎంతో ఉపయోగపడతాయని రోజారమణి తెలిపారు. ఈ సందర్భంగా హోం బేస్డ్ పాలియేటివ్ కేర్ ఇంప్లిమెంటేషన్ పైలట్ ప్రాజెక్ట్ ప్రధాన పరిశోధకులు డా. రోజా రమణి మాట్లాడుతూ, ప్రాజెక్టుకు రోటరీ క్లబ్, సామాజిక సేవా సంస్థలు, స్వచ్ఛంద సేవకులు అందిస్తున్న సహకారానికి హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ విజయవంతంగా ముందుకు సాగుతున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. పాలియేటివ్ కేర్ సేవలు సమర్థవంతంగా అందాలంటే వైద్యులు, ఫిజియోథెరపిస్టులు, సైకాలజిస్టులు, సోషల్ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మరియు వైద్య సిబ్బంది అందరూ మల్టీడిసిప్లినరీ టీమ్‌గా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తరించి, అవసరమైన ప్రతి రోగికి నాణ్యమైన హోం బేస్డ్ పాలియేటివ్ కేర్ సేవలు అందేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో రోటరీ క్లబ్ సభ్యులు జయరాం ప్రసాద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. జావీద్ తదితరులు పాల్గొన్నారు.

# కక్షసాధింపుతో చెట్ల నరికివేత: రూ.లక్షల్లో నష్టం!

**-బంగారమ్మపేట పంచాయతీ ఉటిపూడిలో దారుణం.**

**-వ్యక్తిగత విభేదాలతో పచ్చని చెట్లను తెగనరికి.. భూమి దున్నేసిన అక్రమార్కులు!**

**-బాధితురాలి ఆవేదన.. పోలీసులకు ఫిర్యాదు, కఠిన చర్యలకు డిమాండ్.**

ప్రజాభూమి ప్రతినిధి సూళ్లూరుపేట



వ్యక్తిగత కక్షలు, విభేదాల నేపథ్యంలో పచ్చని చెట్లను నిలువునా తెగనరికి, భూమిని దున్నేసిన అమానుష ఘటన మండలంలోని బంగారమ్మపేట పంచాయతీ పరిధిలో వెలుగుచూసింది. బాధితుల కథనం ప్రకారం.. బంగారమ్మపేట పంచాయతీ పరిధిలోని ఉటిపూడి గ్రామానికి చెందిన నాగముంతల పద్మమ్మ మరియు ఆమె కుమారులతో ఉన్న పాత కక్షలను మనసులో ఉంచుకుని, అదే గ్రామానికి చెందిన రామాల విజయ్, నాగార్జున రెడ్డి మరొక ఆరుగురు కూలీలతో కలిసి అరాచకానికి ఒడిగట్టారు. బాధితులకు చెందిన భూమిలోని సుమారు రెండేళ్ల వయస్సు కలిగిన చెట్లను ప్లాన్ ప్రకారం నరికివేశారు. అనంతరం ఎవరికీ ఆధారాలు దొరక్కుండా ఉండేలా ఆ భూమిని కూడా దున్నించారని బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

రూ. 1 లక్ష మేర నష్టం – పోలీసులకు ఫిర్యాదు:

ఎంతో ఆశగా పెంచుకుంటున్న పచ్చని చెట్లను నాశనం చేయడంతో తమకు సుమారు రూ. 1 లక్ష వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని, చేతికి అందివచ్చే దశలో ఉన్న చెట్లను నరికేసి తమ పొట్ట కొట్టారని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ అక్రమ ఘటనపై బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంబంధిత పోలీసులు మరియు రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి సంఘటనా స్థలాన్ని పరిశీలించాలని, సమగ్ర విచారణ జరిపి నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

# కాణిపాకంలో ప్రారంభమైన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి ఐరాల



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రతిష్ఠాత్మక '2 ఏళ్ల నమ్మకం... అభివృద్ధి... సంక్షేమం' కార్యక్రమం సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. పూతలపట్టు నియోజకవర్గంలో ఈ కార్యక్రమానికి సోమవారం ఐరాల మండలం కాణిపాకం పంచాయతీలో శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆదేశాల మేరకు ఐరాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంగారపు హరిబాబు నాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమైంది. క్లస్టర్ ఇన్‌చార్జులు, క్లస్టర్ కో–కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ సభ్యులు, కుటుంబ సాధికార సారథులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నామినేటెడ్ పదవుల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 45 రోజుల పాటు ప్రతి బూత్ పరిధిలో ప్రతిరోజూ 30 ఇళ్లను సందర్శిస్తూ ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రచార కార్యక్రమంగా కాకుండా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను మరింత బలోపేతం చేసే అవకాశంగా భావించి ప్రతి కార్యకర్త పూర్తి బాధ్యతతో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల అభిప్రాయాలు, స్థానిక సమస్యలను కూడా నమోదు చేసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు.

# ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ వేగవంతం

## రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి వ్యవసాయ అధికారి కే షణ్ముగం

ప్రజా భూమి ప్రతినిధి
బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండలం కారణిమిట్ట గ్రామంలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ



ముమ్మరంగా కొనసాగుతోంది. వ్యవసాయ శాఖ అధికారి చంద్రమ్మ నేరుగా వరి పొలాలను సందర్శించి, మొబైల్/టాబ్లెట్ యాప్ ద్వారా జియో-ట్యాగింగ్ నిర్వహిస్తూ సాగు వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నారు. ఈ-క్రాప్ నమోదు ఆధారంగానే రైతులకు వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, సున్నా వడ్డీ పంట రుణాలు, ఉచిత పంటల బీమా సౌకర్యాలు అందనున్నాయి. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టాలు సంభవించినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం వంటి ఆర్థిక సహాయాలు పొందేందుకు ఈ నమోదు కీలకంగా మారనుంది. అధికారులు పంట వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన అనంతరం రైతుల మొబైల్ నంబర్లకు సందేశాలు పంపించబడతాయి. ఆ సందేశం ఆధారంగా రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసి, తమ ఈ-క్రాప్ నమోదును ధృవీకరించుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు సురేంద్ర రెడ్డి, చెంగయ్య తదితరులు పాల్గొని పంట నమోదు ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. అధికారులు ప్రతి రైతు తమ పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని కోరారు.

# కొత్త ఇళ్ల గ్రామం ముందర పేరుకుపోయిన మురుగునీటి సమస్య..!

## రహదారిపై నిలిచిపోయిన మురికి నీరు... రోడ్డుపైనే ప్రవహిస్తున్న డ్రైనేజీ..

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:



ఒకప్పుడు ప్రధాన రహదారిగా ఉండి తీవ్ర రద్దీగా ఉండే ఈ మార్గం, జాతీయ రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామీణ రహదారిగా మారింది. ప్రస్తుతం పరిసర గ్రామాల ప్రజల రాకపోకలకు ఇదే ప్రధాన ఆధారంగా ఉంది. అయితే, గ్రామంలోని కల్ రోడ్డు పల్లి పంచాయతీ కొత్త ఇళ్ల గ్రామానికి ముందర మురుగునీరు తారు రోడ్డుపైకి చేరి నిల్వ ఉంటోంది. నిరంతరం రోడ్డుపైనే ప్రవహిస్తుండటంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. నీరు నిలిచిన చోట గడ్డి సైతం మొలవడంతో వాహనదారులు, బాటసారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి, స్థానిక అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం చూపలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోకి వెళ్లాలన్న రావాలన్న అదే దారిపై వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులను ప్రశ్నిస్తే బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తూ, నిర్లక్ష్యపు సమాధానాలు చెప్తున్నారని ఆరోపిస్తున్నారు. రోడ్డుపై మురుగునీరు చేరడంతో దోమలు వ్యాప్తి చెంది, దుర్వాసన వల్ల ఈ మార్గంలో ప్రతిరోజు విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ప్రయాణిస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, మురికి నీరు రోడ్డు పైకి రాకుండా కట్టడి చేసి దెబ్బతిన్న తారు రోడ్డు సరిచేసి రోడ్డుపై పారుతున్న మురుగునీటిని తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 324 అర్జీలు

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు వచ్చిన అర్జీదారుల సమస్యలపై సకాలంలో పరిష్కారం చూపాలి

### -జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కు వచ్చిన అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం




వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీ జి ఆర్ ఎస్ లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు శివశంకర్ నాయక్, భరత్ నాయక్, రోజ్ మాండ్, నాగార్జున లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు:
రెవిన్యూ -177, పంచాయితీ రాజ్ -24, హోం శాఖ- 21, స్వర్ణ వార్డు/స్వర్ణ గ్రామం -18, రూరల్ డెవలప్మెంట్ -11, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -10, సర్వే శాఖ -9, విద్యుత్ శాఖ- 8, సివిల్ సప్లైస్- 8, సెర్ప్ -7,స్కూల్ ఎడ్యుకేషన్ -7, తుడా -3, కుటుంబ సంక్షేమ శాఖ -3, హౌసింగ్ -3, జల వనరుల శాఖ -2, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ -1, సెకండరీ హెల్త్ -1, రిజిస్ట్రేషన్ శాఖ -1, గనులు మరియు భూగర్భజలాల శాఖ -1, ఆర్టిసి- 1 మత్స్య శాఖ- 1, టూరిజం -1, మెప్మా- 1, ఫారెస్ట్- 1, ఐసిడిఎస్- 1, బి సి వెల్ఫేర్ -1, చెరుకు పరిశ్రమ- 1, ఎండోమెంట్ -1 మొత్తం 324 అర్జీలు రావడం జరిగిందని, సంబంధిత అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# రెండేళ్ళ ప్రగతి ప్రస్థానం సంతృప్తికరం!

### -డా.యం.ఉమేష్ రావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమతుల్యత సాధిస్తున్న చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం యొక్క రెండేళ్ళ ప్రగతి ప్రస్థానం సంతృప్తికరంగా ఉన్నదని రాష్ట్ర ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు కొనియాడారు. ప్రతీ కుటుంబానికి భరోసా ఇస్తూ, ప్రతీ ప్రాంతానికి అభివృద్ధిని అందిస్తూ రెండేళ్లలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం యొక్క రెండేళ్ళ నమ్మకమైన పాలనాకాలంలో సాధించిన ప్రగతిని వివరించే కార్యక్రమంలో భాగంగా బూత్ కన్వీనర్ గాజుల భగత్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం స్థానిక 18 వ వార్డు, 52 వ బూత్ పరిధిలోని ప్రజల వద్దకు వెళ్ళి కరపత్రాలను అందించి వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని కేవలం రెండేళ్ళ పాలనలో అమలు చేసి చూపించిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం, దీపం-2 పథకం ద్వారా



ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిందని కొనియాడారు. వృద్ధాప్యంలో అండగా నిలుస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అర్హులందరికీ అందిస్తూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంక్షేమానికి కొత్త అర్థం చెపుతూ,రెండేళ్ల సుపరిపాలనలో ఇప్పటివరకు రూ.66 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల జీవితాల్లో కొండంత ఆనందాన్ని నింపుతోందని కొనియాడారు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా, వరుసగా రెండో ఏడాది తల్లికి వందనం ద్వారా 67,47,190 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చేలా ఒక తల్లికి ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ పథకం వర్తింపు చేస్తూ తల్లుల ఖాతాల్లో రూ.10, 120.78 కోట్లు ఆర్థిక సహాయం అందించిన సియం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం యొక్క రెండేళ్ళ నమ్మకమైన పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తీకరిస్తున్నారని తెలిపారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు తొలి సంతకంతోనే మెగా డీఎస్సీ ని ప్రకటించి 15,941 టీచర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం, రెండేళ్ల సుపరిపాలనలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటూ, వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఉపాధి కలలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, సీనియర్ నాయకులు లక్కమనేని మధుబాబు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు మరియు క్లస్టర్ ఇన్‌ఛార్జి గాదిపాకుల గోపీనాథ్, మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా,నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,తిరుపతి పార్లమెంటు నాయకులు సయ్యద్ చాంద్ బాషా,పూల శేఖర్, నూర్ మొహమ్మద్, బూత్ కన్వీనర్ గాజుల భగత్,గగన్ యాదవ్,శ్రీకాళహస్తి నియోజకవర్గ ఐటిడిపి నాయకుడు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

నగర అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు ఇచ్చిన ప్రతి ఎన్నికల హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాలు 22ఏ కింద ఉన్నాయని వీటిని వీలైనంత త్వరగా తొలగిస్తామని ఆయన చెప్పారు. సోమవారం ఉదయం ఒకటవ డివిజన్ లోని కొత్తపల్లి పరిధిలోని మస్తాన్ నాయుడు ప్లాట్స్, రవీంద్రనగర్ లలో 71 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి లు ప్రారంభించారు. కొత్తపల్లిలో రోడ్లు నిర్మించి తమను ఆదుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కోరారు. అలాగే రవీంద్రనగర్ లో తాగునీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంక్ తోపాటు ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని స్థానికులు కోరారు. రవీంద్ర నగర్ లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి తెలిపారు. రోడ్ల నిర్మాణంను ప్రాధాన్యత ఇస్తామని ఆమె చెప్పారు. రవీంద్రనగర్ లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. 22ఏ కింద నగరంలో 17వేల ఇళ్లకు పైగా ఉన్నాయని రవీంద్ర




నగర్ తో పాటు నగరంలోని మిగిలిన ప్రాంతాలను 22ఏ నుంచి తొగించే ప్రక్రియను వేగవంతం చేస్తామని ఆయన చెప్పారు. నగర పరిధిలోని చెరువుల పూడిక తీసి సుందరంగా చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో మాస్టర్ ప్లాన్ రోడ్డును వేసి నగరంలోని అంతర్గత రోడ్లను మరిచారని ఆయన ఆరోపించారు. కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు మరింత వేగంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ. శ్యాంసుందర్, డీఈ రమణ, మాజీ కార్పొరేటర్ ఎస్.కే.బాబు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థకు 36 వినతులు -కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 16 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 20 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. కాగా సంజీవయ్య కాలనీలో ఇంటి ముందు ప్రమాధకరంగా ఉన్న చెట్ల కొమ్మలు



తొలగించాలని, పట్నూల్ వీధిలో సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని, ఎస్.ఎల్.వి నగర్ నందు మా ఇంటి పక్కన ఎటువంటి అనుమతులు లేకుండా, సెట్ బ్యాక్ వంటివి లేకుండా నాలుగు అంతస్థుల భవనం నిర్మిస్తుండడం వలన




ఇబ్బందిగా ఉందని, కొత్తపల్లి నందు నూతనగా కాలువలు, తాతయ్య గుంట గంగమ్మ గుడి ఎదురుగా తోపుడు బండ్లు పెట్టడం వలన ఇబ్బందిగా ఉందని, కొరమేనుగుంట నందు రోడ్లు వేసి పేద దిబ్బలు వంటివి తొలగింపు చర్యలు చేపట్టాలని, మహిళా యూనివర్సిటీ వద్ద తెలుగుగంగ పైప్ లైన్ లీకేజీ అరికట్టాలని, గాజు వీధి, లక్ష్మీపురం లలో రోడ్డు గుంతలు పూడ్చాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, వీధి కుక్కలను నియంత్రించాలని కోరారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, గోమతి, రెవిన్యూ ఆఫీసర్ రవి, డి.ఈ.లు ఏసిపీ మూర్తి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హాసీమ్, శానిటరీ సూపర్ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

# జూలై 31లోపు వాహన త్రైమాసిక పన్ను చెల్లించండి

### - జరిమానాను నివారించండి

### - జిల్లా రవాణా శాఖ అధికారి

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి జిల్లా పరిధిలోని అన్ని రవాణా వాహనాల యజమానులు 30-09-2026తో ముగియనున్న రెండవ త్రైమాసికానికి సంబంధించిన వాహన పన్ను ను 31-07-2026లోపు తప్పనిసరిగా చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలియజేశారు. ఈ గడువులోపు పన్ను చెల్లించినట్లయితే ఎటువంటి జరిమానా విధించబడదు. వాహన యజమానులు తమ త్రైమాసిక వాహన పన్నును రవాణా శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా పరివాహన్ సేవ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో సులభంగా చెల్లించవచ్చు. ఆన్‌లైన్ సేవలను వినియోగించి గడువులోపు పన్ను చెల్లించడం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు జరిమానాలను నివారించండి.అయితే 31-07-2026 తర్వాత పన్ను చెల్లించకుండా వాహనం రహదారిపై తనిఖీల సమయంలో పట్టుబడినట్లయితే, మోటారు వాహన చట్టం ప్రకారం కింది విధంగా జరిమానాతో పాటు పన్ను వసూలు చేయబడుతుంది. ఆగస్టు నెలలో తనిఖీ సమయంలో పట్టుబడినట్లయితే -- 100% జరిమానాతో పన్ను వసూలు చేయబడుతుంది. సెప్టెంబర్ నెలలో తనిఖీ సమయంలో పట్టుబడినట్లయితే -- 200% జరిమానాతో పన్ను వసూలు చేయబడుతుంది. అందువల్ల వాహన యజమానులందరూ చివరి తేదీ కోసం వేచి ఉండకుండా 31-07-2026లోపు తమ త్రైమాసిక పన్నును చెల్లించి, అనవసరమైన జరిమానాలు మరియు ఇబ్బందులను నివారించాలని జిల్లా రవాణా అధికారి, తిరుపతి విజ్ఞప్తి చేశారు.

# మన ఊరు మన జెండా కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

సోమవారం రేణిగుంట పట్టణంలో తిరుపతి జిల్లా మన ఊరు మన జెండా కన్వీనర్, మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ ఏర్పాటుచేసిన పార్టీ జెండాను ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలానంద ఆవిష్కరించారు. కోలా ఆనంద్ మాట్లాడుతూ బిజెపి పార్టీ సిద్ధాంతాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే మన ఊరు మన జెండా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అదేవిధంగా కాళహస్తి అసెంబ్లీలోని ప్రతి పంచాయతీలో అక్టోబర్ నెల లోపల మన ఊరు మన జెండా రెపరెపలాడుతుందని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీబాలాజీ మాట్లాడుతూ, రేణిగుంట పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధులు వివరాలను తొందర్లో స్కానర్ స్టిక్కర్ అమర్చబడుతుందని దానిద్వారా



పూర్తి సమాచారాన్ని ప్రజలందరూ తెలుసుకో వచ్చని తెలిపారు. బిజెపి జెండా రేణిగుంట పట్టణ నడిబొడ్డులో పెట్టే అవకాశం వచ్చినందుకు మండల కమిటీకి మరియు ఈ జెండా ఆవిష్కరించినందుకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మండల ఇన్చార్జ్ మెలగారం సుబ్రహ్మణ్యం రెడ్డి, జండా కో పాలక్ రేణిగుంట మండల ప్రధాన కార్యదర్శి సొంగా పురుషోత్తం, మండల అధ్యక్షుడు ప్రేమ్ రెడ్డి, ఓబసి మోర్చా జిల్లా అధ్యక్షులు గోపి ఆచారి, జిల్లా ఉపాధ్యక్షులు వేణు ముదిరాజ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్, ఉపాధ్యక్షుడు రమేష్, మండల ఉపాధ్యక్షుడు రాజా రాయల్, పట్టణ అధ్యక్షుడు నరేష్, తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు యతేంద్ర రెడ్డి ఉపాధ్యక్షుడు అశోక్ సీనియర్ నాయకురాలు అన్నపూర్ణమ్మ, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు వేణు గోపాల్, మండల మోర్చా అధ్యక్షులు శ్రీకాంత్, మనోహర్ ,లాల్, రాజేష్ తొట్టంబేడు మండల అధ్యక్షుడు వేదం కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏళ్లుగా నివాసం ఉంటున్న యానాది కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

### తహసీల్దార్‌కు 34 మంది ఎస్టీ లబ్ధిదారుల వినతి

ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు



వాకాడు మండలంలోని రాయిదొరువు పంచాయతీ మొనపాళెం గ్రామానికి చెందిన సుమారు 40 ఎస్టీ (యానాది) కుటుంబాలు తమకు ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించాయి. ఈ సందర్భంగా 34 మంది లబ్ధిదారులు సంతకాలతో కూడిన అర్జీని అందజేశారు. వినతిపత్రంలో వారు మాట్లాడుతూ,గత 20--21 సంవత్సరాలుగా పూడిరాయదోరువు రెవెన్యూ గ్రామం లో సర్వే నంబర్ 120,117,116,99, 21-1 లో సుమారు 3ఎకరాల 31 సెంట్లు ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్నామని, తమకు విద్యుత్, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు తదితర ప్రభుత్వ గుర్తింపులు ఉన్నప్పటికీ ఇప్పటికీ ఇంటి స్థలాల పట్టాలు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిగా అందడంలేదని పేర్కొన్నారు.తమ పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి, తాము నివాసం ఉంటున్న స్థలాలకు వెంటనే ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

# జీవో నెంబర్ 396ను వెంటనే ఉపసంహరించుకోవాలి

### -: చంద్రగిరి దస్తావేజు లేఖరుల డిమాండ్..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:




ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని తిరుపతి జిల్లా చంద్రగిరి దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. 8వ రోజు నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరణ చేసే ఆలోచనలో భాగంగానే ప్రభుత్వం ఆర్.ఎస్.కె సెంటర్లను తీసుకురావాలని చూస్తోందని ఆరోపించారు. ఆర్.ఎస్.కె సెంటర్ల ద్వారా సేవలను పారదర్శకంగా, వేగంగా అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, అటువంటి వేగవంతమైన స్లాట్ బుకింగ్ సేవలు ఇప్పటికే రిజిస్ట్రేషన్ శాఖలో అందుబాటులో ఉన్నాయని, వాటిని తాము ప్రజలకు విజయవంతంగా అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కొత్త జీవో ద్వారా ప్రజలకు అదనంగా చేకూరే పారదర్శకత కానీ, వేగవంతమైన సేవలు కానీ ఏమీ లేవని, కేవలం రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని దస్తావేజు లేఖరులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ వల్ల ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యమై, దస్తావేజు లేఖరుల జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారు మరొక్కసారి ఈ విషయంపై పునరాలోచించి, జీవో నెంబర్ 396ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తమ నిరసనలను మరింత ఉధృతం చేస్తామని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్స్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# 13 సంవత్సరాలుగా కనీస వసతులు కూడా లేని అంగన్వాడీ కేంద్రం నలిగిపోతున్న చిన్నారులు..

### -జనసేన పార్టీ పేట బ్రదర్స్ మిత్ర బృందం

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు


మండలంలోని మేజర్ పంచాయతీ కాసరం హరిజనవాడలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు 7 మంది, బాలింతలు నలుగురు, గర్భిణీలు ముగ్గురు అంగన్వాడి స్టాఫ్ సభ్యులు ఇద్దరు కానీ త్రాగటానికి నీళ్లు, కూర్చోవడానికి కుర్చీలు, పిల్లలు ఆడుకోవడానికి చదువుతో కూడిన బొమ్మలు,13 సంవత్సరాలుగా, ఒక ఫ్యాను, ఒక



లైటు కూడా లేకుండానే నిర్వహిస్తున్నారు, వేడి తీవ్రత ఎక్కువ ఉన్నటువంటి జనవరి నుండి ఏప్రిల్ నెల వరకు కూడా ఆ చిన్నారులు ఫ్యాను వసతి లేకుండానే ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు గడిపిన సందర్భం తలుచుకుంటేనే చాలా బాధాకరమైనటువంటి విషయం ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీస్ ( ఐసిడిఎస్) దృష్టికి తీసుకుని వెళ్లినా కూడా ఫలితం లేకుండా పోయిందని అంగన్వాడి టీచర్ చెప్పడం జరిగింది, కచ్చితంగా ఈ అంగన్వాడి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి, స్థానిక శాసనసభ్యులు గారి దృష్టికి తీసుకొని వెళ్లి వీలైనంత తొందరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, ప్రదీప్ కుమార్, ప్రభాకర్, బింగి చిన్న, గంధం శ్రీను, లక్ష్మణ్, కల్లిపూడి వెంకటేష్, మనీ, చందు, పసలు ఎలిసా
వీర మహిళ శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత పాల్గొన్నారు.

# మైనార్టీ మొచ్చ కార్యాలయంలో డా.ఏపీజే అబ్దుల్ కలాం కి ఘన నివాళులు

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



విజయవాడ బిజెపి మైనార్టీ మోచ్చ కార్యాలయంలో దేశ్ కి నేత మిస్సైల్ మాన్ 11వ వర్ధంతి సందర్భంగా “డా” ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించిన బిజెపి మైనార్టీ నాయకులు, ఈ సందర్భంగా సంఘటన శాఖ మంత్రి ఎం మధుకర్ జి మాట్లాడుతూ నిజాయితీకి ప్రతిరూపంగా భారతదేశంలో ఆయనకంటూ ఒక స్థానం నేర్పరచుకున్న ఏ .పి.జే అబ్దుల్ కలాం 11వ వర్ధంతికి మైనార్టీ మచ్చ కార్యాలయంలో ఘన నివాళులు అర్పించడం హృదయానందమని ఆయన తెలిపారు. అనంతరం “డా” ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ “డా” సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ భారతదేశ జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దేశ్ కి నేత మిస్సైల్ మాన్ “డా” ఏపీజే అబ్దుల్ కలాం ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకి నడవాలి నిజాయితీకి నిదర్శనం ప్రతి నిమిషం మానవునికి ఎంతో అవసరం విద్యార్థులకు మరింత అవసరమని టైం వేస్ట్ చేయొద్దు ప్రతి నిమిషము మన జీవితానికి ముందడుగు లాంటిది అని విద్యార్థులే ఈ దేశ పట్టుకొమ్మలు అని ఎప్పుడు విద్యార్థులను ప్రోత్సహిస్తూ అన్ని రంగాల్లో యువత విజేతలై ముందుకు సాగాలని విద్యార్థులను ఎప్పుడు ధైర్యవంతంగా ముందు నడవాలి అని విద్యార్థుల పట్ల ఎప్పుడు ప్రేమతో మెలిగి వాళ్ళ ఆలోచనలను వాళ్ళ ఎంచుకున్న రంగాల వైపు దూసుకుపోయి విజయాలను సాధించాలని పట్టుదల కృషితోనే సాధ్యమని గుర్తుచేసి విద్యార్థులకు అయినా తుది శ్వాస వరకు ప్రోత్సహిస్తూనే ఉన్నారు. ఈ దేశానికి యువతరం ఒక బలం యువతరం అనే అడుగు దేశానికి ఒక ఆయుధం లాంటిది ఆ యువతరం మంచి మార్గం వైపు నడిపే బాధ్యత దేశ నాయకులు చేతుల్లోనే ఉంది అని తాజుద్దీన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వై శ్రీనివాసులు టైర్డ్ హెడ్ కానిస్టేబుల్, బిజెపి మైనార్టీ మచ్చ నెల్లూరు జిల్లా అధ్యక్షులు లాల్ ఖాజా మస్తాన్, కర్నూలు జిల్లా అధ్యక్షురాలు షాహినా, నంద్యాల జిల్లా మైనార్టీ మచ్చ అధ్యక్షురాలు చాందిని బి, హసీనా ,మౌలాలి, మైనార్టీ మచ్చ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

మంగళవారం 28 జూలై 2026


# అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు






ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
రోటరీ క్లబ్ గూడూరు మరియు గూడూరు క్రికెట్ క్లబ్, అల్లు రాజశేఖరరెడ్డి క్రికెట్ క్లబ్, హరిచంద్ర రెడ్డి క్రికెట్ క్లబ్, సత్యనారాయణరెడ్డి క్రికెట్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గూడూరు లోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రోటరీ క్లబ్ అధ్యక్షుడు తిరుమూరు సురేష్ రెడ్డి మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా రోటరీ క్లబ్ ద్వారా క్రికెట్ క్లబ్బుల సహకారంతో అంతర్ పాఠశాలల పోటీలు ఉన్న నిర్వహిస్తున్నామని, అల్లు ఆదిశేష రెడ్డి గారి ముందుచూపుతో ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు కొంత నిధిని ఏర్పాటు చేసి, దాని ద్వారా వచ్చే వడ్డీతో రోటరీ క్లబ్ ద్వారా కొన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెల్లూరు జిల్లా క్రికెటర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కనుమూరు హరిచంద్ర రెడ్డి మాట్లాడుతూ, 25 సంవత్సరాలుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం అంటే సాధారణ విషయం కాదని, అలాగే పెద్దలు అల్లూరు ఆదిశేషారెడ్డి ఎంతో ముందు చూపుతో తన తదనంతరం కూడా ఇలాంటి ఇలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహించాలని రోటరీ క్లబ్ వారికి బాధ్యత అప్పచెప్పడం జరిగిందన్నారు. ఇక్కడ క్రికెట్లో రాణించే క్రీడాకారులను జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్య వహించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు గూడూరు క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు కొణిదల ముని గిరీష్ మాట్లాడుతూ గూడూరు ప్రాంతంలోని అనేకమంది క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అంతర్ పాఠశాలల స్థాయిలో ఒక టోర్నమెంట్ను అంతర్ కళాశాల స్థాయిలో మరొక టోర్నమెంటును నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ టోర్నమెంట్ ల ద్వారా క్రీడాకారుల్లోని ప్రతిఫలం వెలికి తీసి వారిని జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో ప్రోత్సహిస్తున్నామని అన్నారు. రోటరీ క్లబ్ ద్వారా కేవలం సేవా కార్యక్రమాలు కాకుండా ఎన్నో క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తూ చూస్తున్నామని అందుకు ప్రధాన కారణం అల్లూరి ఆది శేషారెడ్డి గారు అని అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్ బి దశరథరామిరెడ్డి, రోటరీ క్లబ్ జాయింట్ సెక్రటరీ పి నిరంజన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మల్లు విజయ్ కుమార్ రెడ్డి, స్టేడియం డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సుమన్ రెడ్డి, ఏసీ ఏ సబ్ సెంటర్ కోచ్ లవ కుమార్ రొటేరియన్లు డాక్టర్ ఎస్ వి నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ బి శ్యామసుందర్రావు, పి హరి ప్రసాద్, టీవీ రవికుమార్ ఏ కిరణ్ చక్రవర్తి, వై ప్రభాకర్ రెడ్డి, బి రాంప్రసాద్, ఎం మనోహర్ నాయుడు మరియు 20 పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు

## పీసీసీ అధ్యక్షురాలూ షర్మిలా రెడ్డి త్వరగా కోలుకోవాలి - కాంగ్రెస్ నేతలు



ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి కి శాస్త్ర చికిత్స జరిగిన నేపథ్యంలో వారు త్వరగా కోలుకోవాలని తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త వెంకటాచలపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు హరిబాబు, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షులు సునీల్ రెడ్డి, సుధా యాదవ్, సూళ్లూరుపేట కాంగ్రెస్ నాయకులు కిరణ్,శ్వేత, విజయ్, రమేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

## జూలై 30న శ్రీకాళహస్తిలో జాబ్ మేళా



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్
ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురుషులు శ్రీకాళహస్తిలో జూలై 30వ తేదీన జాబ్ మేళా జరుగుతుందని,ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, స్కిల్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్ మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ల సంయుక్త ఆధ్వర్యంలో జులై 30వ తేదీన జరిగే జాబ్ మేళాలో మొత్తం 12 కంపెనీలు పాల్గొంటున్నాయని, 861 ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ తెలియజేశారు. ఈ జాబ్ మేళా కార్యక్రమానికి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారు.. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బి.టెక్ మరియు అర్హత కలిగిన అభ్యర్థులు జులై 30వ తేదీ,గురువారం ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 8.30 గంటలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.. జాబ్ మేళా కు హాజరయ్యే అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 7981473129, 8919889609, 7989509540, 998853335 అనే నంబర్లలో సంప్రదించాలని డి ఎస్ డి ఓ లోకనాథం మరియు కళాశాల స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ గంగారాం తెలిపారు

## నిమ్మ రైతులకు భీమా సదుపాయం



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
ఎల్ నినో ప్రభావం వలన రానున్న మూడు నాలుగు నెలలలో వర్షాభావ పరిస్థితులు వచ్చే అవకాశం ఉన్నది.ఈ వర్షాభావ పరిస్థితులను అధికమించడానికి నిమ్మ రైతులు తమ పంటకు భీమా చేయించుకోవలసినది గా ఉద్యాన అధికారిణి , గూడూరు యన్.సునీత సూచించారు. నిమ్మ రైతుకు భీమా ప్రీమియం రూ. 2400/- ఒక ఎకరానికి చెల్లించాలని , ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు వలన నష్టం జరిగినపుడు నష్ట పరిహారంగా రూ. 48000/- అందుతుందని తెలిపారు. దీనికి చివరి తేదీగా జూలై 24 నుంచి 31 వరకు పొడిగించబడింది కావున రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పంట రుణం పొందిన రైతులు భీమాకు అర్హులు .రుణాలు తీసుకోని అన్నదాతలు సమీకృత అధీకృత కేంద్రాల వద్ద నమోదు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు, భూ యాజమాన్య పత్రాలు , కౌలు రైతుకు లీజు పత్రం,బ్యాంకు పాస్ బుక్ , మొబైల్ నంబర్ ను అధీకృత కేంద్రాలైన బ్యాంకు , సాధారణ సేవా కేంద్రాలు , గ్రామ సచివాయాలు , మరియు తపాల కార్యాలయాల ద్వారా నమోదు చేసుకోవాలని ఉద్యాన అధికారిణి నిమ్మ రైతులకు సూచించారు..

## స్మశానానికి భూమిని కేటాయించాలంటూ వినతి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్
మండలంలోని కమ్మ కొత్తూరు గ్రామంలో నివసిస్తున్న ప్రజలకు స్మశాన వాటికకు స్థలం కేటాయించాలంటూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు గంధం మణి ఆధ్వర్యంలో సోమవారం అరవ కొత్తూరు సచివాలయ సిబ్బంది సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగి మౌనికకు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ కొత్తూరు హరిజనవాడలో సుమారు 100 కుటుంబాలు, గ్రామంలో 80 కుటుంబాలు వారు ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్నారు. దురదృష్టవశాత్తు గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వారి భౌతికకాయానికి ప్రశాంతంగా దహనక్రియలు చేయటానికి ఆరు అడుగుల స్థలం కరువైందని అన్నారు. స్మశాన స్థలం లేకపోవడంతో పంట కాలువల ఒడ్డున వీరి దహన క్రియలు చేయవలసిన దుస్థితి ఏర్పడిందని ఇది ఎంతో బాధాకరమైన విషయమని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి జీ.వో నెంబర్ 1235 ద్వారా ప్రభుత్వమే స్థలాన్ని కొనుగోలు చేసి గ్రామస్తులకు స్మశాన భూమిని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పెనుబాక గ్రామంలో నివసిస్తున్న వారికి భూ పంపిణీ విధానం ద్వారా వారికి కేటాయించిన భూములను రెవెన్యూ అధికారులచే సర్వే చేయించి వారి భూములను వారికి అప్పగించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, అంకమ్మ కృష్ణయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చివేలు ప్రభుత్వ పాఠశాల నందు 100 మొక్కలు నాటే కార్యక్రమాన్ని బాధ్యత తీసుకున్న జనసేన పార్టీ వీర మహిళ కవిత



ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి రూరల్
మండలంలోని ముచ్చివేలు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నందు పేట బ్రదర్స్ మిత్రబృందం ఆధ్వర్యంలో జనసేన పార్టీ వీర మహిళ మరియు శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాలను కృషి చేసే దిశగా మన పర్యావరణం మన బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా 100 మొక్కలను నాటి పర్యావరణ అభివృద్ధికి మరియు పాఠశాలలోని విద్యార్థులకు ఆహ్లాదకరమైనటువంటి వాతావరణం, ఏర్పరచాలనే దృఢమైన సంకల్పంతో ఈరోజు మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వీర మహిళ మరియు శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, గంధం శ్రీను, లక్ష్మణ్, కళ్లిపూడి వెంకటేష్, ప్రదీప్ కుమార్,బింగి చిన్న, చందు, పసల ఎలీషా, తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ మైనార్టీ మొర్చ కార్యాలయంలో "డా" ఏపీజే అబ్దుల్ కలాం కి ఘన నివాళులు



విజయవాడ బిజెపి మైనార్టీ మోర్చ కార్యాలయంలో దేశ్ కి నేత మిస్సైల్ మాన్ 11వ వర్ధంతి సందర్భంగా "డా" ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించిన బిజెపి మైనార్టీ నాయకులు, ఈ సందర్భంగా సంఘటన శాఖ మంత్రి ఎం మధుకర్ జి మాట్లాడుతూ నిజాయితీకి ప్రతిరూపంగా భారతదేశంలో ఆయనకంటూ ఒక స్థానం నేర్పరచుకున్న ఏ .పి.జే అబ్దుల్ కలాం 11వ వర్ధంతికి మైనార్టీ మచ్చ కార్యాలయంలో ఘన నివాళులు అర్పించడం హృదయానందమని ఆయన తెలిపారు. అనంతరం "డా" ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ "డా" సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ భారతదేశ జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దేశ్ కి నేత మిస్సైల్ మాన్ "డా" ఏపీజే అబ్దుల్ కలాం ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకి నడవాలి నిజాయితీకి నిదర్శనం ప్రతి నిమిషం మానవునికి ఎంతో అవసరం విద్యార్థులకు మరింత అవసరమని టైం వేస్ట్ చేయొద్దు ప్రతి నిమిషము మన జీవితానికి ముందడుగు లాంటిది అని విద్యార్థులే ఈ దేశ పట్టుకొమ్మలు అని ఎప్పుడు విద్యార్థులను ప్రోత్సహిస్తూ అన్ని రంగాల్లో యువత విజేతలై ముందుకు సాగాలని విద్యార్థులను ఎప్పుడు ధైర్యవంతంగా ముందు నడవాలి అని విద్యార్థుల పట్ల ఎప్పుడు ప్రేమతో మెలిగి వాళ్ళ ఆలోచనలను వాళ్ళ ఎంచుకున్న రంగాల వైపు దూసుకుపోయి విజయాలను సాధించాలని పట్టుదల కృషితోనే సాధ్యమని గుర్తుచేసి విద్యార్థులకు అయినా తుది శ్వాస వరకు ప్రోత్సహిస్తూనే ఉన్నారు. ఈ దేశానికి యువతరం ఒక బలం యువతరం అనే అడుగు దేశానికి ఒక ఆయుధం లాంటిది ఆ యువతరం మంచి మార్గం వైపు నడిపే బాధ్యత దేశ నాయకులు చేతుల్లోనే ఉంది అని తాజుద్దీన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వై శ్రీనివాసులు టైర్డ్ హెడ్ కానిస్టేబుల్, బిజెపి మైనార్టీ మచ్చ నెల్లూరు జిల్లా అధ్యక్షులు లాల్ ఖాజా మస్తాన్, కర్నూలు జిల్లా అధ్యక్షురాలు షాహినా, నంద్యాల జిల్లా మైనార్టీ మచ్చ అధ్యక్షురాలు చాందిని బి మరియు హసీనా ,మౌలాలి, మైనార్టీ మచ్చ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థి ప్రతినిధుల ప్రమాణ స్వీకారోత్సవం




ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్
శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు,బాధ్యతాయుతమైన వ్యక్తిత్వం, సేవాభావం, క్రమశిక్షణను పెంపొందించే లక్ష్యంతో విద్యార్థి ప్రతినిధుల ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి వాస్తవ్యులు తేజో భారత్ వ్యవస్థాపకురాలు, సామాజిక సేవకు 2020లో సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్ అవార్డు గ్రహీత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం బోర్డ్ మెంబర్ కోలా విశాలి విచ్చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి నాయకులు, నాయకత్వం అనేది కేవలం పదవి కాదు, బాధ్యతతో కూడిన సేవ అని అన్నారు. ప్రతి విద్యార్థిలో ఆత్మవిశ్వాసం,నిర్ణయ సామర్థ్యం, జట్టుగా పనిచేసే నైపుణ్యం ఉండాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపల్ ఎ.రూపాదేవి మాట్లాడుతూ - పాఠశాలలో ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థి నాయకుల ఎన్నికలు నిర్వహించి ఫలితాలను ప్రకటించి, విజయం సాధించిన విద్యార్థులకు గౌరవప్రదంగా బ్యాడ్జిలను ప్రదానం చేసి వారి బాధ్యతలను అధికారికంగా అప్పగించడం శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రత్యేకత అన్నారు.బ్యాడ్జ్ను ధరించిన విద్యార్థే,రేపు సమాజానికి మార్గదర్శకుడవుతాడు అని సందేశం ఇచ్చారు.ఏ.జి.ఎం సురేష్ మాట్లాడుతూ వినూత్న విద్యా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సమగ్ర వికాసానికి శ్రీ చైతన్య పాఠశాల నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు బాలాజీ, శ్రీనివాస్,డీన్ త్రివేణి, ఇన్చార్జులు శ్రీహరి,వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు, పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించుటకు పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలి- జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్




ప్రజా భూమి ప్రతినిధితిరుపతి,
రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తోందని, నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు, పరిశ్రమల్లో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమల శాఖ అధికారులు కృషి చేయాలని, పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు సక్రమంగా అమలు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు.. సోమవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాలు నందు జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డి.ఐ.ఈ.పి.సి) జరిగిన సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సింగిల్ డెస్క్ విధానంలో మే 2026 జూలై 2026 వరకు 178 పరిశ్రమలకు గాను 124 అనుమతులు ఇచ్చామని మరో 54 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలు పరిశీలన కమిటీకి అందిన మేరకు 11 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ. 2.92 కోట్లు అందించడానికి నేడు ఆమోదం తెలిపారు. పెట్టుబడి సబ్సిడీ 9 ,విద్యుత్ సబ్సిడీ 1, వడ్డీ రాయితీ 1, యూనిట్లకు ఆమోదించారు. క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ప్రింటింగ్ క్లస్టర్, తిరుపతి, కలంకారీ క్లస్టర్, శ్రీకాళహస్తి, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్, ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్, తిరుపతి ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షించి వేగవంతం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు వివరిస్తూ నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ ఫోటో ఫ్రేమ్స్ క్లస్టర్, తిరుపతి రాష్ట్ర స్థాయి ఆమోదం పొంది ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కొరకు పంపారని తెలిపారు. పరిశ్రమలకు సంబందించిన అనుమతులు వివిధ శాఖల అధికారుల వద్ద ఉన్న పెండింగ్ అంశాలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఏపిఐఐసి ద్వారా భూమి కేటాయించబడిన పరిశ్రమలు వివిధ దశలలో వున్నాయని,ఇంకా ప్రారంభించని వాటిని త్వరిత గతిన ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఇంచార్జి మునిసిపల్ కమీషనర్ శారదా దేవి, జోనల్ మేనేజర్ ఏపిఐఐసి తిరుపతి విజయ భరత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, డిపిఓ సుశీలా దేవి, డి ఆర్ డి ఏ పిడి శోభన్ బాబు, కార్మిక శాఖ అధికారి, చిన్న లాల్లప్ప, ఆర్ అండ్ బి ఎస్ సి రాజా నాయక్, ఎల్ డి ఎం రవి కుమార్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ మురళి కృష్ణ, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్, లోకనాథం, మార్కెటింగ్ అధికారి సురేంద్ర బాబు, పొల్యూషన్ కంట్రోల్ అధికారి రాజశేఖర్, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొండూరుపాలెం గ్రామంలోని 7.44 ఎకరాల భూమిపై వివాదం

### కబ్జా చేశారంటూ గ్రామ కాపులు,270 మత్స్యకార కుటుంబాలు తాసిల్దార్ ఎదుట ఆందోళన

### తహసీల్దార్‌కు మరోసారి వినతిపత్రం... కలెక్టర్ దృష్టికి పంపించామని ఎమ్మార్వో వివరణ



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు
వాకాడు మండలంలోని దుగరాజుపట్నం పంచాయతీ పరిధిలోని కొండూరుపాలెం గ్రామంలో సర్వే నెం.663లో ఉన్న 7.44 ఎకరాల ప్రభుత్వ భూమిపై వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ భూమిని బయటి వ్యక్తి అక్రమంగా తన పేరుపై పట్టా చేయించుకుని కబ్జాకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ గ్రామ కాపులు, 270 నిరుపేద మత్స్యకార కుటుంబాల సభ్యులు సోమవారం వాకాడు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఎమ్మార్వో సయ్యద్ ఇక్బాల్‌కు వినతిపత్రం అందజేశారు.గ్రామస్తుల కథనం ప్రకారం, సర్వే నెం.663లోని 7.44 ఎకరాల భూమిని తరతరాలుగా తమ జీవనాధారంగా వినియోగించుకుంటూ వస్తున్నామని తెలిపారు.అయితే నెల్లూరుకు చెందిన వ్యక్తి కుట్రపూరితంగా ఆ భూమిని తన పేరుపై రికార్డుల్లో నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. దీనివల్ల తమ జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అన్యాయాన్ని ప్రశ్నిస్తూ గ్రామ పెద్దలు పెదకాపు వాయల పెదరామయ్య, రెండవ కాపు అంజి, మూడవ కాపు పామంజి యర్రన్నతో పాటు 270 నిరుపేద మత్స్యకార కుటుంబాలు ఏకమై అధికారులను ఆశ్రయించాయి. గతంలో ఆర్డీఓ, మాజీ తహసీల్దార్‌లకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని గ్రామస్తులు వాపోయారు. గ్రామస్తుల ప్రధాన డిమాండ్లు సర్వే నెం.663లోని 7.44 ఎకరాల భూమిపై ఉన్న కమలేష్ రెడ్డి పేరును రెవెన్యూ రికార్డుల నుంచి వెంటనే తొలగించాలి. భూమిని ప్రభుత్వ ఖాతాలో నమోదు చేయాలి. కొండూరుపాలెం గ్రామంలోని 270 నిరుపేద మత్స్యకార కుటుంబాలకు ఆ భూమిపై హక్కులు కల్పించి జీవనోపాధి కల్పించాలి.భూ కబ్జాదారులు, బయటి వ్యక్తులు గ్రామంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ జోక్యం చేసుకోవాలని కోరారు. న్యాయం జరగకపోతే కలెక్టర్ కార్యాలయానికి వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామని తెలుపుతూ తమ జీవనాధారమైన భూమిని కాపాడాలని, వెంటనే న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎమ్మార్వో వివరణ

ఈ ఆరోపణలపై మీడియా మండల తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్‌ను వివరణ కోరగా, 2023లో చుక్కల భూమిగా నమోదైన ఈ భూమి నిబంధనలకు విరుద్ధంగా పట్టా భూమిగా మారిన విషయం గుర్తించాం.ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.త్వరలోనే సమగ్ర పరిశీలన నిర్వహించి గ్రామస్తులకు పూర్తి వివరాలు తెలియజేస్తాం అని తెలిపారు.

## వైభవంగా కలశ పూజ....పట్టు వస్త్రాల సమర్పణ



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం
రామచంద్రపురం మండలంలోని బొప్పరాజు పల్లి గ్రామంలో సాయిబాబా దేవాలయం నందు గురు పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం ఉదయం కలశ పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బట్టే మారయ్య, రాణెమ్మ కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించి స్వామివారికి మంగళ వాయిద్యాలు, భక్త భజనలు, సాయిరాం సంకీర్తన నడుమ ఊరేగింపుగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ డి విందు మాధవి పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పించారు. ఉదయం 6 గంటలకు శ్రీ షిరిడి సాయిబాబా మూల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారి సేవలు విశేషంగా పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ పట్టు వస్త్రాల సమర్పణ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాదురు కోటేశ్వర్ రెడ్డి బండి విజయ్ కుమార్ రెడ్డి, బొడ్డుసోము రాయల్, పంతల వెంకటేష్ నాయుడు టి వెంకటేష్ రెడ్డి , ఆవుల సిద్దయ్య యాదవ్, దేవరాజులు రెడ్డి, లో శెట్టి రూపు రాయల్, జి. మహేష్ రాయల్, బీసీ సెల్ అధ్యక్షులు కే కుమార్, కారే రూపుచంద్ర రాయల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం

## -ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సుపరిపాలనను ప్రతి ఇంటికీ చేరవేయడమే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం లక్ష్యమని టీడీపీ పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సోమవారం హిందూపురం పట్టణంలోని 1వ వార్డు కొల్లకుంటలో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి



కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సూపర్ సిక్స్ హామీల అమలు ద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వివరించారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి కుటుంబానికి చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్, చంద్రమోహన్ యాదవ్, పరిమళ ఆనంద్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, మాజీ మున్సిపల్ చైర్మన్లు రమేష్ కుమార్, అనిల్ కుమార్, ఆర్.ఎం.ఎస్. షఫీవుల్లాతో పాటు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, కూటమి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే రూరల్ మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో రాము, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థ నారాయణరెడ్డి తదితరులు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

# వైన్డింగ్, కేబుల్ వైర్ల దొంగతనం. ముద్దాయిని అరెస్ట్ చేసిన బంగారుపాళ్యం పోలీసులు

## సుమారు రూ.1,70,000 విలువైన చోరీ సొత్తు స్వాధీనం

ప్రజా భూమి ప్రతినిధి బంగారుపాళ్యం.

బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ పొలాలు మరియు ఇతర ప్రాంతాల్లో కేబుల్ వైర్లు, బోరు మోటార్ కేబుల్ వైర్లు, వైన్డింగ్ వైర్ల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు బంగారుపాలెం పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు, పలమనేరు సబ్ డివిజన్ డీఎస్పీ దేగల ప్రభాకర్ పర్యవేక్షణలో, బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులకు అందిన సమాచారం మేరకు బంగారుపాళ్యం --ఎం.బి.టి. రోడ్డులోని దండువారిపల్లి బస్ స్టాప్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా



మోటార్ సైకిల్‌పై వస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతడు పి. దేవరాజులు అని వెల్లడిస్తూ, కాటప్పగారిపల్లి సమీపంలోని మహా జ్యూసీ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో జరిగిన కేబుల్ వైర్ల చోరీతో పాటు ఎద్దులవారిపల్లి, కొరివివారిపల్లి గ్రామాల పరిసర వ్యవసాయ పొలాల్లోని బోరు మోటార్ కేబుల్ వైర్ల దొంగతనాలను తానే చేసినట్లు నేరాన్ని అంగీకరించాడు. నేర అంగీకారం మేరకు ముద్దాయిని అరెస్ట్ చేసి, చట్టపరమైన ప్రక్రియ అనంతరం న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది.

స్వాధీనం చేసుకున్న సొత్తు

1. మోటార్ వైన్డింగ్ వైర్లు -- సుమారు విలువ రూ.30,000/-
2. బోరు మోటార్ కేబుల్ వైర్లు (సుమారు 200 మీటర్లు) -- విలువ రూ.60,000/-
3. నలుపు రంగు పల్సర్ మోటార్ సైకిల్ -- విలువ రూ.80,000/-

మొత్తం స్వాధీనం చేసిన సొత్తు విలువ: సుమారు రూ.1,70,000/-

ముద్దాయి వివరాలు

పి. దేవరాజులు, వయస్సు 21 సంవత్సరాలు, తండ్రి పి. వరదయ్య, స్వగ్రామం కొత్తపల్లి, యాదమరి మండలం, చిత్తూరు జిల్లా. ప్రస్తుతం ఇ.చీశీ.8-12-81, దీ= కాలనీ, శెట్టిపల్లి గ్రామ పంచాయతీ, మంగళం, తిరుపతిలో నివాసం ఉంటున్నాడు అని పోలీస్ సిబ్బంది తెలియజేసినది.

# వాకాడులో టీడీపీ డి-టు-డి కార్యక్రమానికి శ్రీకారం

## బంగ్లా సెంటర్ ఎస్టీ కాలనీలో ఇంటింటికీ పార్టీ సందేశం...

### ప్రజా సమస్యలపై ఆరా





ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

వాకాడు మండలంలోని బంగ్లా సెంటర్ ఎస్టీ కాలనీలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ (ఊ2ఊ) కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయ్ శేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ విధానాలు, అభివృద్ధి లక్ష్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు, క్రిస్టియన్ కేవీసీ ప్రెసిడెంట్ వేము దినకర్ బాబు మాట్లాడుతూ, డి-టు-డి కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబాన్ని నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకుని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, స్థానిక సమస్యలను నమోదు చేసి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గ్రామ ప్రజల సూచనలు, అభిప్రాయాలను సేకరించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు బల్లి హర్షానంద్, దయాల్, తానా రమ, గాయం రమేష్, చింతల ఏడుకొండలు తదితరులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు.

# కావేటి పాండు భౌతికాయానికి నివాళు లర్పించిన బిజెపి నాయకులు



ప్రజాభూమి,పులివెందుల

భారతీయ జనతా పార్టీ కడప జిల్లా మాజీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కావేటిపాండు సోమవారంస్వర్గస్తులవడంతో బీజేపీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. ఆయన భౌతిక దేహానికి మాజీ సెంట్రల్ పీఎస్ రైల్వే మెంబర్ తలుపుల గంగాధర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ, కావేటి పాండు బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన నిబద్ధత కలిగిన నాయకుడని అన్నారు. జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించిన కాలంలో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని విస్తరించేందుకు, గిరిజన సమాజ సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమించారని కొనియాడారు. పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను అంకితభావంతో, నిజాయితీతో నిర్వర్తిస్తూ కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని, పార్టీ అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని గంగాధర్ పేర్కొన్నారు. కావేటి పాండు మరణం బీజేపీకి తీరని లోటని, వారి సేవలను పార్టీ శాశ్వతంగా గుర్తుంచుకుంటుందని అన్నారు. అనంతరం మాజీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు కోడిమూడి శ్రీరాములు , పులివెందుల మండల అధ్యక్షుడు వై నవీన్ లు మాట్లాడుతూ, కావేటి పాండు అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ కార్యకర్తలను కలుపుకుని ముందుకు నడిపించిన నాయకుడని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని తెలిపారు.

# ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలలో సాటివారికి సాయం చేయడం నేర్చుకోవాలి - -డాక్టర్ చక్రపాణి



ప్రజాభూమి,పులివెందుల

ప్రతి వ్యక్తి తన జీవితంలో లభించే సుఖ సంతోషాలను సాటివారితో పంచుకొని, పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మారుతీ హాస్పిటల్ ఎండి, ప్రముఖ వైద్యులు డాక్టర్ చక్రపాణి పేర్కొన్నారు. పులివెందుల లోని డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్, స్వతంత్ర శాస్త్రవేత్త అయిన డాక్టర్ రామ్ శెట్టి శివశంకర్ కుమారుడు మోహిత్ రాయల్ కు రూర్కేలా ఒరిస్సా రూర్కెలాలోనీ నిట్ కళాశాలలో అడ్మిషన్ (సీట్ )వచ్చిన శుభ సందర్భంగా పులివెందుల లోని శ్రీ వీర నారాయణ అంధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులతో కలిసి మోహిత్ రాయల్ అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఆర్ఎస్ఎస్ మిత్రుడు ప్రముఖ వైద్యుడు డాక్టర్ చక్రపాణి , సీనియర్ జర్నలిస్ట్ అల్లం రంగనాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చక్రపాణి మాట్లాడుతూ అందుల ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు డాక్టర్ ఆర్ఎస్ఎస్ ను అభినందించారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో చోటు చేసుకున్న సుఖసంతోషాలను ఇలాంటి వారితో పంచుకోవడం ఎంతో గొప్ప విషయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ఎస్ఎస్ మాట్లాడుతూ త్వరలో ఆశ్రమం లో ఉన్న వారికి దుస్తులు, దుప్పట్లు వితరణ ఇవ్వడశీ జరుగుతుందని ఆశ్రమల నిర్వాహకులు రామ్మోహన్ కు హామీ ఇచ్చారు.

# ప్రియుడితో కుమ్మక్కై భర్తపై హత్యాయత్నం

## కాల్ డేటాతో బట్టబయలైన కుట్ర..

## భార్య రేవతి ప్రియుడు నాగరాజు అరెస్ట్



ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి. న్ కండ్రిగ మండలం నీరుపాకోట గ్రామానికి చెందిన మేస్త్రి భీమయ్య (42)పై జరిగిన ప్రాణాంతక బ్లేడ్ దాడి కేసులో పోలీసులు సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చారు. ఈ ఘటనలో భీమయ్య భార్య రేవతి (29), ఆమె ప్రియుడు నాగరాజు కలిసి పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలడంతో వారిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం, దేగవారి కండ్రిగ గ్రామానికి చెందిన రేవతికి భీమయ్యతో 14 సంవత్సరాల క్రితం వివాహం కాగా, వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రేవతి, పొయ్య గ్రామానికి చెందిన నాగరాజుతో సన్నిహితంగా ఉంటున్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. జూలై 24వ తేదీ రాత్రి తన ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడిన రేవతి, భర్తను హతమార్చేందుకు పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు. అర్ధరాత్రి సమయంలో ఆరుబయట నిద్రిస్తున్న భీమయ్యపై బ్లేడ్‌తో గొంతు కోసి హత్యాయత్నానికి పాల్పడ్డారని దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్లు నమ్మించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే బాధితుడి తల్లి భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కాల్ డేటా, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించి అసలు విషయాన్ని వెలికితీశారు. ప్రస్తుతం భీమయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, నిందితులు రేవతి, నాగరాజును అరెస్ట్ చేసి వీఆర్వో సమక్షంలో హాజరుపరిచి అనంతరం కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# ఎల్ నినో ప్రభావంతో పిఎండిఎస్ పద్ధతిపై అవగాహన

## - తక్కువ నీరు అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుకు సూచనలు



ప్రజాభూమి, వేంపల్లె


ఎల్ నినో ప్రభావం, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో ఉద్యానవన పంటలను కాపాడు కోవడానికి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై ఉద్యానవన శాఖ అధికారి రాఘవేంద్ర రెడ్డి అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక ఉద్యానవన కార్యాలయంలో వేంపల్లె, చక్రాయపేట, వివన్ పల్లి, యఱ్ఱగుంట్ల మండలాల రైతు సేవ కేంద్రాల సిబ్బందికి పిఎండిఎస్ పద్ధతిలో పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుకు సూచనలు చేశారు. ఎల్ నినో పరిస్థితి నుంచి ఉద్యానవన పంటలను కాపాడుకోవడానికి ప్రధానంగా ఐద అంశాలపై ప్రాధాన్యత సూచనలు చేశారు. వర్షాలు రాక ముందే పొడి భూమిలో విత్తనాలు వేసి కొద్ది పాటి తేమను వినియోగించుకుని వీటిని మొలకెత్తేలా చేయడం వంటి వాటిపై వివరించారు. వీటితో పాటు మామిడి, చీని, నిమ్మ తదితర పంటల్లో ఈ వీడ్ మ్యాట్ ని వేసుకోవాలని, దీని వల్ల నీరు ఆవిరి కాకుండా కాపాడుతుందన్నారు. పది ఎకరాల లోపు 90 శాతం సబ్సిడీ కింద డ్రిప్, స్ప్రింక్లర్లను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు ఈనెల ఆఖరికి గడువు ఉందని, రైతులు బీమా ప్రీమియం చెల్లించి తమ పంటలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎండిఎస్ ట్రైనర్ ప్రతాప్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం: ప్రభుత్వ పథకాలపై అవగాహన

## పులివెందులలో డోర్ టు డోర్ కార్యక్రమం ప్రారంభం

## ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తాం: జోగిరెడ్డి

ప్రజాభూమి,పులివెందుల ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు "ఇంటింటికీ తెలుగుదేశం" డోర్ టు డోర్ కార్యక్రమాన్ని సోమవారం పులివెందులలో లాంఛనంగా ప్రారంభించారు.



తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పాల్గొని శ్రీరామ హాల్ రోడ్డులోని పిజియో థెరపీ సాయి కిషోర్ క్లినిక్ వద్ద నుండి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్ రెడ్డిమాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకట్రాంరెడ్డి, మాజీ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్,హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా టి ఎన్ టి యు సి అధికార ప్రతినిధి నల్లగారి భాస్కర్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జోగిరెడ్డి మాట్లాడుతూలి ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికే చాలా వరకు నెరవేర్చిందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, పెంచిన పెన్షన్ అందజేస్తున్నామని చెప్పారు. త్వరలో నిరుద్యోగ భృతి అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వెల్లడించారు. అంతకుముందు పిజియో థెరపిస్ట్ సాయి కిషోర్ బాణాసంచా పేలుస్తూ నాయకులకు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాలతో, పూలహారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర జగదీష్ రెడ్డి, లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి,పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోగ్యం కోసం కాణిపాకంలో ప్రత్యేక పూజలు

## త్వరగా కోలుకోవాలని మొక్కులు: ధ్రువకుమార్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆరోగ్య క్షేమం కోసం పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. షర్మిలా రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా జీవితంలోకి రావాలని స్వామిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ధ్రువకుమార్ రెడ్డి మాట్లాడుతూ షర్మిలా రెడ్డి గారికి జరిగిన శస్త్ర చికిత్స విజయవంతమైందని, ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారని తెలిపారు. ఆమె ఆరోగ్యం మెరుగుపడుతుందన్న వార్త కాంగ్రెస్ శ్రేణులకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. అక్క షర్మిల ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఆమె మరోసారి ఉత్సాహంగా ప్రజల్లోకి వచ్చి నాయకత్వం వహించాలని స్వామిని కోరుకుంటున్నాం అని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారతరత్న అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం

## - ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం జీవితం ఆదర్శణీయం అని ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి అన్నారు. సోమవారం అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం తులసి రెడ్డి మాట్లాడుతూ కలలు కనండి, సాకారం చేసుకోండి అని అబ్దుల్ కలాం సందేశం యువతకు తారక మంత్రంలా పని చేసిందన్నారు. కలాం ఒక నిత్య విద్యార్థి అని, ఐక్యరాజ్య సమితి ఆయన జయంతి అక్టోబర్ 15న ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా ప్రకటించిందన్నారు. స్వియ ప్రతిభతో సామాన్యుడు, అసామాన్యుడు కాగలడని, ఒక పేపర్ బాయ్ శాస్త్రవేత్త కాగలడని అబ్దుల్ కలాం నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో వాహనం నడిపిన యువకుడికి 21 రోజులు జైలు శిక్ష



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

మద్యం మత్తులో వాహనం నడపడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. నిందితుడు తిమ్మినాయుడు పాలెం కు చెందిన లోకేష్ (27) సోమవారం కోర్టులో హాజరుపరచగా తన నేరాన్ని అంగీకరించడంతో మోటార్ వాహనాల చట్టం సెక్షన్ (185) (ఎ) క్రింద దోషిగా నిర్ధారించిన స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు 21 రోజులు సర్వసాధారణ కారాగార శిక్ష విధించారు.

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న సినీ హీరో సుమన్..!



ప్రజా భూమి ప్రతినిధి,
పాకాల:

తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, ఊట్లవారిపల్లి ఆనందగిరి పై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సోమవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిలిం.టెలివిజన్.థియేటర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సినీ



హీరో సుమన్ దర్శించుకున్నారు. ముందుగా ఆల్ ఇండియా సుమన్ అభిమాన సంఘం మాజీ అధ్యక్షుడు బత్తల నాగరాజ్,ఆలయ ఈవో యువరాణి,కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు,సిబ్బంది,అభిమానులు కలిసి సినీ హీరో సుమన్ కి పుష్ప గుచ్చం ఇచ్చి స్వాగతం పలికి,శ్యాలువా కప్పి సన్మానించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సినీ హీరో సుమన్ మాట్లాడుతూ శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఎంతో మహిమగల స్వామి అని, కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పు దైవమని అన్నారు. ఆగస్టు 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఆడికృతిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని,స్వామివారిని దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కాగలరని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో ప్రతిష్టించిన 54 అడుగుల సుబ్రహ్మణ్యశ్వర స్వామి విగ్రహం ఇక్కడ ఉందని చెప్పారు. స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఈకార్యక్రమంలో కార్యక్రమంలో సుమన్ అభిమానులు, భక్తులు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 5కే రన్‌లో సత్తా చాటిన ఉమర్ ఫరూక్

## -అభినందించిన కళాశాల యాజమాన్యం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణానికి చెందిన ఎస్‌డీజీఎస్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఉమర్ ఫరూక్ 5కే రన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చాడు. అతని అద్భుత ప్రదర్శనను గుర్తించిన సత్యసాయి ట్రస్ట్ గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేసి సత్కరించింది. ఈ సందర్భంగా ఎస్‌డీజీఎస్ కళాశాలలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు దాసా సురేష్ ఉమర్ ఫరూక్‌ను అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ఉమర్ ఫరూక్ సాధించిన విజయం కళాశాలకు గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యక్షులు దాసా సురేష్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుతూ సర్టిఫికెట్లు, పతకాలు సాధించాలని సూచించారు. క్రమశిక్షణ, కృషి, పట్టుదల ఉంటే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఉమర్ ఫరూక్‌కు అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రజాభూమి

జనరల్

మంగళవారం, జులై 28, 2026

12




## చిన్నగొల్లపాలెం జంట హత్యల కేసును ఛేదించిన కృష్ణాజిల్లా పోలీసులు

**పాత కక్షలతోనే మామ, అల్లుడి హత్యఆరుగురు నిందితుల అరెస్ట్ .. రిమాండ్‌కు తరలింపు**

**కారు, బైక్, కత్తులు, ఇనుప రాడ్లు స్వాధీనం**

**కేసును వేగంగా ఛేదించిన పోలీస్ బృందానికి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అభినందనలు**

మచిలీపట్నం క్రైమ్ ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లా చిన్నగొల్లపాలెం గ్రామంలో తీవ్ర సంచలనం సృష్టించిన మామ-అల్లుళ్ల జంట హత్యల కేసును కృష్ణాజిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా, సాంకేతిక ఆధారాలతో ఛేదించారు. చేపల వేటకు వెళ్లిన శెట్టి సుబ్బయ్య, గొలుసు అయ్యప్పలను పాత గొడవల మనసులో పెట్టుకుని అత్యంత దారుణంగా హత్య చేసిన ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బందరు డీఎస్పీ జి. శ్రీనివాసరావు కేసు పూర్వాపరాలను వెల్లడించారు.పాత గొడవలే హత్యకు కారణంచేపల వేటకు సంబంధించి పాత గొడవలను మనసులో పెట్టుకుని ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదే శాల మేరకు, మచిలీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి. శ్రీనివాస రావు పర్యవేక్షణలో పెడన సీఐ కే. నాగేంద్ర ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, భౌతిక సాక్ష్యాల ఆధారంగా నేరానికి పాల్పడిన నిందితులను గుర్తించారు.అరెస్ట్ అయిన నిందితులు:శంక రపు శ్రీను జల్లా నాగరాజు కళ్యాణ్శ్రీకాంత్అబ్దుల్ ఖాదర్ జిలానివిజయరత్నం @ దాసుఈ ఆరుగురు నిందితులను 26-07-2026 నాడు అరెస్టు చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.స్వాధీనం చేసుకున్న వస్తువులు:వాహనాలు: స్విఫ్ట్ డిజైర్ కార్ (AP16 TP 2283), పల్సర్ మోటార్ సైకిల్ (AP37 CX 1196)ఫోన్లు: 7 మొబైల్ ఫోన్లుఆయుధాలు: 1 కత్తి, 1 ఇనుప రాడ్డు, 1 సరుగుడు కర్రనేరం జరిగిన రోజు నిందితులు ధరించిన దుస్తులు.పోలీస్ బృందానికి జిల్లా ఎస్పీ ప్రశంసలు:ఈ సంచలనాత్మక కేసును అతి తక్కువ సమయంలో, అత్యంత సమర్థవంతంగా ఛేదించిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ప్రత్యేకంగా అభినందించారు.దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన మచిలీపట్నం డీఎస్పీ, పెడన సీఐ, కృతివెన్ను ఎస్ఐ, కంకిపాడు సీఐ బి.బి. రవికుమార్, ఆర్‌పేట సీఐ కె. ఏసుబాబు, ఎస్ఐ సందీప్, గూడూరు ఎస్ఐ దివ్య ప్రకాష్ మరియు సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు.ప్రజల్లో శాంతిభద్రత లను పరిరక్షించడంలో భాగంగా ప్రతి నేరాన్ని శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేసి, నేరస్తులను చట్టపరంగా కఠినంగా శిక్షించే దిశగా కృష్ణా జిల్లా పోలీసులు నిరంతరం కట్టుబడి పనిచేస్తారని వి. విద్యాసాగర్ నాయుడు తెలిపారు.

## ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలోని కోట ప్రాం తంలో ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం ఉర్దూ పాఠ శాలలో మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్ర పటానికి మండల విద్యాధికారి (ఎంఈ ఓ-1) డాక్టర్ హెచ్. గంగప్ప పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబంలో జన్మిం చిన కలాం తన కృషి, పట్టుదల, క్రమశిక్షణతో రామేశ్వరం నుంచి భారత రాష్ట్రపతి స్థాయికి ఎదిగి దేశానికి ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు. విద్యార్థులు కూడా కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసు కుని ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదివి దేశానికి సేవ చేయాలని సూచించారు. విజ్ఞాన శాస్త్రవేత్తగా, ప్రజల రాష్ట్రపతిగా, విలువలకు కట్టుబడి జీవించిన మహానుభావుడిగా కలాం దేశ ప్రజల హృద యాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలి పారు. విద్యార్థులకు బోధన చేస్తూనే షిల్లాంగ్‌లో ఆయన కన్నుమూసిన విషయాన్ని గుర్తు చేస్తూ, చివరి శ్వాస వరకు విద్యార్థుల కోసమే జీవించిన మహోన్నత వ్యక్తిగా కొనియాడారు. ఈ కార్యక్ర మంలో కాంప్లెక్స్ హెచ్ఎం రమణ, హెచ్ఎం రాము, బాల నారాయణస్వామి, ప్రభంజన్, నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు ఘనంగా నివాళులర్పించారు.

## నల్ల బ్యాడ్జీలతో పాలిటెక్నిక్ అధ్యాపకుల నిరసన

**-దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు తమ దీర్ఘకాలిక సమస్య లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సం ద ర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా సీఏఎస్ నోటిఫికేషన్ విడుదల కాక పో వడం, సకాలంలో పదోన్నతులు కల్పించకపోవడం, అలాగే జీవో నెం.10 ప్రకారం చెల్లించా ల్సిన బకాయిలను విడుదల చేయకపోవడం వంటి సమస్యలపై ఉన్నతాధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభి స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు ఉన్న కనీస హక్కులను పరిరక్షిస్తూ ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇకనైనా శీతకన్ను ధోరణిని వీడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. అధ్యాపకుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జీకేఎం నాయుడు, హరినాథ్ బాబు, అనిల్, ఫరూక్, శ్వేత, ధనలక్ష్మి, భార్గవి, వెంకటరమణన్, సత్యకీర్తి పాణితో పాటు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.




# మహిళల జీవనోపాధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలి

**ఉత్పత్తులకు మార్కెట్ కల్పించి స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలి**

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి



మహిళా సంఘాల జీవనోపాధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి, వారి ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ కల్పించడం ద్వారా ఆదాయా న్ని పెంచే దిశగా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశిం చారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పీడీ డీఆర్‌డీఏ, జిల్లా పశుసంవ ర్ధక శాఖ అధికారి, మత్స్యశాఖ అధికారి, ఆర్అం డ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, జిల్లా సమాచార శాఖ అధికారులు తదితరులతో సమా వే శమై జీవనోపాధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.సమావేశంలో గుర్రపు డెక్కతో ఉత్పత్తులు తయారు చేస్తున్న మహిళా సంఘా లకు అందించాల్సిన రివాల్వింగ్ ఫండ్, మార్కెటింగ్ సౌకర్యాలపై కలెక్టర్ సమీక్షిం చారు. ప్రస్తుతం మహిళా సంఘాలకు లభిస్తున్న ఆర్డర్లు, అవసరమైన ముడి పదార్థాల కొనుగోలుకు అవస రమైన నిధులు, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేం దుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అవసరానికి అనుగుణంగా రూ.5 లక్షల లోపు రివాల్వింగ్ ఫండ్ ప్రతిపాదనలు సమ ర్పించాలని, అనంతరం రీయింబర్స్ మెంట్ ప్రాతిపదికన నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని పీడీ డీఆర్‌డీఏను ఆదేశించారు. లేపాక్షి, ఇతర ఈ కామర్స్ ఆన్లైన్ వంటి సంస్థల తో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ మహి ళా సంఘాల ఉత్పత్తులకు మరిన్ని కొనుగో లు ఆర్డర్లు తీసుకురావాలని సూచించారు. అలాగే గోదావరి పుష్కరాలు, వేములవాడ, శ్రీకాళహస్తి, శ్రీశైలం, మోపిదేవి, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం వంటి సంస్థలతో సంప్రదింపులు జరిపి మార్కెట్ అవకాశాలను అన్వేషించాలని ఆదేశించారు.గుర్రపు డెక్క ఉత్పత్తుల కేటలాగ్‌లో ఉత్పత్తుల ధరలను స్పష్టంగా పొందుపరచాలని, మార్కెటింగ్‌కు అనుకూలంగా రూపొందించా లని కలెక్టర్ సూ చిం చారు. మహి ళలకు శిక్షణ మాత్రమే కాకుం డా నిరంతర ఉత్పత్తి, విక్ర యాలు జరిగే విధంగా మార్కెట్ అనుసం ధానం అత్యంత కీలకమని పేర్కొన్నారు.విజయవాడలో మహిళల ఉత్పత్తుల విక్రయాల కోసం ప్రత్యేక షోరూమ్ ఏర్పాటు అంశంపై కూడా సమావే శంలో చర్చిం చారు. తక్కువ వ్యయంతో ఆకర్షణీ యంగా షాప్‌ను రూపొందించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అమృత కృష్ణ ప్లాంట్ మరమ్మతుల అంశంపై సమీక్షించిన కలెక్టర్, ఒకే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని స్పష్టం చేశారు. సాంకేతిక నిపుణుల సూచనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుని ప్లాంట్ నిరంతరా యంగా పనిచేసేలా చూడాలని అధికారులకు ఆదే శించారు. గొర్రెల యూనిట్ల ఏర్పాటు కార్యక్రమా న్ని వేగవంతం చేయాలని, ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారులకు త్వరితగతిన యూనిట్లు మంజూరు చేసి గ్రౌండింగ్ పూర్తి చేయాలని సూచించారు. కృష్ణా జిల్లాలో గొర్రెల పెంపకానికి మంచి అవకాశాలు ఉన్నందున రైతులు, మహిళా సంఘాలకు ఇది లాభదాయకమైన జీవనోపాధి కార్యక్రమంగా అభివృద్ధి చేయాలని చెప్పారు. అలాగే గ్రీన్ క్లైమేట్ ఫండ్ (జీసీఎఫ్) కార్యక్రమాల పురోగతి, ఇంపాక్ట్ స్టడీ, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ఈ-మార్కెటింగ్, మహిళల కు సోషల్ మీడియా మార్కెటింగ్‌పై విజయవా డలో ప్రత్యేక శిక్షణ కల్పించే అంశాలపై కూడా సమీక్షించి, కార్యాచరణను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్డిఎ పిడి హరిహరనాథ్, పశు సంవర్ధక శాఖ అధికారి ఎం శ్రీనివాసరావు, మత్స్య శాఖ అధికారి అయ్యా నాగరాజా, ఉద్యా న శాఖ అధికారిణి జె జ్యోతి, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వ రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీంద్రారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ శ్రీనివాసరావు, జిల్లా సమా చార పౌర సంబంధాల అధికారి పి జయరావు, ఏడిఐఓ సెల్వినా తదితర అధికారులు పాల్గొన్నారు.

# సర్.. సర్వేలో మీ సహకారం భేష్!

**- మున్ముందు ఇదే సహకారాన్ని అందించండి**

**- ఈ నెల 31వ తేదీన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ**

**- ఈ నెల 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిములు, అభ్యంతరాల స్వీకరణ**

**- ప్రతి దరఖాస్తును అత్యంత పారదర్శకంగా పరిష్కరిస్తాం**

**- అక్టోబర్ 3వ తేదీన తుది జాబితా ప్రచురణ- రాజకీయ పార్టీల సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్ర మంలో కీలక దశ అయిన ఇంటింటి సర్వే ప్రక్రి యలో రాజకీయ పార్టీలు అందించిన సహకారం అభినందనీయమని.. ఇదే భాగస్వామ్య స్ఫూర్తిని క్లెయిములు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం ప్రక్రియలోనూ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు.కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 17,13,445 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా 15,89,731 ఫారాలను డిజిటైజేషన్ చేసినట్లు తెలిపారు. 55,813 డెత్ కేసులతో సహా శాశ్వతంగా వలస వెళ్లడం వంటి కారణాల వల్ల 1,23,714 ఫారాల సేకరణ వీలుపడలేదన్నారు. ఈ ప్రక్రియపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఈ నెల 31న ముసాయిదా జాబితాను ప్రచురించడం జరుగుతుందని.. ఇది పోలింగ్ కేంద్రాలు, బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉంటుందన్నారు. ఈ ముసాయిదా జాబితాలో పేర్లను సరిచూసుకోవచ్చని.. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 30వ తేదీ వరకు



ఆధారాలతో ఈఆర్‌వో లేదా ఏఈఆర్‌వోలకు దరఖాస్తు ద్వారా తెలియజేయవచ్చన్నారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 28వ తేదీ వరకు నోటీసుల దశతో పాటు క్లెయిములు, అభ్యంతరాలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

ఏవైనా లోటుపాట్లు ఉంటే అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో సరిదిద్దిన తర్వాతే అక్టోబర్ 3న తుది జాబితాను ప్రచు రించనున్నట్లు వివరించారు. ఈ షెడ్యూలుపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.ఫారం 6 ద్వారా కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తు:కొత్తగా ఓటు నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. వివరాల్లో సవరణ కోసం లేదా ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి పేరును బదిలీ చేసుకునేందుకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్లకు సహకరించే విధంగా ఈఆర్‌వో, ఏఈఆర్‌వో కార్యాలయాలు, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల వద్ద సహాయ కేంద్రాలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. అవసరమైన ఫారం 6, ఫారం 7, ఫారం 8లు కూడా అందుబాటులో ఉంటాయని వివరించారు. అందువల్ల అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు వై.రామయ్య (తెదేపా), వై.ఆంజనేయరెడ్డి (వైఎస్ఆర్‌సీపీ), జె.శ్రీనివాస్ (జనసేన), కె.గణేష్ (బీజేపీ), డీవీ కృష్ణ (సీపీఎం), పి.హరికృష్ణ (ఆప్) పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రజల కోసం కలెక్టరేట్‌లో




# ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**సుమారు 130 మందికి ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ ఆయుర్వేదం ద్వారా తక్కువ ఖర్చుతో దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు .... జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంద ర్శించి వైద్య సేవలను పరిశీలించారు. శిబిరంలో ప్రజలకు అందిస్తున్న చికిత్సలు, మందుల పంపిణీ, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఏహెచ్ఐఎంఎస్ (AHIMS) యాప్ ద్వా రా ఇప్పటివరకు ఎంతమంది రోగులు నమోదు చేసుకున్నారో సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డిజిటల్ విధానా లను సమర్థ వంతంగా వినియోగించాలని సూ చిం చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల కోసం ప్రత్యేకంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రజలు తమ పనులతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పించడం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంపొందుతుందని పేర్కొ న్నారు.

ఆయుర్వేదం భారతదేశానికి చెంది న ప్రాచీన వైద్య విధానమని, జీవనశైలి సంబంధిత వ్యాధుల నివారణలో, దీర్ఘకాలిక ఆరోగ్య సంరక్షణలో దీనికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు. తక్కువ ఖర్చుతో దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఆయుర్వేద వైద్యాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకె ళ్లాలని వైద్య అధికారులకు సూచించారు. ఆయుర్వేద వైద్యం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), చర్మవ్యాధులు, దగ్గు, రొంప, మోకాళ్ల నొప్పులు, కీళ్ల సంబంధిత వ్యాధులు తదితర ఆరోగ్య సమస్యలకు వైద్యులు పరీక్షలు నిర్వ హించి, అవసరమైన ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

రోగులకు ఆహార నియమాలు, జీవనశైలి మార్పులు, ఆయుర్వేద చికిత్స విధానాలపై కూడా వైద్యులు సూచనలు అందించారు. ఈ శిబిరంలో సుమారు 130 మంది ప్రజలు వైద్య సేవలను పొందగా, ఉచి తంగా మందులను అందజేశారు.ఈ కార్యక్ర మం లో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ వై.రత్న ప్రియదర్శిని, వైద్యులు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ మహమ్మద్ జుమీద్, వైద్య సిబ్బంది మరియు ఆయుష్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్‌కు వైఎస్సార్సీపీ సంఘీభావం

**-సమస్యల పరిష్కారం కోసం అండగా ఉంటామని హామీ**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజులేఖరుల సంక్షేమ సంఘం చేపట్టిన పెన్‌డౌన్ నిరసనకు హిందూపురంలో సోమవారం వైఎస్సార్సీపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. హిందూపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు చేరుకున్న వైఎస్సార్సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు బాలాజీ మనోహర్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు రామాంజనే యులు, బీసీ సెల్ టౌన్ అధ్యక్షులు నాగేంద్ర ప్రసాద్ తదితరులు దస్తావేజు లేఖరులను కలిసి సమస్యలను తెలుసుకుని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ మనోహర్ మాట్లాడుతూ, దస్తావేజు లేఖరులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సమస్యల పరిష్కారం కోసం అన్ని స్థాయిల్లో పోరాడుతామని హామీ ఇచ్చారు. మన్యంపల్లి



రామాంజనేయులు మాట్లాడుతూ, దస్తావేజు లేఖరుల జీవనోపాధికి భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ సెల్ టౌన్ అధ్యక్షుడు నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, లేఖరుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.


Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,opposite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

ప్రజాభూమి
జనరల్ 13
మంగళవారం 28 జూలై 2026

# అభివృద్ధి, సంక్షేమం, నమ్మకం కూటమి ప్రభుత్వ విజయాలు

- రాష్ట్ర అభివృద్ధి, గ్రామాల అభివృద్ధి కోసం నిర్విరామంగా పాటుపడుతున్నాం.
- ఆలమూరు, బడుగువానిలంక గ్రామాల్లో జరిగిన ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, సంక్షేమాన్ని సైతం అందిస్తారనే దృక్పథంతో, ప్రజలు అపారమైన నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి 94 శాతం స్ట్రైక్ రేట్ తో అధికారాన్ని అందించారని ఈ రెండేళ్ల పాలనలో ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు వ్యాఖ్యానించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా సోమవారం ఆలమూరు మండలం ఆలమూరు, బడుగువానిలంక గ్రామాల్లో ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, కూటమి నాయకులతో కల్సి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలందరినీ కలుసుకొని, గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. 45 రోజులపాటు కూటమినేతలందరూ ప్రజలను కలుసుకోవాలన్నారు. రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన విజయాలను తెలియజేయాలన్నారు. ఆలమూరు బడుగువానిలంక గ్రామాల్లో ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభించిందని తెలిపారు. గడిచిన రెండేళ్ల ఎన్డీఏ కూటమి పాలనలో ప్రధాని మోదీ,



ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్రయం ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. ప్రజల్ని కలుసుకుని వారితో మాట్లాడినప్పుడు వారు కూటమి పాలన పట్ల సంతృప్తి, సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత రెండేళ్లలో అమలైన సంక్షేమం, గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల గురించి ప్రజలే వివరిస్తున్నారని తెలిపారు. ఏనాడు ఊహించని మెజారిటీలతో ప్రజలు ఎన్డీఏ కూటమిని అధికారంలోకి తెచ్చారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం తన వంతుగా తాను కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. వైసీపీ గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. ఇక ఎన్నటికీ గొడ్డలి పార్టీ అధికారంలోకి రాకూడదనే ఉద్దేశంతో ప్రజలు అపారమైన నమ్మకంతో కూటమికి విజయాన్ని కట్టబెట్టారన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గ్రామ గ్రామాన జరుగుతున్న అభివృద్ధి, ఇంటింటికి అందుతున్న సంక్షేమం ఇందుకు నిదర్శనం అన్నారు. తాను శాసనసభ్యునిగా ఉన్నప్పుడు బడుగువాని లంకలో నిర్మించిన వంతెనకు పదేళ్ల శాసన సభ్యుడిగా ఉన్న మాజీ శాసనసభ్యుడు కనీసం అప్రోచ్ రోడ్డు కూడా వెయ్యలేకపోయారని విమర్శించారు. మరలా ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతే బడుగువానిలంక బ్రిడ్జ్ కి అప్రోచ్ రోడ్డు వేయడం జరిగిందన్నారు. గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని వెడల్పు చేయడం జరిగిందన్నారు. కల్వర్టును సైతం వెడల్పు చేసి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. లంక భూముల నదీ కోత నివారణకు రిలయన్స్ సహకారంతో గ్రోయిన్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గ్రామంలో అనేక మంది రైతులు గోకులాలు నిర్మించుకున్నారన్నారు. రాబోయే కాలంలో పుంత రోడ్ల అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. ఇంకా గ్రామంలో డ్రైన్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని మహిళలు కోరారని అవన్నీ నెరవేర్చడం జరుగుతుందన్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా ఇంట్లో ఉన్న చదువుకునే ప్రతీ బిడ్డకు రూ.13 వేలు చొప్పున తల్లుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. సామాజిక భద్రతా పింఛన్లలో భాగంగా నెల, నెలా రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు అందిస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందించడం జరిగిందన్నారు. గుంతలు లేని రహదారులను అభివృద్ధి చేసామన్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు.

## బాధితుల సమస్యలకు సత్వర న్యాయమే మా ప్రాధాన్యత జిల్లా ఎస్.పి.రాహుల్ మీనా

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో జిల్లా పోలీస్ కార్యాలయం నందు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా ఎస్.పి. రాహుల్ మీనా జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తే తో కలిసి స్వయంగా బాధితుల నుండి అర్జీలను స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితులతో ఎస్.పి. ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను ఓపికగా విని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 27 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు మరియు సివిల్ సంబంధిత సమస్యలు ఉన్నాయి.అందిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపిస్తూ, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఎస్.పి. అధికారులను ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని, ప్రతి ఫిర్యాదును అత్యంత పారదర్శకంగా, జాప్యం లేకుండా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్.పి. బాధితులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి. తో పాటు, అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తే డి.పి.ఓ. సిబ్బంది మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు

## అబ్దుల్ కలాంకు ఘన నివాళి

ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం.



భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా వి.ఆర్.పురంలోని అబ్దు ల్ కలాం స్కూల్ లో సోమవారం ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాదిరెడ్డి రామలక్ష్మి మాట్లాడుతూ దేశానికి శాస్త్ర, సాంకేతికపరంగా అబ్దుల్ కలాం ఎన్నో విజయాలను అందించారని, ఆధునిక భారతదేశపు గొప్ప జాతి నిర్మాతలలో ఏపీజే ఒకరని దేశానికి శాస్త్ర, సాంకేతికపరమైన ఎన్నో విజయాలను అందించి, మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొంది తన నిరాడంబరత, నిజాయితీ, మానవతా దృక్పథం వంటి విశిష్ట లక్షణాలతో ప్రజల రాష్ట్రపతిగా కలాం పిలువబడ్డారని ఆ మహనీయునికి నివాళులు' అర్పించారు ఆయన 'భారత క్షిపణి మానవుడు', ఇస్రో, డీఆర్‌డీఓ ద్వారా భారతదేశ అంతరిక్ష, రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసిన ప్రముఖ శాస్త్రవేత్త, భారతదేశ 11వ రాష్ట్రపతి, స్ఫూర్తిదాయకమైన ఉపాధ్యా యుడు, ఆధునిక భారతదేశపు గొప్ప జాతి నిర్మాతలలో ఒకరు అంటూ ఆమె కొనియాడారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు లహరి, అశ్విని, సుధారాణి, భవాని, కనక, తదితరులు పాల్గొన్నారు.

## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు దక్కించుకున్న మోడరన్ హైస్కూల్ విద్యార్థి షణ్మయి

-పలువురు ప్రసంశలు అభినందనలు.

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.



రామచంద్రపురం గోలిమంగాదేవి మోడరన్ హైస్కూల్లో నందు 8వ తరగతి చదువుతున్న షణ్మయి ప్రతిష్టాత్మక వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో పేరు దక్కించుకుంది. మే నెల రెండవ తేదీన రాజమహేంద్రవరం ఆనం కళాక్షేత్రంలో జరిగిన కూచిపూడి నాట్య కార్యక్రమంలో పాల్గొన్న షణ్మయి ఈ ఘనత సాధించింది. ఆ రోజు నిర్విరామంగా 12 గంటల పాటు అన్నమాచార్యుల 108 శ్లోకాలకు 200 మంది కూచిపూడి కళాకారులు నాట్యం చేశారని ఆమె తెలిపింది. ఈ సందర్భంగా షణ్మయిని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయిన్ జి. వి. రావు, అకాడమిక్ డైరెక్టర్ ఆర్. ఉమాదేవి, ప్రధానోపాధ్యాయుడు ఎం చిట్టిబాబు, హైస్కూల్ స్టాప్ అభినందిం చారు. షణ్మయి తండ్రి విశ్వనాథం ఎండోమెంట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తుండగా,తల్లి లావ ణ్య మోడరన్ హైస్కూల్ లో హిందీ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జి. వి.రావు మాట్లాడుతూ భవిష్యత్తులో షణ్మయి మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

## విఆర్ పురంకు ఎంఇఓ1నీ నియమించాలి



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

వి.ఆర్.పురం మండలనికి మండల విద్యా-శాఖాధికారి-1ను తక్షణమే నియమించాలని కోరుతూ, మండల ఉపాధ్యాయులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద, ఎంఈఓ కార్యాలయం వద్ద సోమవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జితాలు చెల్లింపులు, సర్వీస్ సమస్యలు పరిష్కరించుటకు జిల్లా ఉన్నతాధికారులు సొరవ తీసుకొని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహధ్యక్షుడు యస్ నాగేశ్వరావు. యూటీఎఫ్ జిఎస్ ఎన్ జగదీష్, ఏ టి ఎ అధ్యక్షుడు కె రాము. ఏటిఎ జిఎస్ కె కన్నయ్య, పిఆర్టియు మండల అధ్యక్షుడు కె లక్ష్మినారాయణ, అలాగే మండల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భూముల వివరాలు ఆన్ లైన్లో నమోదు చేయండి

ప్రజాభూమి ప్రతినిధి-తొట్టంబేడు



తొట్టంబేడు మండలంలోని చేమూరు దళితుల భూముల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి 1-బీలు వచ్చేలా చూడాలని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. పీజిఆర్ఎస్ సందర్భంగా చేమూరు దళితులతో కలిసి సోమవారం ఆయన ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 20 ఏళ్ల కిందట దళితులకు భూములు పంచినా, ఇప్పటివరకు వివరాలను ఆన్లైన్లో నమోదు చేయకపోవడం బాధాకరమని మణి వాపోయారు. ఫలితంగా దళితులు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలకు నోచుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి దళితుల భూముల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి 1-బీలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, చేమూరు దళితులు పాల్గొన్నారు.

# సిటిజన్ క్యూ ఆర్ కోడ్ - ప్రజల అభిప్రాయాలకు డిజిటల్ వేదిక

## జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్.

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీ.జీ. ఆర్.ఎస్.)లో సిటిజన్ క్యూ ఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీ.జీ. ఆర్.ఎస్.)లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు ప్రభుత్వ సేవలు పొందిన అనంతరం సిటిజన్ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను తప్పనిసరిగా నమోదు చేయాలని కోరారు. ఈ ఫీడ్‌బ్యాక్ ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మారడంతో పాటు ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు.ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడం, ప్రజల సంతృప్తి స్థాయిని నేరుగా తెలుసుకోవడం, అధికారుల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం సిటిజన్ క్యూ ఆర్ కోడ్ వ్యవస్థను అమలు చేస్తోందని కలెక్టర్ వివరించారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు సులభంగా కనిపించే ప్రదేశంలో సిటిజన్ క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్‌తో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, సంబంధిత సేవ పొందిన అనంతరం సేవల నాణ్యత, అధికారుల స్పందన, సమస్య పరిష్కార వేగం, కార్యాలయంలో పొందిన అనుభవం, సిబ్బంది వ్యవహారశైలి వంటి అంశాలపై తమ అభిప్రాయాలను నమోదు చేయవచ్చు.ఈ అభిప్రాయాలు నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి చేరుతాయి. వాటి ఆధారంగా సేవల్లో ఉన్న లోపాలను గుర్తించి సకాలంలో సరిదిద్దడం, అధికారుల పనితీరును సమీక్షించడం, ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలు నిర్భయంగా, నిష్పాక్షికంగా తమ అభిప్రాయాలను నమోదు చేయాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీ.జీ.



ఆర్.ఎస్.)లో మొత్తం 271 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు గీటురాయి, సేవల నాణ్యతే సుపరిపాలనకు ప్రమాణం అని అన్నారు. ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని, అదే సమస్యపై మళ్లీ అర్జీలు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.పీ.జీ.ఆర్.ఎస్.తో పాటు రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా వచ్చిన అర్జీలను ప్రత్యేకంగా పరిశీలించి, అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని సూచించారు.ఫిర్యాదు పరిష్కారం అనంతరం జిల్లా స్థాయి అధికారులు స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని, పరిష్కారం సాధ్యం కాని సందర్భాల్లో కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించడం, ఫిర్యాదుదారుడి సంతృప్తిని నిర్ధారించుకోవడం ప్రతి అధికారికి బాధ్యత అని స్పష్టం చేశారు.ప్రజలతో మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించేలా సేవలు అందించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి, డి.ఆర్.ఓ. వి. సుబ్బారావు, డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరెక్టర్ డి. రాంబాబు, డిప్యూటీ కలెక్టర్ కె. అచ్యుత కుమారి, డి.ఎల్.డి.ఓలు యు. విజయ్ భాస్కర్, విజయం లక్ష్మి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఎస్. రామ్ గోపాల్, జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లుగా పరారీలో ఉన్న గంజాయి కేసు ప్రధాన నిందితుడి అరెస్ట్

- సామర్లకోటలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న రోలుగుంట పోలీసులు
- రెండు పెండింగ్‌లు, మరొక కేసులో ప్రమేయం గుర్తింపు
- కేసు చాకచక్యంగా ఛేదించిన పోలీసు అధికారులకు ఎస్పీ తుహిన్ సిన్హా అభినందనలు

ప్రజాభూమి ప్రతినిధి-రోలుగుంట

గత ఐదేళ్లుగా పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న గంజాయి కేసు ప్రధాన నిందితుడిని



రోలుగుంట పోలీసులు ఈరోజు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

**కేసు వివరాలు :** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఉత్తర్వుల మేరకు, సుదీర్ఘకాలంగా పరారీలో ఉన్న నేరస్థులను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో, 2022 మే నెలలో మారుతి కారులో 60 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తూ పట్టు బడిన కేసులో ప్రధాన నిందితుడైన రత్నం పేటకు చెందిన అర్లి గణేష్ (తండ్రి: రాజా రావు) పరారీలో ఉన్నాడు. అప్పట్లో ఈ కేసు లో ఐదుగురిని అరెస్ట్ చేయగా, గణేష్ మాత్రం తప్పించుకున్నాడు.ప్రత్యేక బృందాల విచారణలో నిందితుడు సామర్లకోటలో నివాసముంటున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో, వెంటనే పోలీసులు అక్కడకు వెళ్లి చాకచక్యంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈరోజు కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి 14 రోజుల రిమాండ్ విధించింది.

**పాత కేసులు:**

అరెస్టయిన అర్లి గణేష్‌పై గతంలో నమోదైన రెండు గంజాయి కేసులలో నాన్-బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూ) పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

**పోలీస్ సిబ్బందికి అభినందనలు:**

ఐదేళ్లుగా లభించని నిందితుడి ఆచూకీ కనిపెట్టి అరెస్ట్ చేయడంలో కీలకపాత్ర పోషించిన కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, రోలుగుంట ఎస్ఐ రామకృష్ణారావు మరియు వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రజా పంపిణీ ద్వారా ప్రజలకు స్టీమ్ రైస్ అందేలా ఏర్పాట్లు

- రాష్ట్రంలో అమలుకు సన్నహాలు
- 1000 మీ మార్టుల ఏర్పాటుకు కేంద్రం సహకారం
- రేషన్ బియ్యం లో 10 శాతం నూకల బియ్యం ఉండేలా చర్యలు
- ఢిల్లీ పర్యటనలో పౌర సరఫరాల శాఖామాత్యులు ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులను కలిసిన రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖా మాత్యులు నాదెండ్ల మనోహర్

ప్రజాభూమి ప్రతినిధి-న్యూఢిల్లీ

ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు స్టీమ్ రైస్ అందించడం ద్వారా వారికి పౌర సరఫరాల శాఖ సేవలను మరింత చేరువ చేయొచ్చని, దీనిద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడంతో పాటు, బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని దీనికి కేంద్ర పౌర సరఫరాల శాఖ సహకారం ఎంతో అవసరమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ చెప్పారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఆయన ఢిల్లీలో కేంద్ర పౌర సరఫరాల శాఖామాత్యులు ప్రహ్లాద్ జోషితో పాటు శాఖ ఉన్నతాధికారులను వరుసగా కలిశారు. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (ఎన్సీసీఎఫ్) ఎండీ అనీస్ జోసఫ్ ని కలిసి రాష్ట్రంలో 1000 "మీమార్టు" ల ఏర్పాటుపై తగిన సహకారం కోరుతూ ఎంఓయూ చేసుకున్నారు. అనంతరం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ రవిశంకర్, పాలసీ అండ్ ఎఫ్సీఐ జాయింట్ సెక్రటరీ శిఖా ని కలిశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మనోహర్ సీఎంఆర్ సేకరణ, స్టీమ్ రైస్ పంపిణీ, మీ మార్టుల ప్రారంభం, రాష్ట్రం



నుంచి విదేశాలకు ఎగుమతులు వంటి అనేక అంశాలను చర్చించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక పాయింట్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాలను చేపడుతున్నవిషయాన్ని కేంద్ర మంత్రివర్యుల వద్ద ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రావల్సిన అనుమతులు, సహకారం, పెండింగ్ నిధుల విషయాలను ప్రత్యేకంగా మంత్రివర్యుల ముందుంచారు. రాష్ట్రంలోని 41 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్టీమ్ రైస్ వాడకం ద్వారా అందుతున్న నాణ్యమైన భోజనంపై సానుకూలత ఉందని, దీన్ని ప్రజాపంపిణీ వ్యవస్థకు అనుసంధానం చేసి పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ఒక జిల్లాలో మొదలుపెట్టేలా అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రివర్యుల నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు. బియ్యం సంచులపై ఆర్ఎఫ్ఐడీ ను ముద్రించడం ద్వారా అక్రమ రవాణా అరికట్టడానికి దోహదపడుతుందని, దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలన్నారు. రేషన్ బియ్యం లో 10 శాతం నూకల బియ్యం అందిస్తే, ప్రజా పంపిణీలో మంచి ఫలితాలు ఉంటాయని, దీన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే వివిధ అంశాలపై కేంద్ర మంత్రివర్యులతో సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. మంత్రి వెంట పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు , పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, తదితరులు ఉన్నారు.

# సేంద్రియ నానో ఎరువులపై తర్లంపూడిలో శిక్షణ

## వ్యవసాయ అధికారి అశోక్



**ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు**

కాజులూరం మండలం తర్లంపూడిలో ఆత్మ పథకంలో భాగంగా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం ,నానో ఎరువుల పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు . ఈకార్యక్రమం కరప బ్లాక్ వారి ఆధ్వర్యంలో, మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ అధ్యక్షతన జరిగింది . తర్లంపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, నానో ఎరువుల వినియోగం మరియు ఎల్నినో ప్రభావంపై రైతులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృత చర్చ జరిగింది.శిక్షణ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పులు , ఎల్నినో ప్రభావం వల్ల పంటలపై పడే దుష్ప్రభావాన్ని అరికట్టడానికి రైతులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి వివరించారు. భూసారాన్ని కాపాడుకుంటూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు సేంద్రియ వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.అలాగే ఇఫ్కో ప్రతినిధి శ్యామ్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకునే మార్గాలను వివరిస్తూ 'నానో ఫెర్టిలైజర్స్' ఆవశ్యకతను రైతులకు చెప్పారు. నానో యూరియా మరియు నానో డిఏపిలను పంటల్లో ఏ విధంగా, ఏ పాళ్లలో పిచికారీ చేయాలో రైతులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులు, ముఖ్యంగా వరి సాగులో ఆచరించాల్సిన మెళుకువలను రైతులకు వివరించారు. భూమిని సారవంతంగా ఉంచడానికి జీవామృతం, వేస్ట్ డీకంపోజర్ మరియు వివిధ రకాల కషాయాల తయారీ, వాటి వినియోగ విధానాన్ని తెలియజేశారు. ఇదే సమయంలో పిఎండిఎస్ ప్రాముఖ్యతను సైతం రైతులకు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ప్రశాంత్, విఏఏ దుర్గాప్రసాద్, ఇఫ్కో ప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు అధిక సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనంటే నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం.

-ఇంటింట ప్రచార కార్యక్రమానికి శ్రీకారం.



**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వ బలమని, రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనలో నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం ప్రతి పేద వర్గానికి అందించామని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రెండేళ్ల నమ్మకం-సంక్షేమం, అభివృద్ధి 45 రోజుల ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నికల హామీల మేరకు అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గత వైసిపి పాలన వల్ల గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు గాడిలో పెట్టారన్నారు. అనేక పరిశ్రమలు, వ్యాపార పెట్టుబడులతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ సమర్థవంతమైన పరిపాలన అందించడం జరుగుతుందని, స్త్రీలకు ఉచిత బస్సు సౌకర్యం, పిల్లల చదువులకు తల్లికి వందనం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ, అన్నదాత సుఖీభవ తదితర పథకాల ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ప్రజా పాలన అందించామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ కూటమి ప్రభుత్వం సూపరి పాలన సాగిస్తుందని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, క్లస్టర్,కో క్లస్టర్ బూత్, ఇన్చార్జి లు, వార్డు కమిటీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అంతటా "స్మార్ట్ కిచెన్ల" విస్తరణ..!

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**ప్రజాభూమి ప్రతినిధి-కడప**

జిల్లాలో కిచెన్ మేనేజర్లుగా ఎస్.హెచ్.జి. మహిళల ఆధ్వర్యంలో వినూత్నంగా అమలవుతున్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థ.. దేశానికే స్ఫూర్తిగా నిలుస్తున్నందుకు జిల్లా యంత్రాంగం గర్వించదగ్గ విషయం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో.. స్మార్ట్ కిచెన్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, మరింత విస్తృత పరిచేలా చేపట్టిన అదనపు స్మార్ట్ కిచెన్ ల నిర్మాణ పురోగతిపై.. సంబంధిత కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్మార్ట్ కిచెన్ నిర్వహణ బాధ్యతలను కిచెన్ మేనేజర్లుగా మహిళా సంఘాల సభ్యులకు అప్పగించడంతో మహిళల సమర్థ నిర్వహణతో విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన, పోషకాహారం సకాలంలో అందుతోందన్నారు.స్మార్ట్ కిచెన్‌లో తయారవుతున్న భోజనంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వస్తున్న సానుకూల స్పందన ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. అందుతున్న సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు.జిల్లాలో ప్రస్తుతం దశలవారీగా స్మార్ట్ కిచెన్ల విస్తరణ వేగంగా కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో ఏర్పాటైన కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తుండగా, రెండు, మూడో దశలోని కేంద్రాలు విస్తరణ దశలో ఉన్నాయని, నాలుగో దశలో విస్తరిస్తున్న భవనాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు వేగవంతంగా కొనసాగుతోందని వివరించారు. ప్రతి విద్యార్థికి కూడా భోజన ప్లేట్ యూనిక్‌గా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ అంశాలన్నింట్లో కూడా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని స్మార్ట్ కిచెన్ల నిర్వహణలో భాగంగా.. శుచిగా, రుచిగా వంట వండడం, సకాలంలో రవాణా, సంతృప్తి స్థాయిలో వడ్డించడం.. మొదలైన అంశాల్లో పనితీరుపై సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.త్వరలో జిల్లాలో ప్రతి రోజూ సుమారు లక్ష మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. దేశంలోనే ఏ సంస్థ అమలు చేయని స్థాయిలో అత్యాధునిక సాంకేతికత, పటిష్టమైన నిర్వహణ వ్యవస్థ, నాణ్యత ప్రమాణాలతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి అధికారి, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి స్మార్ట్ కిచెన్ వ్యవస్థను జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో స్మార్ట్ కిచెన్ నోడల్ అధికారి జోయెల్ విజయకుమార్, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి, ఎపి సీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ అనురాధ, ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

-ప్రత్యామ్నాయ పంటలు, నీటి యాజమాన్యం, పంటల బీమాపై వివరాలు



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

తాళ్లపూడి మండలంలోని కుకునూరు, వేగేశ్వరపురం గ్రామాల్లో రైతులకు "ఎల్‌నినో ప్రభావం - ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్యం, పంటల బీమా" అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు ఎల్‌నినో ప్రభావంతో సంభవించే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి వినియోగంలో మితవ్యయం పాటించడం, పంటల బీమా పథకంలో నమోదు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.పంటల బీమా ప్రీమియం వివరాలను తెలియజేస్తూ, వరి పంటకు ఎకరానికి రూ.570, మినుము పంటకు ఎకరానికి రూ.300, అరటి పంటకు ఎకరానికి రూ.3,000 ప్రీమియంగా చెల్లించాలని సూచించారు. రుణం తీసుకున్న రైతులు తమ బ్యాంకులు లేదా సహకార సంఘాల (సొసైటీలు) ద్వారా, రుణం తీసుకోని రైతులు సీఎస్‌సీ కేంద్రాలు లేదా పంటల బీమా పథకం పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు.ఎల్‌నినో ప్రభావం వల్ల కలిగే నష్టాల నుంచి పంటలకు ఆర్థిక రక్షణ కల్పించుకోవడానికి ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా పథకంలో నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు.అలాగే వరి పంటకు ప్రీమియం చెల్లించేందుకు చివరి తేదీ ఆగస్టు 15, 2026, మినుము, అరటి పంటలకు జూలై 31, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. గడువు తేదీలోపు ప్రీమియం చెల్లించి పథకం ప్రయోజనాలు పొందాలని రైతులకు సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వైభవంగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం

- ప్రధాని మోదీకి ధింసా, కూచిపూడి నృత్యాలతో ఘన స్వాగతం
- ఉత్తరాంధ్రకు గర్వకారణంగా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయం
- ఏఎస్ఆర్ ఎయిర్ పోర్టుపై ప్రతీ ఇంటికీ చేరేలా విస్తృత ప్రచారం
- ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి**

ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్ట్ 1న ప్రారంభం అవుతున్న అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్ర ప్రగతిలో కీలక మైలురాయి అవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో రాష్ట్ర విమానయాన రంగంలో నూతన శకం ప్రారంభం అవుతుందని సీఎం స్పష్టం చేశారు. ఆధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం ఈ ప్రాంతంలో ప్రయాణ సౌకర్యాలతో పాటు ఉపాధి, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతం ఇస్తుందని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రతో పాటు తెలుగు జాతికి గర్వకారణంగా మారనున్న విమానాశ్రయం ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. ప్రధాని మోదీకి గిరిజన సంప్రదాయ నృత్యం ధింసా, కూచిపూడి నృత్యంతో స్వాగతం పలకాలని అధికారులకు సీఎం సూచించారు. గిన్నిస్ రికార్డు సృష్టించేలా ఎక్కువ మందితో ధింసా నృత్య ప్రదర్శన ఉండాలని స్పష్టం చేశారు. అలాగే అరకు కాఫీ సహా స్థానిక పర్యాటకానికి బ్రాండింగ్ జరుగుతుందన్నారు.

**ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు విస్తృత ప్రచారం**

ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు థీమ్ తో విమానాశ్రయం గురించి ప్రతీ ఇంటా చర్చ జరిగేలా విస్తృత ప్రచారం జరగాలని.. మహిళలు, యువత, పాఠశాల విద్యార్థులు ఇలా వివిధ వర్గాలకు చేరువయ్యేలా వేర్వేరు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అవుట్ రీజ్ కార్యక్రమాలు, క్విజ్, ఉపన్యాస పోటీలు, ఫ్లాష్ మాబ్‌లు, డ్రోన్ షోలను నిర్వహించాలన్నారు. స్థానిక పారిశ్రామిక వేత్తలతోనూ రౌండ్ టేబుల్ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు థీమ్‌తో 3-5కే రన్ లాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారిని కూడా విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం జరిగేలా చూడాలని సూచించారు. మరోవైపు విమానాశ్రయం టెర్మినల్ భవనం ప్రారంభించిన అనంతరం ఇంధన, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖలకు చెందిన రూ.18 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని అధికారులు వివరించారు.

**2.30 గంటల పాటు భోగాపురంలో ప్రధాని పర్యటన**

ఆగస్టు 1 తేదీ ఉదయం 10.45 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు ప్రధాని మోదీ చేరుకుంటారు. విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబులు స్వాగతం పలకనున్నారు. 10.58 గంటలకు విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించనున్నారు. అనంతరం సీఎం, గవర్నర్ తదితరులతో కలిసి ప్రధాని మోదీ టెర్మినల్ భవనాన్ని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి బహిరంగ సభా వేదికకు ఓపెన్ టాప్ వాహనంలో ప్రయాణించనున్న ప్రధాని మోదీకి 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు సంప్రదాయ గిరిజన ధింసా నృత్యంతో ఘన స్వాగతం పలకనున్నారు. 11.30 నుంచి 12.55 గంటల వరకూ బహిరంగ సభలో పాల్గొని, అనంతరం ప్రధాని 1.10 గంటలకు ఢిల్లీకి తిరిగి వెళ్లనున్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు భోజన కంచాల విరాళం



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మానవత పూర్వ అధ్యక్షులు, భగవద్గీత పాఠశాల నిర్వాహకులు వెలుగుబంటి శ్రీనివాస్ తన 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని 50 భోజన కంచాలను విరాళంగా అందజేశారు.అలాగే శుభదిన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు స్వీట్, అరటిపండు, పెరుగు వంటి రిఫ్రెష్‌మెంట్స్‌ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్లూరి విక్రమాదిత్య మాట్లాడుతూ, వెలుగుబంటి శ్రీనివాస్ చేపడుతున్న సేవా కార్యక్రమాలతో పాటు మానవత సంస్థ సమాజానికి అందిస్తున్న సేవలను అభినందించారు.పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బారనాల శంకర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల్లో జరిగే పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి శుభ సందర్భాల్లో శుభదిన్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తి భోజనం లేదా రిఫ్రెష్‌మెంట్స్ అందించి సేవ చేయవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, మానవత సంస్థ సభ్యులు, విద్యార్థులు వెలుగుబంటి శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షులు తైలం పోచారావు, ఎస్. రాజశేఖర్, ఏ.వి. హనుమంతరావు, అయినాల మునేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు కె. ప్రసన్నకుమార్, ఈ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 396 ఉపసంహరించాలి బీజేపీ నేత పాలూరికి దస్తావేజుల లేఖరుల వినతి



**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట: రిజిస్ట్రేషన్ శాఖ సేవలతో పాటు దస్తావేజుల తయారీ బాధ్యతలను రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.396ను వ్యతిరేకిస్తూ దస్తావేజుల లేఖరులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 31 వరకు పెన్‌డౌన్ సమ్మె నిర్వహిస్తున్న నేపథ్యంలో కొత్తపేట రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట దస్తావేజుల లేఖరులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందంకు లేఖరులు వినతిపత్రం అందజేశారు. తమ సమ్మెకు మద్దతు ప్రకటించడంతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి జీవో నెం.396ను ఉపసంహరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల కుటుంబాలు దస్తావేజుల లేఖరులు, అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నాయని లేఖరులు తెలిపారు.

వినతి పత్రం స్వీకరించిన పాలూరి సత్యానందం మాట్లాడు తూ, లేఖరుల జీవనోపాధికి సంబంధించిన ఈ అంశాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి. ఎన్. మాధవ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆయన ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖరుల సమస్యలను వివరించి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కోటిపల్లి దామోదర్, మండల దస్తావేజుల లేఖరుల సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వం



**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని మండల వైయస్సార్ కాంగ్రెస్ కమిటీ సోమవారం విమర్శించింది. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ అర్హులైన వితంతువులకు, వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు కొత్త పెన్షన్లు కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మభ్యపెడుతుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎప్పటి వరకు అర్హులైన పేదలకు ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తవి ఇవ్వకపోగా గతంలో వారోత్సవం ఉన్న సుమారు రెండు నుంచి మూడు లక్షల మంది వృద్ధులు దివ్యాంగులు పెన్షన్లను ప్రభుత్వం అన్యాయంగా తొలగించిందని మండిపడ్డారు. అర్హుల గుర్తింపు పేరుతో అధికారులు చేపట్టిన వెరిఫికేషన్ ప్రక్రియ దివ్యాంగులకు తీవ్ర ఇబ్బందులు మానసిక శోభను మిగిల్చిందని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క కొత్త పెన్షన్ మంజూరు చేయలేదని, అలాగే ఎన్నికల ముందు వాగ్దానం చేసిన 50 సంవత్సరాల నుండి ప్రతి వారికి పెన్షన్లు ఇస్తామని, అలాగే 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని, అలాగే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని, హామీలు ఇచ్చి ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని వారన్నారు. గతంలో వచ్చిన వరదల్లో వరద బాధితులకు ప్రతి కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి సంవత్సరం కావస్తున్న ఇంతవరకు వరద డబ్బులు ఇవ్వలేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాదిరెడ్డి సత్తిబాబు, చిక్కాల బాలు, వడ్డానపు రాజారావు, ముత్యాల జయరాజు పాల్గొన్నారు.